www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

10 నిమిషాలు.. 3 ప్రమాదాలు!

అతి వేగానికి ఐదు ప్రాణాలు బలి

ఆగివున్న లారీని ఢీకొన్న కోడిగుడ్ల లారీ

వెనుకే వచ్చి ఢీకొట్టిన మరో లారీ.. ముగ్గురి మృతి

ట్రాఫిక్ జామ్‌తో 200 మీటర్ల వరకూ ఆగిన వాహనాలు

లారీ వెనుక ఆగివున్న కారుని ఢీకొట్టిన మరో లారీ

ఇద్దరి దుర్మరణం.. మరో ఇద్దరి పరిస్థితి విషమం

ఒంగోలు వద్ద కొప్పోలు ఫ్లై ఓవర్ సమీపంలో ప్రమాదాలు

3



వరికోత మిషన్‌తో వచ్చిన లారీ ఢీకొట్టడంతో నుజ్జునుజ్జయిన కోడిగుడ్ల వాహనం

సోమవారం | 5-5-2025 | పేజీలు: 12 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 19

శ్రీ విశ్వావసు నామసంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, వైశాఖమాసం, శుక్లపక్షం, తిథి: అష్టమి ఉ.7:36 తదుపరి నవమి, నక్షత్రం: ఆశ్లేష మ.2:01 తదుపరి మఖ, వర్జ్యం: రా.2:56-4:39, దుర్ముహూర్తం: మ.12:37-1:28, మ.3:09-4:00, అమృతఘడియలు: మ.12:20-2:01, రాహుకాలం: 7:30-9:00, సూర్యోదయం: 5:50, సూర్యాస్తమయం: 6:33

విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

త్రివిధ దళాలతో ప్రధాని సమావేశాలు

త్రిముఖ దాడులకు సిద్ధం.. బ్లూప్రింట్ రెడీ

వారంలో కార్యాచరణ, నిర్దిష్ట చర్యలు!



కొట్టేది గట్టిగానే!

పాక్‌పై భారీ దాడికి సంకేతాలు?.. వేగంగా పరిణామాలు

కనిపించే విధంగా దాడి.. అరేబియా సముద్రంలో నేవీ సర్వసన్నద్ధం

ఎల్‌వోసీ సమీపంలో యుద్ధ విమానాలు.. సరిహద్దు వెంబడి 'ఎయిర్ డిఫెన్స్'

పెద్ద ఎత్తున ఆర్మీ కదలికలు.. రష్యా నుంచి ఇగ్లా-ఎస్ క్షిపణుల కొనుగోళ్లు

పంజాబ్‌లో ఇద్దరు పాక్ గూఢచారుల అరెస్టు.. సరిహద్దుల్లో 8 చోట్ల కవ్వింపులు

బాగ్లిహార్ డ్యామ్ నీటి నిలిపివేత.. పాకిస్థాన్‌లో మొదలైన యుద్ధ భయం

యుద్ధం వస్తే బ్రిటన్‌కు పారిపోతానన్న ఆ దేశ ఎంపీ అఫ్జల్ ఖాన్

4 రోజులకే ఖాళీ కానున్న పాక్ శతఘ్ని గుండ్లు.. ఉక్రెయిన్‌కు విక్రయాల వల్లే

పాక్ గొప్పలన్నీ తప్పులే!.. పీఎల్15 క్షిపణులపై ఆర్భాటపు ప్రచారం

వాటి వాస్తవ రేంజ్ 120 కిలోమీటర్లే కానీ 300 కి.మీ.లు అంటూ డంబాలు

న్యూఢిల్లీ, మే 4 (ఆంధ్రజ్యోతి): సీమాంతర ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తూ.. ఉగ్రవాదుల స్వర్గధామంగా మారిన పాకిస్థాన్‌పై భారత్ భారీ దాడికి సిద్ధమైందా? ప్రపంచ దేశాలకు తమ ప్రతిచర్య స్పష్టంగా కనిపించేలా పెద్ద దెబ్బ కొట్టనుందా? సర్జికల్ దాడితో సరిపెట్టకుండా.. గట్టిగా బుద్ధి చెప్పాలనే నిర్ణయించుకుందా? త్రివిధ దళాలతో.. త్రిముఖ వ్యూహంతో పాక్ నడ్డివిరచనుందా? వేగంగా మారుతున్న పరిణామాలు చూస్తే ఈ ప్రశ్నలకు అవుననే సమాధానం వస్తోంది. ఆదివారం నియంత్రణ రేఖ(ఎల్‌వోసీ) వెంబడి 8చోట్ల పాక్ సైన్యం కవ్వింపు చర్యలకు పాల్పడగా.. భారత్ దీటుగా బదులిచ్చింది. సరిహద్దుల్లో భారీగా సైన్యాన్ని, 'ఎయిర్ డిఫెన్స్' వ్యవస్థలను మోహరించింది. ఆర్మీ కదలికల సమాచారాన్ని శత్రుదేశానికి పంపుతున్న ఇద్దరు గూఢచారులను పంజాబ్‌లో అరెస్టు చేసింది. అరేబియా సముద్రంలో యుద్ధ విమాన వాహక నౌకను మోహరించడంతోపాటు పాక్ తీరానికి 85 నాటికల్ మైళ్ల దూరంలో.. గుజరాత్ తీరాన నౌకాదళ విన్యాసాలను నిర్వహిస్తోంది. లద్దాఖ్, జమ్మూకశ్మీర్ బేస్‌లలో భారత

మిగతా 2వ పేజీలో...

పహల్గాం ఉగ్రదాడి పాక్-చైనాల ఉమ్మడి కుట్ర

బహుళజాతి కంపెనీలు చైనా నుంచి భారత్‌కు తరలిపోకుండా అడ్డుకునేందుకే దాడి

యుద్ధం మొదలైతే భారత్‌కు పోవని యోచన

పాక్ రిటైర్డ్ మేజర్ ఆదిల్ రజా సంచలన ఆరోపణ

2014-19మధ్య ఏం జరిగిందో గుర్తుందా? మేధావుల ముసుగులో కొందరు... తటస్థుల అవతారంలో మరికొందరు... సామాజిక వేత్తలమంటూ ఇంకొందరు ఒక పథకం ప్రకారం అప్పటి చంద్రబాబు ప్రభుత్వాన్ని తప్పుపడుతూ, విమర్శిస్తూ వచ్చారు. ఈ బృందంలో మాజీ అధికారులూ ఉన్నారు. తెరముందు కనిపించేది వీరు! కానీ... తెరవెనుక ఉండి నడిపించింది మాత్రం వైఎస్ జగన్మోహన్ రెడ్డి! అప్పట్లో టీడీపీ ప్రభుత్వం ఏర్పడిన మూడేళ్లకు ఈ విష ప్రచారం మొదలైంది. ఇప్పుడు... కూటమి సర్కారు ఏర్పాటై ఏడాదైనా కాకముందే 'కుట్రల వ్యూహం' మొదలైంది. జగన్ ప్రభుత్వంలో ప్రధానమైన పదవి అనుభవించిన... ఒక అధికారి ఈ దిశగా రహస్య సమావేశాలు నిర్వహిస్తున్నారు.

జగన్ విపక్షంలో ఉన్నప్పుడు... జగన్ సీఎం అయ్యాక ఆయనతో బాగా అంటకాగిన మరో రిటైర్డ్ ఐఏఎస్‌ను కూడా ఈ 'ముఠా'లో కలవాల్సిందిగా ఆహ్వానించారు. 'సార్ కోసం కలిసి పని చేద్దాం! మీరూ వస్తే బాగుంటుంది' అని ఆయనను పిలిచారు. అయితే... అప్పుడు చేసిన తప్పుల వల్ల తన పేరు ప్రతిష్ఠలన్నీ మంటగలిసిపోయాయని, మళ్లీ అలాంటి పనులు చేయబోనని ఆయన ఒక నమస్కారం పెట్టినట్లు తెలిసింది.

విషం చిమ్ముదాం

సర్కారుపై జగన్ 'ముఠా' వ్యూహం!



వారాంతంలో హైదరాబాద్‌లో రహస్య భేటీలు

కడప జిల్లాకు చెందిన మాజీ ఐఏఎస్ సారథ్యం

రిటైర్డ్, ప్రస్తుత అధికారులతో మంత్రాంగం

ముఠాలో సుమారు పాతికమంది సభ్యులు

ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేయడమే అజెండా

'బ్యూరోక్రాట్' తెలివి తేటలన్నీ వాడాలని నిర్ణయం

టికెట్ ఇస్తామనే హామీతో ఒక అధికారికి వల

రాజధాని సమాచారమంతా చేరవేస్తున్న ఆ ఆఫీసర్

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

అసత్యాలు, అర్ధసత్యాలు, వక్రీకరణలు, లేని దురుద్దేశాలు అంటగట్టడం, కులాల మధ్య చిచ్చు పెట్టడం... విపక్షంలో ఉండగా వైఎస్ జగన్మోహన్ రెడ్డి అజెండా ఇదే! దీనికోసం 'మేధావులు, తటస్థులు, మాజీ అధికారులు, సామాజిక వేత్తలు' అనే ముసుగులో తన సొంత సైన్యాన్ని ప్రయోగిస్తారు. 2014-19లో ఇదే చేశారు. ఇప్పుడు కూడా అదే చేస్తున్నారు. ప్రభుత్వ విశ్వసనీయతపై విషం చిమ్మేందుకు తెరవెనుక తతంగం మొదలుపెట్టారు. జగన్ హయాంలో అడ్డగోలుగా మేళ్లు పొందిన పలువురు ఐఏఎస్, ఐపీఎస్, ఇతర అధికార బృందం ఇందులో క్రియాశీలకంగా ఉంది. వీరిలో కొందరు రిటైర్డ్ అధికారులు కాగా... మరికొందరు ఇప్పటికీ సర్వీసులో ఉన్న వారే.

హైదరాబాద్ కేంద్రంగా...

కడప జిల్లాకే చెందిన ఓ రిటైర్డ్ ఐఏఎస్... జగన్‌కు వీర భక్తుడు. ఎందరో సీనియర్లను పక్కనపెట్టి... ఆయనను జగన్ ప్రధాన పోస్టులో కూర్చోబెట్టారు. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వంపై దాడి కుట్రల భేటీలకు ఆయనే సారథ్యం వహిస్తున్నారు. గతంలో జగన్ ప్రభుత్వంలోని ఇద్దరు అధికారులకు ఒకరంటే మరొకరికి పడేది కాదు. ఇప్పుడు జగన్‌కోసం ఆ ఇద్దరూ ఒక్కటయ్యారు. ఇలా ఇద్దరితో మొదలైన బృందం ఇప్పుడు ఏకంగా పాతికకు

మిగతా 11వ పేజీలో...

అకాల వర్షం.. తీరని నష్టం

మండు వేసవిలో భారీ వర్షంతో సర్వత్రా అతలాకుతలం

8 మంది దుర్మరణం

వేల ఎకరాల్లో మామిడి, వరికి నష్టం

దెబ్బతిన్న అరటి, బొప్పాయి, కొబ్బరి, మొక్కజొన్న

పిడుగులు పడి ఆరుగురు మృత్యువాత

చెట్టు కూలి ఓ బాలుడు, విద్యుదాఘాతంతో మరొకరు

విద్యుత్ స్తంభాలు విరిగి సరఫరాకు అంతరాయం

విజయవాడ, కాకినాడల్లో ముంచెత్తిన జోరువాన

ఉభయ గోదావరి జిల్లాల్లో భారీ నష్టం

మంత్రుల సమీక్ష.. నేడు, రేపు భారీ వర్షసూచన

ఎక్కడికక్కడ నిలిచిన కరెంటు సరఫరా

యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ చర్యలు



ఏలూరు జిల్లా ముసునూరు మండలం లోపూడిలో నేలరాలిన మామిడికాయలు



పశ్చిమ గోదావరి జిల్లా ఆచంట వేమవరంలో తడిసి ముద్దయిన ధాన్యం రాశులు

మండువేసవిలో అకాలవర్షం అతలాకుతలం చేసింది. ఉరుములు, మెరుపులు, వడగండ్లు, పిడుగులు, ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం బీభత్సం సృష్టించింది.

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా చాలా ప్రాంతాల్లో గాలివాన హోరెత్తించింది. ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం ఆయా ప్రాంతాల్లో గంటల కొద్దీ వాన దంచికొట్టింది. పిడుగులు పడి ఆరుగురు, చెట్టు కూలి ఓ బాలుడు, విద్యుదాఘాతంతో మరొకరు మరణించారు. పెనుగాలులు, భారీ వర్షానికి వేలాది ఎకరాల్లో మామిడి, వరి, బొప్పాయి, మొక్కజొన్న, అరటి పంటలు దెబ్బతిన్నాయి. ముఖ్యంగా మామిడి, వరి రైతులకు భారీ నష్టం వాటిల్లింది. ఈదురుగాలులకు చాలా చోట్ల భారీ వృక్షాలు, చెట్లు, విద్యుత్ స్తంభాలు పడిపోయాయి. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వర్షపు నీరు భారీగా రోడ్లపై నిలవడంతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు. ఉమ్మడి ఉభయగోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో గంటకు 40-50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో

మిగతా 12వ పేజీలో...



విశాఖ ఏయూ ఇంజనీరింగ్ కళాశాల పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థిని చెప్పులు విడిపించి మరీ తనిఖీ

ఘాటుగా నీట్

బెంబేలెత్తించిన భౌతికశాస్త్ర ప్రశ్నలు

45 ప్రశ్నలకుగాను 25 రాస్తే గొప్పే

మిగతా సబ్జెక్టుల్లోనూ కష్టమైన ప్రశ్నలు

450 స్కోర్ వస్తే జనరల్ కేటగిరీలో సీటు!

గడియారాలు లేక ఇబ్బందిపడ్డ విద్యార్థులు

జూన్ 14న ఫలితాలు.. నెలాఖరులోగా కీ

హైదరాబాద్/అమరావతి, మే 4 (ఆంధ్రజ్యోతి): భౌతిక శాస్త్రంలో 16 ప్రశ్నలు బెంబేలెత్తించాయి! రసాయన శాస్త్రంలో 15 ప్రశ్నలు బెదరగొట్టాయి!! బోటనీలో 14, జువాలజీలో ఆరు ప్రశ్నలు చాలా కష్టంగా వచ్చాయి! ఒక్కమాటలో చెప్పాలంటే.. వైద్య విద్యలో ప్రవేశాల నిమిత్తం ఆదివారం దేశవ్యాప్తంగా నిర్వహించిన జాతీయ అర్హత పరీక్ష (నీట్-యూజీ 2025) ప్రశ్నపత్రం ఘాటుగా, అత్యంత కఠినంగా ఉంది! పరీక్షా కేంద్రాల లోపలికి అనుమతించే సమయంలో అభ్యర్థులను సిబ్బంది క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. గడియారాలు, ఇతర గ్యాడ్జెట్లను తీసివేయించారు. ఎప్పటిలాగానే.. ఒక్క నిమిషం ఆలస్యం నిబంధనను కచ్చితంగా అమలు చేశారు. రకరకాల కారణాల వల్ల సమయానికి పరీక్షా కేంద్రాలకు చేరుకోలేకపోయిన విద్యార్థులు, వారి

మిగతా 10వ పేజీలో...

చౌకబారు విమర్శలను తిప్పికొట్టండి

ఏ మంచి కార్యక్రమం చేపట్టినా వైసీపీ దుష్ప్రచారం: చంద్రబాబు

ఈ నెలలోనే 'అన్నదాతా సుఖీభవ'

జూన్ తొలి వారంలో 'తల్లికి వందనం'

చదువుకునే పిల్లలకు రూ.15 వేలు

సూపర్-6 హామీలు అమలుచేస్తున్నాం

వీటన్నిటినీ ప్రజల్లోకి తీసుకెళ్లాలి

నామినేటెడ్ పదవుల్లో అధిక శాతం భర్తీ

త్వరలోనే మిగతావీ పూర్తి చేస్తాం

18కల్లా సంస్థాగత నియామకాలు

మహానాడు తర్వాత రాష్ట్ర కమిటీ

ప్రధాని సభతో ప్రపంచం దృష్టిని ఆకర్షించిన అమరావతి: సీఎం

పార్టీ నేతలతో టెలీకాన్ఫరెన్స్

టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చి జూన్ 12 నాటికి ఏడాది పూర్తవుతుంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను టీడీపీ శ్రేణులు ప్రజల్లోకి తీసుకెళ్లాలి.

5 కోట్ల మంది ఆత్మగౌరవానికి అమరావతి ప్రతీక. యువతకు అవకాశాలు, ఉద్యోగాలు కల్పించే విశ్వనగరంగా రూపుదిద్దుకుంటుంది.

- సీఎం చంద్రబాబు



అమరావతి మే 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏ మంచి కార్యక్రమం చేపట్టినా వైసీపీ చౌకబారు విమర్శలు చేస్తోందని ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు ధ్వజమెత్తారు. దాని దుష్ప్రచారాన్ని పార్టీ శ్రేణులు తిప్పికొట్టాలని పిలుపిచ్చారు. 11 నెలల్లోనే స్పష్టమైన మార్పులు చూపించి ప్రజలకు నమ్మకాన్ని కలిగించామన్నారు. గుజరాత్‌లో సుస్థిర ప్రభుత్వం ఉండడంతో

మిగతా 11వ పేజీలో...



4 వేల ఎకరాలు.. 80 వేల కోట్లు

రాజధానిలో ల్యాండ్ మానిటైజేషన్‌తో నిధులు

ఎకరం రూ. 20 కోట్లకు విక్రయించాలని నిర్ణయం

అమరావతిలో వివిధ ప్రాజెక్టులకు వినియోగం

తీసుకున్న రుణాల తిరిగి చెల్లింపులకు కూడా

రెండో దశ ల్యాండ్ మానిటైజేషన్ జాబితాలో రియల్ ఎస్టేట్ సంస్థలకు 60:40 నిష్పత్తిలో భూములు

అభివృద్ధి చేసిన గృహాలు, విల్లాలు, కమర్షియల్ స్పేస్, ప్లాట్ల రూపంలో ప్రభుత్వానికి సమకూరనున్న ఆస్తులు

భవిష్యత్తులో ఆర్థిక ఇబ్బందులు తలెత్తకుండా ప్రణాళికలు

(విజయవాడ-ఆంధ్రజ్యోతి)

"రాజధాని అమరావతి సెల్ఫ్ ఫైనాన్సింగ్ ప్రాజెక్టు. రాష్ట్ర బడ్జెట్ నుంచి ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయకుండా... ప్రజలపై భారం పడకుండా ప్రపంచ స్థాయి నగరాన్ని నిర్మిస్తున్నాం" అని సీఎం చంద్రబాబు ఇప్పటికే పలుమార్లు ప్రకటించారు. దీనికి అనుగుణంగా రాజధాని అమరావతిలో ల్యాండ్ మానిటైజేషన్ పాలసీకి సీఆర్‌డీఏ శ్రీకారం చుట్టనుంది. తొలిదశలో రాజధాని పరిధిలోని 4వేల ఎకరాలను ఈ జాబితాలోకి తీసుకురానుంది. ఈ భూములను ఎకరం రూ.20కోట్లు చొప్పున విక్రయించడం ద్వారా రూ.80వేల కోట్లు సమీకరించనుంది. ఈ నిధులను రుణసంస్థల నుంచి తీసుకున్న అప్పులు తిరిగి చెల్లించడానికి ఉపయోగించాలని

మిగతా 12వ పేజీలో...

మాకెందుకీ అన్యాయం?

3

డీఎస్సీ అర్హతకు మార్కుల 'గండం'

డిగ్రీలో 50 శాతం ఉండాలని నిబంధన

బీఈడీ జనరల్ అభ్యర్థుల ఆవేదన

2011 కంటే ముందు బీఈడీ విద్యార్థులకు ఎన్‌సీటీఈ 'మార్కు'ల మినహాయింపు

సుప్రీం ఆదేశాలతో మార్గదర్శకాల మార్పు

ఏపీ డీఎస్సీలో అమలుకాని ఆ సడలింపు

తెలంగాణలో జనరల్‌కు 45 శాతమే



పాక్‌కు సైనిక రహస్యాలు.. ఇద్దరి అరెస్టు

చండీగఢ్, మే 4: భారత్, పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్తతలు నెలకొన్న వేళ పంజాబ్‌లో సైనిక కంటోన్మెంట్లు, వైమానిక ఎయిర్ బేస్‌ల సమాచారం, చిత్రాలు పాక్‌కు చేరవేస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు పంజాబ్ పోలీసులు ఆదివారం తెలిపారు. అధికార రహస్యాల చట్టం కింద పాలక్ షేర్ మాసి, సూరజ్ మాసి అనే ఇద్దరు వ్యక్తులను అమృత్‌సర్ రూరల్ పోలీసులు శనివారం అరెస్టు చేశారు. ప్రాథమిక విచారణలో పాకిస్థాన్ ఇంటెలిజెన్స్ వర్గాలతో వారికి సంబంధాలు ఉన్నాయని గుర్తించినట్లు పంజాబ్ డీజీపీ గౌరవ్ యాదవ్ 'ఎక్స్'లో పోస్టు చేశారు. అమృత్‌సర్ సెంట్రల్ జైలులో ఉన్న హర్‌ప్రీత్ సింగ్ అలియాస్ పిట్టు ద్వారా వీరు పాక్ ఇంటెలిజెన్స్ వర్గాలతో సంబంధాలు ఏర్పరచుకున్నారని తెలుసుకున్నారు. మరోవైపు, జమ్ము, కశ్మీర్‌లోని రంబన్ జిల్లాలో ఆదివారం ట్రక్కు లోయలో పడి ముగ్గురు సైనికులు మృతి చెందారు. 44వ నెంబరు జాతీయ రహదారిపై ఉదయం 11.30 గంటలకు ఈ ఘటన చోటు చేసుకుంది. జమ్ము నుంచి శ్రీనగర్ వెళుతోన్న సైనిక కాన్వాయ్‌లోని ఈ ట్రక్కు అదుపు తప్పి ఈ ప్రమాదం జరిగింది.

యుద్ధం వస్తే ఇంగ్లండ్ వెళ్లిపోతా: పాక్ ఎంపీ



న్యూఢిల్లీ, మే 4: పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో భారత్, పాకిస్థాన్ మధ్య యుద్ధం జరుగుతుందేమోనని భయాందోళనల నేపథ్యంలో పాక్ ఎంపీ షేర్ అఫ్జల్ ఖాన్ మర్వాత్ చేసిన వ్యాఖ్యలు ఆ దేశ పరిస్థితిని చెబుతున్నాయి. భారత్‌తో యుద్ధం మొదలైతే దేశం వదిలి ఇంగ్లండ్ వెళ్లిపోతానని అఫ్జల్ ఖాన్ అన్నారు. ఒకవేళ భారత్‌తో యుద్ధం ప్రారంభమైతే తుపాకీ తీసుకుని మీరు కూడా సరిహద్దుకు వెళతారా ? అని విలేకరులు అడిగిన ప్రశ్నకు ఆయన ఈ విధంగా బదులిచ్చి షాకిచ్చారు. అంతేకాక, ఉద్రిక్తతలను తగ్గించేందుకు భారత ప్రధాని మోదీ యుద్ధం విషయంలో వెనక్కి తగ్గే అవకాశముందా ? అని విలేకరులు అడిగిన ప్రశ్నకు కూడా వింత సమాధానం ఇచ్చారు. 'మోదీ ఏమైనా మా అత్త కొడుకా ? నేను చెబితే వెనక్కి తగ్గడానికి' అంటూ వెటకారం చేశారు.

పహల్గాం ఉగ్రదాడి పాక్-చైనాల ఉమ్మడి కుట్ర

» పాక్ రిటైర్డ్ ఆర్మీ అధికారి మేజర్ అదిల్ రజా ఆరోపణ

ఇస్లామాబాద్, మే 4: పహల్గాం ఉగ్రదాడి పాక్-చైనాల ఉమ్మడి కుట్ర అని పాక్ రిటైర్డ్ ఆర్మీ అధికారి మేజర్ అదిల్ రజా ఆరోపించారు. చైనా నుంచి కంపెనీలు భారత్‌కు తరలిపోకుండా అడ్డుకునేందుకే ఈ దాడి జరిపించాయన్నారు. అమెరికా-చైనాల మధ్య వాణిజ్య యుద్ధం వల్ల కంపెనీలు చైనాను వీడి భారత్‌కు పోతుండటమే దాడికి ప్రధాన కారణంగా ఆయన చెప్పారు. అతిపెద్ద తయారీ దారు దేశంగా ఉన్న పేరు ప్రతిష్ఠలు దెబ్బతింటుండటంతో కలవరపడిన చైనా.. పాక్ ఆర్మీ చీఫ్ మునీర్‌తో కలిసి ఈ దాడికి కుట్ర పన్నిందని అదిల్ రజా వెల్లడించారు. పాక్‌తో యుద్ధానికి దిగితే భారత్‌లో కల్లోలం ఏర్పడి కంపెనీలు తరలింపు యోచన విరమించుకుంటాయనేది చైనా యోచన అన్నారు.

ఎల్వోసీ వెంట 8 చోట్ల పాక్ కాల్పులు

న్యూఢిల్లీ, మే 4: పాకిస్తాన్ సైన్యం కాల్పుల విరమణను ఉల్లంఘిస్తూనే ఉంది. వరుసగా పదో రోజూ నియంత్రణ రేఖ (ఎల్వోసీ) వెంట కాల్పులు జరిపింది. శనివారం రాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకు జమ్మూకశ్మీర్‌లోని కుప్వారా, బారాముల్లా, పూంఛ్, రాజౌరీ, మెంధర్, నౌషెరా, సుందర్‌బని, అఖ్నూర్ ప్రాంతాల్లో చిన్నస్థాయి ఆయుధాలతో కాల్పులకు పాల్పడినట్టు రక్షణ వర్గాలు వెల్లడించాయి. భారత సైన్యం కూడా దీటుగా బదులిచ్చిందని తెలిపాయి. భారత పోర్టుల్లోకి పాక్ నౌకలు రాకుండా నిషేధించిన నేపథ్యంలో.. పాకిస్థాన్ కూడా ఇదే తరహా నిర్ణయాన్ని ప్రకటించింది. భారత్‌కు చెందిన, భారత జెండా ఉన్న నౌకలేవీ పాక్ పోర్టుల్లోకి రాకుండా నిషేధించింది. పాక్ నౌకలేవీ భారత పోర్టులకు వెళ్లవద్దంటూ ఆదేశించింది.

ఫిరోజ్‌పూర్ కంటోన్మెంట్‌లో బ్లాకౌట్ రిహార్సల్

» యుద్ధ సన్నద్ధతలో భాగంగా పరిశీలన

ఫిరోజ్‌పూర్, మే 4: పాక్‌తో యుద్ధం మొదలైతే ఎలా వ్యవహరించాలన్న దానిపై పంజాబ్‌లోని ఫిరోజ్‌పూర్ కంటోన్మెంట్‌లో బ్లాక్ అవుట్ రిహార్సల్ నిర్వహించారు. ఆదివారం రాత్రి 9 గంటల నుంచి 9.30 వరకు అరగంట పాటు ఈ డ్రిల్ చేశారు. సాధారణంగా యుద్ధ సమయాల్లో రాత్రిపూట అకస్మాత్తుగా వైమానిక దాడులు చేస్తుంటారు. ఎక్కువ నష్టం కలిగించడం కోసం నగర, పట్టణ ప్రాంతాలనే లక్ష్యాలుగా ఎంచుకుంటారు. యుద్ధ విమానాల పైలట్లు విద్యుద్దీపాల కాంతిని బట్టి పట్టణాలను గుర్తిస్తారు. అదే మొత్తంగా అన్ని లైట్లు ఆర్పేస్తే.. పట్టణాలను గుర్తించడం కష్టం. దీన్నే బ్లాకౌట్‌గా చెబుతారు.

పాక్‌లో ప్రభుత్వ ఆఫీసులకు బీఎల్‌ఏ నిప్పు

ఇస్లామాబాద్, మే 4: భారత్‌తో ఉద్రిక్తతల వేళ పాకిస్థాన్‌లో బలోచ్ లిబరేషన్ ఆర్మీ మిలిటెంట్ల దాడులు దాయాది దేశాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. బలూచిస్థాన్‌లోని కలాత్ జిల్లా మంగోచర్ ప్రాంతంలో మిలిటెంట్లు పలు ప్రభుత్వ భవనాలకు నిప్పు పెట్టారు. జ్యుడీషియల్ కాంప్లెక్స్, పాక్ జాతీయ బ్యాంక్‌లకు నిప్పుపెట్టారు. తుపాకులతో వచ్చిన 40 మంది బీఎల్‌ఏ మిలిటెంట్లు క్వెట్టా-కరాచీ హైవేపై రాకపోకలను అడ్డుకున్నారు. మరో ఘటనలో ఖైదీలను తీసుకెళ్తున్న పోలీసు వాహనాన్ని అడ్డుకున్నారు. ఖైదీలను విడిచిపెట్టి పోలీసులను కిడ్నాప్ చేశారు. అనంతరం పాక్ భద్రతా బలగాలు జరిపిన ఆపరేషన్‌లో ఇద్దరు పోలీసులను విడిచిపెట్టినట్లు తెలిసింది.

కొట్టేది గట్టిగానే!



(మొదటిపేజీ తరువాయి)

వాయుసేన మోహరించింది. అంతేకాదు.. రక్షణ వ్యవస్థలైన ఇగ్లా-ఎస్‌లను అత్యవసరంగా పెద్దమొత్తంలో కొనుగోలు చేస్తోంది. ఇప్పటికే అందుబాటులో ఉన్న ఇగ్లా-ఎస్, ఇతర క్షిపణి రక్షణ వ్యవస్థలను సరిహద్దులకు తరలించింది. స్ట్రాటోస్ఫిరిక్ ఎయిర్‌షిప్ ప్లాట్‌ఫామ్ తొలి విమాన పరీక్షను విజయవంతంగా పూర్తిచేసింది. అటు ప్రధాని మోదీ వరుసగా త్రివిధ దళాధిపతులను భేటీ అవుతూ.. సర్వసన్నద్ధతపై ఆరా తీస్తున్నారు. మరోవైపు పాకిస్థాన్‌లో యుద్ధ భయం నెలకొంది. రోజూ ఏదో ఒక ప్రకటన చేస్తున్న ఆ దేశ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ గగనతల యుద్ధం తప్పదని తాజాగా వ్యాఖ్యానించారు. యుద్ధం వస్తే బ్రిటన్‌కు పారిపోతానని ఏకంగా ఓ ఎంపీ ప్రకటన చేయగా.. అణుబాంబులు వేస్తామంటూ రష్యాలోని పాక్ రాయబారి భారత్‌ను హెచ్చరించారు. అయితే.. భారత్‌తో యుద్ధమే వస్తే.. ఆయుధాల పరంగా పాకిస్థాన్ చావుదెబ్బ తినే ప్రమాదాలున్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. శతఘ్నుల్లో వినియోగించే 155 ఎంఎం గుండ్ల నిల్వలు భారీగా పడిపోయాయని, నాలుగు రోజులకు మాత్రమే సరిపోతాయని పాక్ సైన్యాధికారులే చెబుతున్నారు. ఇప్పటికిప్పుడు వాటి తయారీ అసాధ్యమని పాకిస్థాన్ కోర్ కమాండర్ల సమావేశంలో ఆందోళన వ్యక్తం కావడం గమనార్హం.! ఈ అంశంపై పాక్ ఆర్మీ మాజీ చీఫ్ అసిమ్ బాజ్వా తీవ్ర ఆందోళన వ్యక్తం చేయగా.. మరో విశ్రాంత సైన్యాధికారి ఏకంగా పహల్గాం దాడి వెనక పాక్-చైనా కుట్ర ఉందని ఆరోపించారు. భారత ప్రభుత్వం సన్నద్ధతను బట్టి.. ఈ వారంలో యుద్ధ కార్యాచరణ పూర్తవుతుందని, పాక్‌పై నిర్దిష్ట చర్యలకు ప్రకటన చేసే అవకాశాలున్నాయనే వాదనలు వినిపిస్తున్నాయి.

త్రివిధ దళాల బ్లూప్రింట్ సిద్ధం!

భారత త్రివిధ దళాలు పాక్‌తో యుద్ధానికి సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఆదివారం ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్ ప్రధాని మోదీ కీలక సమాలోచనలు జరిపారు. ఈ భేటీతో త్రివిధ దళాధిపతులతో మోదీ వేర్వేరు భేటీలు పూర్తయినట్లయింది. గతనెల 30న ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేదీతో విస్తృత చర్చలు జరిపారు. శనివారం నేవీ చీఫ్ అడ్మిరల్ దినేశ్.కె.త్రిపాఠీతో చర్చించారు. త్రివిధ దళాధిపతులు ముగ్గురూ పాకిస్థాన్‌పై త్రిముఖ దాడి చేసేందుకు తాము సర్వసన్నద్ధంగా ఉన్నామని మోదీకి వివరించినట్లు సమాచారం. అదే సమయంలో పాకిస్తాన్ ఎదురు దాడి చేస్తే తిప్పికొట్టేందుకు చేస్తున్న సన్నాహాలను కూడా వారు వివరించారు. వ్యూహ-ప్రతివ్యూహాలు ఎలా ఉండనున్నాయో వెల్లడించారు. దీంతో.. ఈ సారి త్రివిధ దళాలూ ఏదో రూపంలో పాకిస్థాన్‌ను చుట్టుముట్టి, కోలుకోలేని విధంగా దెబ్బకొట్టేలా ప్రణాళికలు రూపొందిస్తున్నాయనే చర్చ జరుగుతోంది. ఒకవైపు సరిహద్దుల్లో నియంత్రణ రేఖ దాటి దూసుకువెళ్లేందుకు సైన్యం ఉరకలు వేస్తుండగా, ఆక్రమిత కశ్మీర్‌లోని నిర్దిష్ట ఉగ్రవాద శిబిరాలపై దాడులు చేసేందుకు వైమానిక దళం క్షిపణి దాడులకు సిద్ధమైనట్లు చర్చ జరుగుతోంది. అరేబియా సముద్రంలో మోహరించిన యుద్ధ నౌకలు కూడా దీర్ఘశ్రేణి క్షిపణి దాడులకు సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. త్రివిధ దళాలు నిర్దిష్ట కార్యాచరణ, బ్లూప్రింట్‌తో సిద్ధంగా ఉండగా.. మోదీ సర్కారు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడమే ఆలస్యమని రక్షణ శాఖ వర్గాలు చెబుతున్నాయి. అందుకే.. ఈ నెల 9న జరగనున్న 'రష్యా విక్టరీ డే'కు భారత్ తరఫున వెళ్లాల్సిన ప్రతినిధి పేరు మారుతూ వస్తోంది. తొలుత ప్రధాని మోదీ ఈ కార్యక్రమానికి వెళ్లాల్సి ఉండేది. ఆయన స్థానంలో రాజ్‌నాథ్ సింగ్ వెళ్తారని కేంద్రం చెప్పింది. తాజాగా రక్షణశాఖ సహాయమంత్రి సేథ్ వెళ్తారని ప్రకటించింది. యుద్ధం మొదలైతే.. ప్రధాని, రక్షణ మంత్రి భారత్‌లో ఉండడం అనివార్యమని, అందుకే వారు ఆ కార్యక్రమానికి వెళ్లడం లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

వేగంగా పరిణామాలు..

భారత్ ఏదో చేయనుందనడానికి వేగంగా మారుతున్న పరిణామాలు సంకేతాలనిస్తున్నాయి. గత నెల 29న ప్రధాని మోదీ ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భాగవత్‌తో భేటీ అయ్యారు. ఇప్పటికే రెండు సార్లు భద్రతావ్యవహారాల క్యాబినెట్ భేటీ జరగ్గా.. ఈ వారం మరోమారు సమావేశం కానున్నట్లు తెలుస్తోంది. విదేశాంగ మంత్రి జైశంకర్‌తో పాటు.. మన దేశ రాయబారులు ఇప్పటికే అన్ని ముఖ్యమైన, మిత్రపక్ష దేశాలకు పరిస్థితిని వివరించారు. దాదాపు అన్ని దేశాలు పెద్దఎత్తున మద్దతు ప్రకటించాయని విదేశాంగ శాఖ ప్రతినిధి జైస్వాల్ ప్రకటించారు. మరోవైపు, ఇప్పటికే పాకిస్థాన్ తన మిత్ర దేశాలతో సంప్రదింపులు జరుపుతోంది. ముఖ్యంగా ఆర్గనైజేషన్ ఆఫ్ ఇస్లామిక్ కోఆపరేషన్(ఓఐసీ)తో భారత్‌పై ఒత్తిడి తీసుకువచ్చే ప్రయత్నం చేస్తోంది. ఐక్య రాజ్య సమితి(ఐరాస) భద్రతామండలిలో భారత్ చర్యలపై(సింధు జలాల ఒప్పందం నిలిపివేత, సరిహద్దు వెంబడి ఉద్రిక్తత) సోమవారం ఫిర్యాదు చేయనున్నట్లు సమాచారం. అదే సమయంలో బలూచిస్థాన్‌లో వేర్పాటు వాదులకు.. సైన్యానికి మధ్య జరుగుతున్న ఘర్షణలు మరింత తీవ్రమయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. తుర్కియే, సౌదీఅరేబియా, మలేసియా.. ఇతర ఇస్లామిక్ దేశాలతో పాకిస్థాన్ చర్చలు జరుపుతున్నా.. భారత్‌కు వ్యతిరేకంగా మద్దతును కూడగట్టుకోవడంలో సఫలం కావడం లేదని తెలుస్తోంది. భారత్‌తో ఘర్షణల నేపథ్యంలో నిర్వహించే అఖిలపక్షానికి హాజరయ్యేది లేదని పాక్‌లో ఇమ్రాన్ నేతృత్వంలోని ప్రతిపక్ష పార్టీ పీటీఐ స్పష్టం చేసింది. ఈ పరిణామాల నేపథ్యంలో మోదీ సర్కారు తన యాక్షన్ ప్లాన్‌ను అమలు చేస్తే..పాక్‌కు చావు దెబ్బ తప్పదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.


ప్రజలు కోరేది తప్పక జరుగుతుంది

భారత్‌పై దాడులకు ప్రయత్నించేవారికి తగిన రీతిలో సమాధానం చెబుతామని రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ హెచ్చరించారు. "సరిహద్దుల్లో రక్షణతోపాటు.. సైనికులను, భారత పౌరులను కాపాడడం రక్షణ మంత్రిగా నా బాధ్యత. ప్రధాని మోదీ పనితీరు, ఆయనకు ఉన్న పట్టుదల గురించి అందరికీ తెలుసు. ఆయన నాయకత్వంలో ప్రజలు కోరుకున్నది కచ్చితంగా జరిగి, తీరుతుందని నేను హామీ ఇస్తున్నా" అని వ్యాఖ్యానించారు. ఢిల్లీలో ఆదివారం జరిగిన సంస్కృతి జాగరణ్ మహోత్సవ్‌లో ఈ వ్యాఖ్యలు చేశారు.

యుద్ధం వస్తే 4 రోజులకే పాక్ శతఘ్ని గుండ్లు ఖాళీ!

న్యూఢిల్లీ, మే 4: భారత్‌తో యుద్ధం వస్తే.. పాకిస్తాన్ వద్ద ఉన్న శతఘ్ని గుండ్ల నిల్వలు 4రోజులకే ఖాళీ అయిపోతాయని, ఆ దేశం ఇబ్బందుల్లో పడుతుందని సమాచారం. రష్యాతో యుద్ధం సందర్భంగా ఉక్రెయిన్‌కు పాకిస్థాన్ భారీగా ఈ గుండ్లను విక్రయించడంతో.. నిల్వలు తగ్గిపోయాయి. నిజానికి ఏ దేశమైనా భూతల దాడులకు దిగాలన్నా.. శత్రువు దాడులను ఎదుర్కోవాలన్నా.. శతఘ్నులు, ఎం-109 హవిట్జర్లకు 155 ఎంఎం శతఘ్ని గుండ్లు, బీఎం-21 వ్యవస్థలకు సంబంధించిన 122 ఎంఎం రాకెట్లు చాలా అవసరం. వీటిల్లో పాక్ చాలా వరకు 155 ఎంఎంలను ఉక్రెయిన్‌కు విక్రయించింది. పహల్గాం ఉగ్రదాడి తర్వాత భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతలు పెరగడంతో.. ఈ నెల 2న జరిగిన పాకిస్థాన్ కోర్ కమాండర్ల సమావేశంలో 155 ఎంఎం శతఘ్ని గుండ్ల విషయంలో ఆందోళనలు వ్యక్తమైనట్లు సమాచారం. "96 గంటల్లోనే(నాలుగు రోజులు) మన వద్ద ఉన్న శతఘ్ని గుండ్ల నిల్వలు ఖాళీ అయిపోతాయి. ఇప్పటికిప్పుడు వాటిని తయారు చేయడం కూడా అంత సులభమేమీకాదు" అని అధికారులు అభిప్రాయపడ్డారని తెలిసింది. ఇప్పటికిప్పుడు భారత్ దాడి చేస్తే.. పాక్‌కు ఇబ్బందులు తప్పవని రక్షణ నిపుణులు చెబుతున్నారు.

లోకం తీరు



భారత సైన్యానికి 'ఇగ్లా'

» రష్యా నుంచి అధునాతన క్షిపణుల దిగుమతి

న్యూఢిల్లీ, మే 4: పహల్గాం ఉగ్రదాడి తర్వాత దాయాది పాకిస్థాన్‌తో ఉద్రిక్తతల నేపథ్యంలో భారత్ తన వైమానిక రక్షణ సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేస్తోంది. రష్యా నుంచి రూ.250 కోట్ల విలువైన అధునాతన ఇగ్లా-ఎస్ మిసైల్స్ దిగుమతి చేసుకుంది. సైనిక దళాల క్షిపణి సామర్థ్యాన్ని పెంచడానికి కేంద్ర ప్రభుత్వం సైన్యానికి ఇచ్చిన అత్యవసర అధికారాలను ఉపయోగించి వీటిని కొనుగోలు చేశారు. కొన్ని వారాల క్రితమే ఇవి భారత్‌కు చేరుకున్నట్టు రక్షణ వర్గాలు తెలిపాయి. తాజా పరిస్థితుల్లో ఇగ్లా-ఎస్ మిసైల్స్‌ను సరిహద్దుల్లో సిద్ధం చేస్తున్నారు. అంతేగాక భారత సైన్యం మరో 48కి పైగా లాంచర్లు, 90 ఇగ్లా-ఎస్ మిసైల్స్ కొనుగోలుకు టెండర్ జారీ చేసింది. భారత సైన్యం 1990 నుంచే ఇగ్లా-ఎస్ మిసైల్స్‌ను ఉపయోగిస్తోంది. తాజాగా రష్యా నుంచి దిగుమతి చేసుకున్నవి అధునాతనమైనవి. ఈ స్వల్ప శ్రేణి క్షిపణులతో శత్రు విమానాలు, డ్రోన్లు, హెలికాప్టర్లను ధ్వంసం చేయవచ్చు. 3.5 కిలోమీటర్లు ఎత్తు, 6 కిలో మీటర్ల దూరంలో ఉన్న లక్ష్యాలను ఛేదించే సామర్థ్యం ఉంది. నిర్దేశిత ప్రాంతాలకు సులభంగా తీసుకెళ్లడానికి, భుజంపై నుంచి గగనతలంలో లక్ష్యాలను కూల్చడానికి అనువుగా ఉంటాయి.

స్ట్రాటోస్ఫిరిక్ ఎయిర్‌షిప్ పరీక్ష విజయవంతం

సైన్యం నిఘా సామర్థ్యాన్ని పెంచేందుకు అభివృద్ధి చేస్తున్న స్ట్రాటోస్ఫిరిక్ ఎయిర్‌షిప్ ప్లాట్‌ఫామ్ తొలి విమాన పరీక్షను భారత్ విజయవంతంగా నిర్వహించింది. మధ్యప్రదేశ్‌లోని షియోపూర్‌లో డీఆర్‌డీవో శనివారం ఈ పరీక్షను చేపట్టింది. 62 నిమిషాలపాటు నిర్వహించిన ఈ పరీక్షకు సంబంధించిన దృశ్యాలను డీఆర్‌డీవో 'ఎక్స్'లో షేర్ చేసింది. స్ట్రాటో ఆవరణం ఎత్తులో చాలాకాలం పాటు గాలిలో ఎగరగలిగేలా ఈ ఎయిర్‌షిప్‌ను రూపొందించినట్టు డీఆర్‌డీవో అధికారులు తెలిపారు. గాలికంటే తేలికైన ప్లాట్‌ఫామ్ వ్యవస్థల సాక్షాత్కారానికి ఈ ప్రోటోటైప్ విమానం ఒక మైలురాయి అని వారు పేర్కొన్నారు.



బాగ్లిహార్ డ్యాం..

పాక్‌పై జలఖడ్గం!

» బాగ్లిహార్ డ్యాం నుంచి నీళ్ల నిలిపివేత

న్యూఢిల్లీ, మే 4: పాకిస్థాన్‌పై భారత్ జలఖడ్గాన్ని ప్రయోగించింది. జమ్మూకశ్మీరులోని రాంబాన్ జిల్లాలో బాగ్లిహార్ డ్యాం నుంచి చీనాబ్ నదీ జలాల విడుదలను నిలిపివేసింది. జీలం నదిపై నిర్మించిన కిషన్‌గంగా డ్యాం నుంచి కూడా నీటి విడుదలను ఆపేయాలని యోచిస్తోందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఈ రెండూ హైడ్రో-ఎలక్ట్రిక్ డ్యాంలు. అవసరమైనప్పుడు నీటి విడుదలను నియంత్రించేందుకు భారత్‌కు ఇవి వీలు కల్పిస్తున్నాయి. ప్రధానంగా బాగ్లిహార్ డ్యాంపై ఇరు దేశాల మధ్య మొదటి నుంచీ వివాదం ఉంది. దీని పరిష్కారానికి ప్రపంచ బ్యాంకు మధ్యవర్తిత్వాన్ని కూడా పాక్ గతంలో కోరింది. జీలం నదికి ఉపనది అయిన నీలం నదిపై కిషన్‌గంగా డ్యాం నిర్మించారు. ఈ మూడు నదులూ పాక్‌కు జీవనాడి వంటివి. సాగునీటికే కాదు.. తాగునీటికి కూడా ఇవే ఆధారం. దీంతో ఆ దేశం విలవిలలాడుతోంది. భారత్‌ను ఎలా ఎదుర్కోవాలో అర్థం గాక పాక్ మంత్రులు రెచ్చగొట్టే ప్రకటనలు చేస్తున్నారు. భారత్‌పై అణుదాడి చేస్తామని బెదిరిస్తున్నారు. పాక్‌కు ప్రవహించే నదులపై ఇండియా ఎలాంటి కట్టడాలు కట్టినా ధ్వంసం చేస్తామని పాక్ రక్షణ మంత్రి ఖ్వాజా ఆసిఫ్ శనివారం హెచ్చరించారు.

పాక్ గొప్పలన్నీ తప్పులే!

పీఎల్15 క్షిపణులపై దాయాదిదేశం ఆర్భాటపు ప్రచారం

» వాటి రేంజ్ 200-300 కిలోమీటర్లు ఉంటుందని, భారత్ వైమానిక దాడులను తిప్పికొట్టగలమని డంబాలు

» వాటి వాస్తవ రేంజ్ 120 కిలోమీటర్లే అంటున్న నిపుణులు



పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో.. 'భారత్ మాపై దాడి చేయడం తథ్యం' అని పాకిస్థాన్ భావిస్తున్న సంగతి తెలిసిందే! పుల్వామా దాడి అనంతరం భారత్ చేపట్టిన బాలాకోట్ వైమానిక దాడులను పరిగణనలోకి తీసుకుంటే.. ఈసారి కూడా ప్రధానంగా వైమానిక దాడులు చేసే అవకాశమే ఎక్కువని అంచనా. పాక్ రక్షణ మంత్రి ఖవాజా సైతం.. భారత వాయుసేనతో ఘర్షణ జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని వ్యాఖ్యానించారు. అయితే గతానికీ ఇప్పటికీ తేడా ఏమిటంటే.. ఇప్పుడు భారత్ వద్ద అత్యంత అధునాతనమైన రాఫెల్ విమానాలు ఉన్నాయి. వీటి ద్వారా మిటియార్ క్షిపణులను ప్రయోగించవచ్చు. వీటి రేంజ్ దాదాపు 150 కిలోమీటర్లు. ఈ దాడులను ఎదుర్కోవడానికి సిద్ధమవుతున్న పాకిస్థాన్.. చైనీస్ పీఎల్-15 క్షిపణులను పెద్ద సంఖ్యలో సమకూర్చుకుంటోంది. ఇప్పటికే దాదాపు 100 మిసైల్స్ దాకా కొన్నట్టు సమాచారం. ఇవి ఎయిర్ టు ఎయిర్ మిసైళ్లు. అంటే విమానం నుంచి విమానాలపైకి ప్రయోగించే క్షిపణులు. వీటి రేంజ్ 200 నుంచి 300 కిలోమీటర్ల దాకా ఉంటుందని అంచనా. ఈ మిసైల్స్‌ను పాక్ వద్ద ఉన్న రెండు విమానాల ద్వారా ప్రయోగించవచ్చు. ఒకటి.. జే10సి. ఇది కొంతవరకూ రాఫెల్‌తో పోటీపడగలిగిన విమానం. రెండు.. చైనా, పాకిస్థాన్ కలిసి తయారుచేసిన జేఎఫ్ 17 జెట్లు. పాక్ వద్ద జే10సీ విమానాలు 20 నుంచి 25 దాకా ఉన్నట్టు సమాచారం. జేఎఫ్-17 యుద్ధవిమానాలైతే పెద్ద సంఖ్యలోనే ఉన్నాయి (పీఎల్-15 క్షిపణిని డిస్‌ప్లే చేసిన జేఎఫ్17 యుద్ధవిమానంతో సహా పలు ఫైటర్ జెట్లతో కూడిన 3 నిమిషాల వీడియోను పాక్ వాయుసేన ఇటీవల విడుదల చేసింది). ఒకవేళ రాఫెల్‌తో భారత్ వైమానిక దాడులు చేస్తే.. మన విమానాలను పాకిస్థాన్ పీఎల్-15 క్షిపణులతో చాలా ముందుగానే కొట్టేయవచ్చనే ప్రచారాన్ని పాకిస్థాన్‌లో విస్తృతంగా చేస్తున్నారు. కానీ.. ఇక్కడ రెండు సమస్యలున్నాయి. ఒకటి యుద్ధవిమానాల రాడార్ డిటెక్షన్ రేంజ్. క్షిపణుల రేంజ్ ఎక్కువగా ఉన్నంత మాత్రాన సరిపోదని.. ఆ క్షిపణులను ప్రయోగించడానికి వాడే విమానాల్లోని రాడార్ల డిటెక్షన్ రేంజ్ కూడా ఎక్కువగా ఉండాలని రక్షణ రంగ నిపుణులు చెబుతున్నారు. జే10సీ విమానాల్లో ఆ రేంజ్ ఎక్కువే గానీ.. జేఎఫ్17 విమానాల్లో తక్కువగా ఉంటుందని వారు వివరిస్తున్నారు. ఈ జేఎఫ్17 విమానాల్లో కూడా.. బ్లాక్ 1, బ్లాక్ 2, బ్లాక్ 3 అనే మూడు రకాలుంటాయి. వాటిలో బ్లాక్ 1, బ్లాక్ 2 అసలు ఈ క్షిపణులను ప్రయోగించలేవు. బ్లాక్ 3 రాడార్ డిటెక్షన్ రేంజ్ 140-150 కిలోమీటర్ల దాకా ఉంటుందని అంచనా. అంటే ప్రత్యర్థి విమానం అంత దగ్గర్లోకి వస్తే తప్ప దాన్ని గుర్తించి, మిసైల్‌ను ప్రయోగించలేవు. ఇక రెండో సమస్య.. పాకిస్థాన్ కొంటున్న పీఎల్-15 క్షిపణులు 'ఒరిజినల్ చైనీస్' రకం కావు. అవి వేరే దేశాలకు ఎగుమతి చేయడానికి చైనా ప్రత్యేకంగా తయారుచేసే ఎక్స్‌పోర్ట్ రకం (పీఎల్15 ఈ) క్షిపణులు. ఒరిజినల్ చైనీస్ క్షిపణుల కన్నా వీటి రేంజ్ తక్కువ. ఈ రెండు అంశాలనూ పరిగణనలోకి తీసుకుంటే.. జేఎఫ్17 ద్వారా ప్రయోగించే పీఎల్-15 మిసైళ్ల వాస్తవ రేంజ్ 120 కిలోమీటర్లు మాత్రమే ఉంటుందని.. అంతకు మించి ఉండదని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. అదేసమయంలో.. మన మిటియార్ క్షిపణుల 'నో ఎస్కేప్ జోన్' చాలా ఎక్కువని కూడా వారు గుర్తుచేస్తున్నారు. అంటే.. మిటియార్‌కి దొరికిన ప్రత్యర్థి విమానం తప్పించుకోవడం చాలా చాలా కష్టం. దీనికితోడు.. మన వద్ద ఉన్న ఎస్‌యు30 ఎంకేల ద్వారా అస్త్ర 1, అస్త్ర 2 క్షిపణులు ప్రయోగించి పాకిస్థాన్ విమానాలను సులభంగా ఎదుర్కోవచ్చని.. గగనతల యుద్ధంలో భారత్‌దే పైచేయి అవుతుందని వారు స్పష్టం చేస్తున్నారు.

- 'ఆంధ్రజ్యోతి' రక్షణ ప్రత్యేక ప్రతినిధి

గతంలో కాంగ్రెస్ తప్పులు చేసింది

» అప్పట్లో నేను లేను..కానీ బాధ్యత వహిస్తా

» సిక్కు వ్యతిరేక అల్లర్లపై అమెరికాలో ఓ విద్యార్థి ప్రశ్నకు రాహుల్ గాంధీ జవాబు



న్యూఢిల్లీ, మే 4: కాంగ్రెస్ పార్టీ అనేక తప్పులు చేసిందని, అయితే, అప్పుడు తాను లేనని, అయినప్పటికీ కాంగ్రెస్ చరిత్రలో జరిగిన తప్పులన్నింటికీ తాను సంతోషంగా బాధ్యత వహిస్తానని ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ చెప్పారు. 1984 సిక్కు వ్యతిరేక అల్లర్లు, సిక్కులతో కాంగ్రెస్ పార్టీ సంబంధాలపై అడిగిన ప్రశ్నకు రాహుల్ ఈ విధంగా సమాధానం ఇచ్చారు. 1980లలో జరిగినది 'తప్పు' అని తాను బహిరంగంగానే చెప్పానన్నారు. గతనెల 21న అమెరికాలోని బ్రౌన్ యూనివర్సిటీలో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో రాహుల్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఆ వీడియోను తాజాగా వాట్సన్ ఇనిస్టిట్యూట్ ఫర్ ఇంటర్నేషనల్ అండ్ పబ్లిక్ అఫైర్స్ శనివారం యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేసింది. ఈ ముఖాముఖిలో 1984 నాటి సిక్కు వ్యతిరేక అల్లర్లను ఒక సిక్కు విద్యార్థి ప్రస్తావించాడు. సిక్కులతో సయోధ్య కోసం ఏం ప్రయత్నాలు చేస్తున్నారని రాహుల్‌ను ప్రశ్నించాడు. భారత్‌లో సిక్కులను తలపాగా ధరించనివ్వాలా? వద్దా? అనే అంశంపై తాను పోరాడుతున్నానని గతంలో అమెరికాకు వచ్చినప్పుడు రాహుల్ చెప్పారని కూడా ఆ విద్యార్థి గుర్తుచేశాడు. దీనిపై రాహుల్ స్పందిస్తూ.. 'ఏదైనా సిక్కులను భయపెడుతుందని నేను అనుకోవడం లేదు. అప్పుడు నేను చేసిన ప్రకటన ఏమిటంటే.. ప్రజలు తమ మతాన్ని వ్యక్తం చేయడంలో అసౌకర్యానికి గురవుతున్న భారతదేశం మనకు కావాలా? అని. కాంగ్రెస్ పార్టీ చేసిన తప్పుల విషయానికి వస్తే.. నేను లేనప్పుడు ఎన్నో తప్పులు జరిగాయి. అయినా, చరిత్రలో కాంగ్రెస్ పార్టీ చేసిన తప్పులన్నింటికీ నేను సంతోషంగా బాధ్యత వహిస్తాను. నేను ఎన్నోసార్లు స్వర్ణ దేవాలయానికి వెళ్లాను. భారతదేశంలో సిక్కులతో నాకు చాలా మంచి, ప్రేమపూర్వక సంబంధాలు ఉన్నాయి' అన్నారు.

పశ్చాత్తాపం పూర్తిగా ఉండాలి:బీజేపీ

1984లో జరిగిన సిక్కుల వ్యతిరేక అల్లర్లు తప్పేనని రాహుల్‌గాంధీ నిజంగా భావిస్తున్నట్లైతే, అందుకు బాధ్యత వహించేందుకు ఆయన సిద్ధంగా ఉన్నట్లైతే జగదీశ్ టైట్లర్, కమల్‌నాథ్, శ్యామ్ పిట్రోడాలను కాంగ్రెస్ పార్టీ నుంచి బహిష్కరించాలని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి ఆర్‌పీ సింగ్ డిమాండ్ చేశారు. పశ్చాత్తాపం ప్రదర్శించాలంటే పూర్తిగా ప్రదర్శించాలని హితవు పలికారు. 'తప్పు జరిగిందని మీరు నిజంగా భావిస్తున్నట్లైతే ఆ ముగ్గురినీ పార్టీ నుంచి బహిష్కరించి సరిచేసుకోండి' అని సూచించారు. కాగా, రాహుల్‌గాంధీ భారతదేశంలోనే కాకుండా ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా పరిహాసానికి గురవుతున్నారని బీజేపీ ఐటీ విభాగం అధ్యక్షుడు అమిత్ మాలవీయ ఎద్దేవా చేశారు. అదే ముఖాముఖి కార్యక్రమంలో రాముడిని కల్పిత పాత్రగా రాహుల్ అభివర్ణించారంటూ అమిత్ మాలవీయ మండిపడ్డారు. రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ ప్రపంచవ్యాప్తంగా ఉన్న హిందువుల విశ్వాసాలను పరిహసించడం మానుకోవాలన్నారు.



నీట్ కేంద్ర వద్ద నిరసన తెలుపుతున్న దృశ్యం

నీట్ రాసేందుకు వెళితే.. జంధ్యం తీయించారు

» కలబురగిలో నిరసన

బెంగళూరు, మే 4 (ఆంధ్రజ్యోతి): నీట్ పరీక్ష రాసేందుకు వెళ్లిన విద్యార్థి జంధ్యం తొలగించిన ఘటన ఆందోళనకు దారితీసింది. కర్ణాటక రాష్ట్రం బీదర్ జిల్లా బసవకల్యాణ తాలూకా బెటబలగుంద గ్రామానికి చెందిన శ్రీపాదపాటిల్ కలబురగిలోని సెయింట్ మేరీ పాఠశాలలో ఆదివారం నీట్ పరీక్షకు వెళ్లాడు. పరీక్ష కేంద్రంలో ప్రవేశించే సమయంలో జంధ్యం తొలగించాలని సూచించారు. దీంతో పరీక్షను కోల్పోవాల్సి వస్తుందని వెంటనే ఆ విద్యార్థి జంధ్యాన్ని తొలగించి, కేంద్రం వద్ద వేచివున్న తండ్రికి ఇచ్చి లోపలికి వెళ్లాడు. విషయం కాసేపటికే వైరల్ కావడంతో కలబురగిలోని బ్రాహ్మణులు ఆందోళనకు దిగారు. జంధ్యం తొలగించాలని సూచించిన అధికారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఎన్నికల సేవలన్నీ ఒకే వేదికపైకి

» త్వరలోనే అన్ని అంశాలతో 'ఈసీఐనెట్' డిజిటల్ వేదిక

న్యూఢిల్లీ, మే 4 (ఆంధ్రజ్యోతి): దేశంలో ఎన్నికలకు సంబంధించిన ప్రకటనలు, నిర్వహణ, ఫలితాల వెల్లడి, అభ్యర్థుల వివరాలు, ఓటర్ల నమోదు, సందేహాల నివృత్తి.. ఇలా ఎన్నికల సేవలకు సంబంధించిన సమస్త సమాచారాన్ని ఒకే చోట అందుబాటులోకి తెచ్చేందుకు సరికొత్త డిజిటల్ వేదికను రూపొందించింది కేంద్ర ఎన్నికల సంఘం(ఈసీఐ). ఇప్పటి వరకు ఉన్న సుమారు 40 మొబైల్, వెబ్ అప్లికేషన్లను అనుసంధానం చేస్తూ త్వరలోనే 'ఈసీఐనెట్'ను అందుబాటులోకి తీసుకువస్తున్నామని ఈసీఐ ఆదివారం ప్రకటించింది. ఇది అందుబాటులోకి వస్తే ఇకపై ఎన్నికల సంఘానికి సంబంధించిన వేర్వేరు యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకోవాల్సిన అవసరం ఉండదని వివరించింది.

40 యాప్‌లతో అనుసంధానం..

ఎన్నికల సంఘం సమాచారం కోసం ఇప్పటి వరకు ఉపయోగిస్తున్న 40 వెబ్‌సైట్లు, మొబైల్ యాప్‌ల అనుసంధానంతో 'ఈసీఐనెట్'ను రూపొందించినట్టు ఈసీఐ తెలిపింది. అఫిడవిట్ పోర్టల్, ఇండియా ఎ వెబ్, రిజల్ట్ వెబ్‌సైట్, ఎలక్షన్ 24(ఆర్కైవ్), ఈసీఐ స్వీప్, ఈసీఐ వెబ్‌సైట్, ఫెంటోసా, వాయిస్‌నెట్, మిత్ వర్సెస్ రియాలిటీ, ఎలక్షన్ ట్రెండ్స్ టీవీ, సీ విజిల్ పోర్టల్, ఈఎంఎస్, ఆర్టీఐ పోర్టల్, ఎన్కోర్, మీడియా వోచర్, సువిధ పోర్టల్, అబ్జర్వర్ పోర్టల్, ఎలక్షన్ ప్లానింగ్, ఐఈఎంఎస్, పీపీఆర్ టీఎంఎస్, ఏరోనెట్ 2.0, ఓటర్స్ సర్వీస్ పోర్టల్, సర్వీస్ ఓటర్ పోర్టల్, ఈటీపీఎంబీఎస్, ఎన్జీఎస్పీ, ఎలక్టోరల్ సెర్చ్ వెబ్ సైట్లతో పాటు ఎరోనెట్ యాప్, బీఎల్‌వో యాప్, సీవిజిల్, డిసైడర్, ఎన్కోర్ నోడల్, ఈఎస్ఎంఎస్, ఇన్వెస్టిగేటర్, కేవైసీ, మానిటర్, అబ్జర్వర్, సాక్ష్యం, సువిధ, ఓటర్ టర్నౌట్ తదితర అప్లికేషన్లన్నీ ఒకే గొడుగు కిందకు రానున్నాయని ఈసీఐ వివరించింది.

శ్రీవారి ఆలయం ముందు కాకినాడ బాలిక యోగాసనాలు



తిరుమల శ్రీవారి ఆలయం ముందు యోగాసనాలు వేస్తున్న రేఖాడి చైత్ర జివాస్కి

తిరుమల శ్రీవారి ఆలయం ముందు 14 ఏళ్ల బాలిక యోగాసనాలు వేస్తూ అందరినీ ఆకర్షించింది. కాకినాడకు చెందిన రేఖాడి చైత్ర జివాస్కి తన తల్లిదండ్రులతో కలిసి శ్రీవారి దర్శనం కోసం శనివారం తిరుమలకు వచ్చింది. శ్రీవారి దర్శనం అనంతరం ఆదివారం ఉదయం ఆలయం ముందుకు చేరుకున్న రేఖాడి వివిధ రకాల యోగాసనాలు వేయడంతో పలువురు భక్తులు ఆశ్చర్యంగా తిలకించారు. సుమారు 15 నిమిషాల పాటు ఆలయం ముందు ఆమె ఆసనాలు వేసింది. అనంతరం రేఖాడి చైత్ర మీడియాతో మాట్లాడుతూ.. యోగాలో జాతీయ మెడల్ సాధించడం తన లక్ష్యమని పేర్కొంది. వ్యాయామ ఉపాధ్యాయురాలు త్రిపుర తనకు యోగాను పరిచయం చేయగా, మరో గురువు దుర్గాశాంతి ప్రసాద్ యోగాను పూర్తిగా నేర్పించారని తెలిపింది. - తిరుమల, ఆంధ్రజ్యోతి

60 రోజులు.. 339 పనులు

- 11 నెలల్లోనే రూ.231 కోట్లతో కార్యక్రమాలు
- నెల్లూరు రూరల్.. అభివృద్ధికి చిరునామా
- ఎమ్మెల్యే కోటంరెడ్డికి లోకేశ్ అభినందనలు

అమరావతి, మే 4 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు రూరల్ నియోజకవర్గాన్ని అభివృద్ధికి చిరునామాగా మార్చిన స్థానిక ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఆయన బృందాన్ని విద్యాశాఖ మంత్రి లోకేశ్ అభినందించారు. 'ఇచ్చిన మాటకు కట్టుబడి రూ.41 కోట్లతో 339 అభివృద్ధి పనులు కేవలం 60 రోజుల్లోనే పూర్తి చేసి, ప్రజలకు అంకితం చేయడం రికార్డు' అని 'ఎక్స్'లో పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన 11 నెలల్లోనే నెల్లూరు రూరల్ నియోజకవర్గ అభివృద్ధికి రూ.231 కోట్లతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారని, కోటంరెడ్డి కృషి అందరికీ ఆదర్శమని కొనియాడారు.



టీటీడీ చైర్మన్‌కు చెక్ అందజేస్తున్న దాత యతీష్

అన్నప్రసాదం ట్రస్టుకు రూ.1.50 కోట్ల విరాళం

తిరుమల, మే4(ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం అన్నప్రసాదం ట్రస్టుకు ఆదివారం రూ.1.50 కోట్లు విరాళంగా అందాయి. బెంగళూరుకు చెందిన సుయుగ్ వెంచర్స్ ఎల్ఎల్‌పీ సంస్థ చైర్మన్ యతీష్ సూరినేని ఈ విరాళాన్ని ఇచ్చారు. విరాళం చెక్‌ను తిరుమలలో టీటీడీ ధర్మకర్తల మండలి చైర్మన్ బీఆర్ నాయుడికి దాత అందజేశారు.

తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి గిరిజా ప్రియదర్శిని మృతి

- కొంతకాలంగా అనారోగ్యం.. చికిత్స పొందుతూ కన్నుమూత
- జస్టిస్ గిరిజ స్వస్థలం ఏపీలోని విశాఖపట్నం



హైదరాబాద్, హైదరాబాద్ సిటీ, మియాపూర్, మే 4(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మాటూరి గిరిజా ప్రియదర్శిని(60) మరణించారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆమె.. హైదరాబాద్, గచ్చిబౌలిలోని ఏఐజీ ఆస్పత్రిలో ఆదివారం ఉదయం తుది శ్వాస విడిచారు. జస్టిస్ గిరిజా ప్రియదర్శిని భౌతికకాయాన్ని హఫీజ్‌పేటలోని ఆమె స్వగృహానికి తరలించారు. హైకోర్టు చీఫ్ జస్టిస్ సుజయ్ పాల్, పలువురు న్యాయమూర్తులు, న్యాయవాదులు ఆమె భౌతికకాయానికి నివాళి అర్పించారు. జూబ్లీహిల్స్‌లోని మహాప్రస్థానంలో సోమవారం మధ్యాహ్నం తర్వాత అంత్యక్రియలు జరగనున్నాయి. జస్టిస్ గిరిజా ప్రియదర్శినికి భర్త విజయ్‌కుమార్, కుమారులు నిఖిల్, అఖిల్ ఉన్నారు. కాగా, ఏపీలోని విశాఖపట్నంకు చెందిన గిరిజా ప్రియదర్శిని.. అక్కడి ఎన్‌బీఎం లా కాలేజీలో న్యాయశాస్త్రం పూర్తిచేసి.. 1995లో ఉమ్మడి ఏపీ హైకోర్టులో న్యాయవాదిగా నమోదు చేసుకున్నారు. విశాఖపట్నంలో పదేళ్లకు పైగా న్యాయవాదిగా పని చేసిన తర్వాత 2008లో నేరుగా జిల్లా జడ్జిగా ఎంపికయ్యారు. ఆదిలాబాద్, ఒంగోలు, కరీంనగర్ జిల్లాల ప్రధాన న్యాయమూర్తిగా పని చేశారు. 2022 మార్చి 24న తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తిగా ఎంపికయ్యారు. సమాజంలోని వెనుకబడిన వర్గాలకు న్యాయసహాయం అందించడంలో ఆమె కీలకంగా వ్యవహరించారు. వివిధ జిల్లాల్లో ప్రధాన న్యాయమూర్తిగా పనిచేసిన సందర్భంగా ఆయా జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీల ద్వారా అత్యంత మారుమూల గ్రామాల్లో ఉచితంగా న్యాయసహాయం అందించే విషయంలో అనేక కార్యక్రమాలు నిర్వహించారు. నాల్సా ఆధ్వర్యంలో దూరదర్శన్‌లో ప్రసారమైన 'అకేలే నహీ హై ఆప్' కార్యక్రమంలో మారుమూల గ్రామాల్లోని అణగారిన వర్గాలకు న్యాయసహాయం అందించడంలో ఆమె చేసిన సేవలను కొనియాడారు. కాగా, జస్టిస్ గిరిజా ప్రియదర్శిని మరణం పట్ల తెలంగాణ జడ్జెస్ అసోసియేషన్ అధ్యక్షుడు క్షేప్రభాకరరావు, ప్రధాన కార్యదర్శి మురళీ మోహన్ సంతాపం తెలియజేశారు.

సత్వర న్యాయం అందించడమే లక్ష్యం

- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాజశేఖర్‌రావు



సింగరాయకొండలో సివిల్ కోర్టు భవనాన్ని ప్రారంభిస్తున్న హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ రాజశేఖర్‌రావు, జస్టిస్ మన్మథరావు, జస్టిస్ రామకృష్ణ ప్రసాద్, జస్టిస్ లక్ష్మణరావు

సింగరాయకొండ, మే 4 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు, కక్షిదారులకు సత్వర న్యాయం అందించడమే న్యాయస్థానాల ప్రధాన లక్ష్యమని హైకోర్టు న్యాయమూర్తి, ప్రకాశం జిల్లా అడ్మినిస్ట్రేషన్ జడ్జి జస్టిస్ తర్లాడ రాజశేఖర్‌రావు అన్నారు. ప్రకాశం జిల్లా సింగరాయకొండలో ఆదివారం సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) కోర్టు ప్రారంభోత్సవం జరిగింది. హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ రాజశేఖర్‌రావు, జస్టిస్ కే. మన్మథరావు, జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్, జస్టిస్ వైె.లక్ష్మణరావు పాల్గొన్నారు. అనంతరం జిల్లా ప్రధాన న్యాయాధికారి ఏ.భారతి అధ్యక్షతన జరిగిన సభలో జస్టిస్ రాజశేఖర్‌రావు మాట్లాడారు. బార్ అసోసియేషన్ సభ్యులు లక్ష్యానికి అనుగుణంగా, కలిసికట్టుగా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. నూతన సివిల్ జడ్జి కోర్టుకు రెగ్యులర్ న్యాయాధికారిని నియమించడానికి కృషి చేస్తానని తెలిపారు. సింగరాయకొండవాసి, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.మన్మథరావు మాట్లాడుతూ సింగరాయకొండలో కోర్టు ఏర్పాటు చేయడం తన చిరకాల కోరిక అని, ఇప్పుడు అది ఇప్పుడు తీరిందని ఆనందం వ్యక్తం చేశారు. జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్ మాట్లాడుతూ బార్ అసోసియేషన్ సభ్యులు, జ్యుడీషియల్ అధికారులు బాధ్యతయుతంగా పనిచేయాలని సూచించారు. జస్టిస్ డాక్టర్ వై.లక్ష్మణరావు మాట్లాడుతూ కోర్టుకు రెగ్యులర్ జ్యుడీషియల్ అధికారిని, సరిపడా సిబ్బందిని ఏర్పాటు చేసేందుకు కృషిచేయాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాజశేఖర్‌రావును కోరారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎస్పీ ఏఆర్ దామోదర్ తదితరులు ప్రసంగించారు.

జూనియర్ సివిల్ జడ్జిగా తిరుపతి యువతి

- తెలంగాణ క్యాడర్‌కు ఎంపిక



నిఖిత

తిరుపతి(నేరవిభాగం), మే 4 (ఆంధ్రజ్యోతి): తిరుపతికి చెందిన నిఖిత తెలంగాణ క్యాడర్‌కు జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికయ్యారు. హైదరాబాదులోని నల్సార్ యూనివర్సిటీలో నిఖిత బ్యాచులర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్.. ఆ తర్వాత ఎల్ఎల్‌బీ పూర్తి చేశారు. ప్రస్తుతం హైదరాబాదులోని ఉస్మానియా వర్సిటీలో ఎల్ఎల్ఎం చదువుతున్నారు. ఈమె తల్లిదండ్రులు ఎస్‌బీఐలో ఉద్యోగులు.

మాకెందుకీ అన్యాయం?

డీఎస్సీ అర్హతకు మార్కుల 'గండం'

- డిగ్రీలో 50 శాతం ఉండాలని నిబంధన
- బీఈడీ జనరల్ అభ్యర్థుల ఆవేదన
- 2011 కంటే ముందు బీఈడీ విద్యార్థులకు ఎన్‌సీటీఈ 'మార్కు'ల మినహాయింపు
- సుప్రీం ఆదేశాలతో మార్గదర్శకాల మార్పు
- ఏపీ డీఎస్సీలో అమలుకాని ఆ సడలింపు
- తెలంగాణలో జనరల్ అభ్యర్థులకు 45శాతమే
- ఏపీలో నష్టపోతున్నామంటున్న అభ్యర్థులు

చాలా కాలంగా ఎదురు చూసిన మెగా డీఎస్సీ వచ్చేసింది. 16,347 పోస్టులు ప్రకటించడంతో అభ్యర్థులు సంబరపడ్డారు. అయితే డీఎస్సీ అర్హతకు '50 శాతం' మార్కుల నిబంధన పెట్టడంతో బీఈడీ జనరల్ అభ్యర్థులు ఉస్సూరుమంటున్నారు. 2011 కంటే ముందు బీఈడీలో చేరిన వారికి డిగ్రీ మార్కుల నిబంధన వర్తించదన్న ఎన్‌సీటీఈ మార్గదర్శకాలు అమలు చేయాలని కోరుతున్నారు. అలాగే ఇతర జనరల్ అభ్యర్థులకు తెలంగాణలో మాదిరిగా అర్హత మార్కులను 45 శాతానికి తగ్గించాలని డిమాండ్ చేస్తున్నారు.

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

డీఎస్సీకి అర్హత విషయంలో తమకు అన్యాయం జరుగుతోందని బీఈడీ జనరల్ అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2011 జూలై 29 కంటే ముందు బీఈడీలో చేరిన వారికి డిగ్రీ మార్కుల విషయంలో జాతీయ ఉపాధ్యాయ విద్యా మండలి(ఎన్‌సీటీఈ) మినహాయింపు ఇచ్చిందని చెబుతున్నారు. అయినా రాష్ట్రంలో 50 శాతం మార్కుల విధానం అమలు చేయడాన్ని తప్పు పడుతున్నారు. పొరుగు రాష్ట్రం తెలంగాణలో జనరల్ అభ్యర్థులకు 45 శాతం మార్కులు అర్హతకు ప్రామాణికంగా తీసుకున్నారు. ఏపీలో మరో 5 శాతం అదనంగా మార్కులు ఉండాలని పాఠశాల విద్యా శాఖ డీఎస్సీ నోటిఫికేషన్‌లో పేర్కొంది. ఇలా అన్నివిధాలా తమకు అన్యాయం జరుగుతోందని జనరల్ అభ్యర్థులు ఆవేదన చెందుతున్నారు. మరోవైపు టెట్‌లో 40 శాతం డిగ్రీ మార్కులతో అర్హత కల్పించినందున డీఎస్సీలోనూ అదే విధానం పాటించాలని అభ్యర్థులు డిమాండ్ చేయడంతో ఇటీవల నోటిఫికేషన్‌ను సవరించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగ అభ్యర్థులకు 45 శాతం మార్కుల(అర్హత)ను 40 శాతానికి తగ్గించారు. అంతకుముందు జనరల్ అభ్యర్థులకు 50 శాతం, ఇతరులకు 45 శాతం మార్కుల నిబంధన ఉండేది. తాజాగా తమకు మార్కుల శాతం తగ్గించలేదని, 10 శాతం వ్యత్యాసం ఉందని, తమకు కూడా న్యాయం చేయాలని జనరల్ అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నారు.

మినహాయింపు అందరికీ ఏదీ?

స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు జనరల్ అభ్యర్థులకు 50శాతం, ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగ అభ్యర్థులకు 45శాతం డిగ్రీ మార్కులు ఉండాలని ఏపీ డీఎస్సీ నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. 2024లో నిర్వహించిన టెట్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగులకు డిగ్రీలో 40శాతం మార్కులున్నా అర్హత కల్పించారు. దీంతో 40శాతం డిగ్రీ మార్కులున్న వారు కూడా



టెట్ రాసి అర్హత సాధించారు. వారికి ఇప్పుడు డీఎస్సీలో 45శాతం మార్కులు ఉండాలనే నిబంధన విధించడంతో వ్యతిరేకత వచ్చింది. డీఎస్సీ అర్హతకు 45శాతం మార్కులు తప్పనిసరి అయితే, 40శాతం మార్కులున్న వారిని టెట్‌కు ఎందుకు అనుమతించారనే ప్రశ్నలు తలెత్తాయి. దీంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగ అభ్యర్థులకు డీఎస్సీ అర్హతకు డిగ్రీలో 40శాతం మార్కులు ఉంటే చాలంటూ ఇటీవల నోటిఫికేషన్‌లో సవరణ చేశారు. తమకు కూడా తగ్గిస్తారని, రెండు కేటగిరీల మధ్య 5శాతం మార్కుల వ్యత్యాసాన్ని కొనసాగిస్తారని జనరల్ అభ్యర్థులు ఆశించారు. కానీ పాఠశాల విద్యాశాఖ మార్పులు చేయకపోవడంతో జనరల్ అభ్యర్థులు ఆవేదన చెందుతున్నారు.

ఆ మార్గదర్శకాలు వర్తించవా?

ఎన్‌సీటీఈ మార్గదర్శకాలనే అమలు చేస్తున్నామని పాఠశాల విద్యా శాఖ చెబుతోంది. వాటి ప్రకారం జనరల్ అభ్యర్థులకు 50శాతం, మిగిలిన వారికి 45శాతం మార్కులు డిగ్రీలో తప్పనిసరిగా ఉండాలి. ఇదే విషయంలో కొందరు అభ్యర్థులు గతంలో సుప్రీం కోర్టును ఆశ్రయించారు. న్యాయస్థానం ఆదేశాలతో 2019లో ఎన్‌సీటీఈ కొన్ని మార్పులు చేసింది. 2011 జూలై 29 కంటే ముందు బీఈడీలో అడ్మిషన్ పొందిన వారికి డీఎస్సీ అర్హతకు డిగ్రీ మార్కులతో సంబంధం లేదని, ఉత్తీర్ణులైతే చాలని స్పష్టం చేసింది. కానీ ఏపీ డీఎస్సీ నోటిఫికేషన్‌లో ఈ మేరకు సడలింపు ఇవ్వలేదని, తమకు అవకాశం కల్పించాలని జనరల్ అభ్యర్థులు కోరుతున్నారు.



లారీ ఢీకొనడంతో నుజ్జునుజ్జయిన కారు



వరికోత మిషన్‌తో వచ్చిన లారీ ఢీకొట్టడంతో బోల్తా కొట్టిన కోడిగుడ్ల వాహనం

10 నిమిషాలు.. 3 ప్రమాదాలు..!

అతివేగానికి ఐదుగురి ప్రాణాలు బలి

- రక్తసిక్తమైన జాతీయ రహదారి
- ఆగివున్న లారీని ఢీకొన్న కోడిగుడ్ల లారీ
- వెనుకే వేగంగా వచ్చి ఢీకొట్టిన మరో లారీ
- కోడిగుడ్ల లారీలో ముగ్గురు అక్కడికక్కడే మృతి
- ట్రాఫిక్ జామ్‌తో 200 మీటర్ల వరకూ ఆగిన వాహనాలు
- లారీ వెనుక ఆగివున్న కారుని వేగంగా ఢీకొట్టిన మరో లారీ
- కారులో తల్లీ, కుమారుడు దుర్మరణం.. ఇద్దరి పరిస్థితి విషయం
- ఒంగోలు వద్ద కొప్పోలు ఫ్లై ఓవర్ సమీపంలో ప్రమాదాలు

ఒంగోలు క్రైం, మే 4 (ఆంధ్రజ్యోతి): వేకువజామున అతి వేగం... పదంటే పది నిమిషాల్లో మూడు ఘోర ప్రమాదాలకు కారణమైంది. 200 మీటర్ల దూరంలో.. ఒకటి దాని తర్వాత ఒకటి.. వరుసగా మూడు ప్రమాదాలు సంభవించడంతో కోల్‌కతా-చెన్నై జాతీయ రహదారి రక్తసిక్తమైంది. ప్రకాశం జిల్లా ఒంగోలు వద్ద కొప్పోలు ఫ్లై ఓవర్ సమీపంలో ఆదివారం తెల్లవారుజామున 4:30 గంటల నుంచి 4:40 గంటల వ్యవధిలో జరిగిన మూడు ప్రమాదాల్లో ఐదుగురు దుర్మరణం పాలవగా.. ఏడుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వారిలో ఇద్దరి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. తొలుత.. కోడిగుడ్ల లోడుతో విజయవాడ వైపు నుంచి నెల్లూరు వైపు వేగంగా వెళ్తున్న లారీ కొప్పోలు ఫ్లైఓవర్ దాటిన తర్వాత.. అక్కడ పంక్చర్ పడి రోడ్డుపై ఆగి ఉన్న మరోలారీని వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదం ఉదయం 4:30 గంటలకు జరిగింది. మరో ఐదు నిమిషాలకు దానివెనుకే వరికోత మిషన్‌తో వేగంగా దూసుకొచ్చిన మరో లారీ ఢీకొట్టడంతో కోడిగుడ్ల లారీ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కోడిగుడ్ల లారీలో ఉన్న నెల్లూరు జిల్లా నెల్లూరు రూరల్ మండలం గుడిపల్లిపాడుకు చెందిన రావినూతల బాబు (42), రావినూతల నాగేంద్ర (18), నెల్లూరు టౌన్‌లోని వెంగళరావునగర్‌కు చెందిన డ్రైవర్ షేక్ రహీం అలియాస్ రమణయ్య (60) అక్కడికక్కడే మృతి చెందారు. వరికోత మిషన్‌తో వెళ్తున్న వాహనంలో ఉన్న ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ప్రమాదాలతో రోడ్డుపై ట్రాఫిక్ ఆగిపోయింది. దీంతో వాహనాలు ఒకదాని వెనుక ఒకటి నిలిచిపోయాయి. ఇలా ప్రమాద స్థలానికి 200 మీటర్ల దూరంలో ఓ లారీ.. దాని వెనుక కారు కూడా ఆగాయి. 4:40 గంటల సమయంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన మరో లారీ.. ఆగిఉన్న కారుని బలంగా ఢీకొట్టింది. దీంతో రెండు లారీల మధ్యలో చిక్కుకున్న కారు నుజ్జునుజ్జయ్యింది. అందులో ఉన్న గుంటూరు జిల్లా పెదకాకాని మండలం కొప్పురావూరుకు చెందిన తిరుమలశెట్టి పావని (42), ఆమె కుమారుడు చంద్రకౌషిక్ (16) తీవ్రగాయాలతో ఆస్పత్రిలో కన్నుమూశారు. పావని భర్త వెంకటేశ్వర్లు, ఆమె బంధువులైన బూసి వినయ్‌దేవ్, లావణ్య (దంపతులు)తోపాటు వారి కుమారుడు లోక్షిత్‌కు గాయాలయ్యాయి. వినయ్‌దేవ్, లావణ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. లోక్షిత్ పుట్టెంట్రుకలు తీయించేందుకు తిరుమల వెళ్తుండగా ఈ విషాదం చోటుచేసుకుంది. కాగా, ఈ ప్రమాదానికి ముందు ఐషర్ వాహనం ఆగి ఉన్న కారును, మలుపు తిరుగుతున్న ట్రాక్టర్‌ను ఢీకొనడంతో ట్రాక్టర్ డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి.

పదిలో 570 మార్కులు.. జీవితంలో నిండిన నూరేళ్లు

గుంటూరు జిల్లా పెదకాకాని మండలం కొప్పురావూరుకు చెందిన తిరుమలశెట్టి చంద్రకౌషిక్ (16) ఇటీవల విడుదలైన పదో తరగతి పరీక్షల ఫలితాల్లో 570 మార్కులు సాధించాడు. మరో నెలరోజుల్లో కాలేజీ జీవితంలోకి అడుగుపెట్టేందుకు సిద్ధమవుతున్నాడు. ఇంతలోనే రోడ్డు ప్రమాదం రూపంలో అతన్ని మృత్యువు కబళించింది. ఈ ప్రమాదంలో చంద్రకౌషిక్ తల్లి తిరుమలశెట్టి పావని కూడా కన్నుమూయడం మరింత విషాదకరం. వారి బంధువులైన వినయ్‌దేవ్, లావణ్య దంపతుల రెండేళ్ల కుమారుడు లోక్షిత్ చంద్రదేవ్‌కు తిరుపతి వెంకటేశ్వరస్వామి సన్నిధిలో పుట్టెంట్రుకలు తీయించేందుకు శనివారం రాత్రి వారు కారులో బయల్దేరారు. వారి బంధువులైన తిరుమలశెట్టి వెంకటేశ్వరరావు, పావని దంపతుల ఒక్కగానొక్క కుమారుడు చంద్రకౌషిక్ కూడా తిరుపతి వెళ్దామని కోరడంతో అదే కారులో బయల్దేరారు. ఆదివారం తెల్లవారుజామున ఒంగోలు వద్ద రోడ్డు ప్రమాదంలో పావని, చంద్రకౌషిక్ మృతి చెందారు.

అంగడి అందాలు



దునియా దేశాల మహిళామణుల్ని
అందాల బందిఖానాలేసి
హద్దు పొద్దెరుగకుంటా
ఆడదేహాలతో ఆడే జూదాలు.
లోకంల ఆడయినా, మగయినా,
సెట్టయినా పిట్టయినా అందమంటే
సూసే సూపు సుతారమే
గానీ, రూపు గాదనే లెక్కున్నది.
అందాలంటే ఆడోళ్లకే పేటెంట్స్
అంటగట్టి, గంటకొట్టింది
పేట్రియార్కీ పెత్తనమే.
ఆడపిల్లలను అంగట్లమ్మి తక్కెట్ల జోకనీకి
యేసీ యెసట్లేసి సాపలను
ఎండబెట్టినట్టు, యేడా గింత
కండ కానరాకుంట ఎండబెట్టి
పారం కోళ్లోలే పడతుల
తనువుల్ని తాకట్టు పెట్టే యాపార
సోపాన సామ్రాజ్యాలకు,
కార్పోరేట్ కాస్మెటిక్స్‌ల
కరిగిచ్చి కమిరిచ్చి మరిగిచ్చి
కొలతల కొలిమిల్లో
కోతలు పడే ఫాన్సీ ప్లాస్టిక్
అంద సందాల విందులకు,
మహిళా మాంసం కొట్లులు బెట్టి
సరుకు సౌదలు అమ్ముకునే సంతలకు,
స్పాల, సర్జరీల, సూదులు గుచ్చి
మాలిష్‌ల మర్దనల్ల
లైపోసక్షండ్ల ఫిక్సింగ్‌ల కుదిచ్చి కుదిలింపుల్ల
కుదబడ్డ హంసలను హింసల బెట్టే
మల్టీ కంపెనీ అంగడి గద్దలకు
గీ మట్టికాళ్ళ మైసమ్మల గడ్డమీదనే
గద్దేసి అందాల మీద కాసే పందాల పండుగైంది.
మా కళల కాంతుల్ని కండ్లకద్దుకొని,
నాగరిక వైభవ వారసత్వ సంపదను
సంకనేసుకొనేదంతా,
గీ గడ్డ మీది వనరుల్ని
బైటి దేశాల పెట్టుబడి
పెయిని నింపుకొని పెంపు జేస్కోనీకే.
రామప్ప రాగిణీ సరాగాల సంగతుల్ని
సముద్రాల్ని సవ్వాల్ జేసే సెరువు బరువుల్ని
సెరిగి పోని సేనేత పోత సెంగావి హంగుల్ని
నెత్తురు చుక్క నేలరాలని విప్లవం విరాజిల్లిన
బౌద్ధ ఆనవాళ్లను అద్దుకున్న
బుద్ధవనాన్నీ ముద్దాడబోయే బ్యూటీలూ
మీ రూరల్ టూరిజం దారుల, హెరిటేజ్ వాక్‌ల
ఎదురయ్యే ఉపాధి పనులను
ఉప్పుసకన్నా సూడుండ్రి
తట్ట తలకెత్తుకోకున్నా
నీడ లేని కాడ నిమిషం నిలుసోండ్రి
ముక్కులు మూసుకోకుంట
మున్సిపాల్టీ మురుగు సెత్తకాడ
సీపురు సేత బట్టుండ్రి...
మిలమిలలన్నీ మలమల మాడ్తయి.
గీడ ఆడోల్ల అందాలంటే,
తంగేడు, గునుగులు,
తీరుగోరంటల నూరొక్క తియ్యటి పదాల
సెమట సెరువు సెంపల బత్కమ్మ పాట.
మన్ను వాసనల
బొడ్డాడని బోనంకొండ ఆట.
గీడ యింకా
మట్టితనాలు మాసిపోలే
యెట్టితనాలు యెలిసిపోలే
తెల్లారని తెలంగాణ తెప్ప
వచ్చే వచ్చే పాయె పాయె.
వూదు కాలింది లేదు, పప్పుడికింది లేదు
శిశిరాలు శిథిలమ్ కాలే.
అంతా, ధోకా, దగా.
దోఖా దొర్లిపోలే
దగా దాగిపోలే
మోసపోయిన మొకమ్మీద
గీ మిస్ వరల్డ్ అహో మహోదయాలు.
బందూకులు బరిసెలు
ఎక్కుబెట్టి నిలబడి కలెబడే అందం,
కొంగు నడుముకు సుట్టి కొడువండ్లు బట్టి
సుక్కల్ని తెంపి కొప్పున ముడిసిన
తాటి ముంజల తీపులు
యీ గడ్డమీది ఆడబిడ్డలు.
మాకు సందమామను
అందుకొనే సదువుల సక్కదనాలు,
ఉద్యోగాలు, వూళ్లేలే ఉగాదులు,
భూమి జాగల మీద,
ఇండ్లు వాకిండ్ల మీద మా పేర్లకు
పెద్దిర్కాల జెండాలు,
ఆకాశమంత ఆత్మగౌరవ రాజ్యాలు,
కులాలు కూలిపోయే
మతాలు మట్టయే
అందాల బందాలు,
దాడులు, దండనలు, హత్యాచారాలు, ఔమానాలు
తొంగి సూడని తొవ్వల
ఆడిపాడే వెన్నెల అందాలు,
ఖగార్‌లను ఖలాస్ జేసే
ఆకు బట్టిన అడివి అందాలు,
పొరుగు దేశాల్ని పచ్చినెత్తుటి ముద్దను జేసే
యుద్ధాలను పొలిమేర్లకు తరిమే
పొద్దుల అందాలు కావాలే.
మల్టీ కంపెనీ మార్కెట్‌లూ,
మిస్ వరల్డ్ వనితలూ,
గీ మా అందాలన్నీటిని దునియంతా
దున్నిపోయుండ్రి
లేకుంటే,
గీ మీ పోటీల ఖేల్ ఖతం, దుకునమ్ బందు.

■ జూపాక సుభద్ర

'సుమతీ శతకం'లో చేరని పద్యాలు



ఇప్పుడు మనకి దొరికే 'సుమతీశతకం' పుస్తకం లోని 100 లేక 107 పద్యాలను పంతొమ్మిదవ శతాబ్దం పూర్వార్థంలో నాటి పండితులు తాళపత్రాలలో దొరికిన 150 పైచిలుకు పద్యాలలోంచి ఏరి ఒకచోట కూర్చారు. ఇందులో చేరని పద్యాలు కొన్ని ఇప్పటికీ ఆ తాళపత్ర గ్రంథాలలోనే ఉండిపోయాయి. చెన్నైలోని 'ప్రభుత్వ ప్రాచ్య లిఖిత భాండాగారం'లో 'సుమతీశతకం' పూర్వ ప్రతులు మూడు ఉన్నాయి. వాటిల్లో ఒకటి తాళపత్ర ప్రతి. మిగతావి రెండు రాత ప్రతులు. ఈ రెండు రాతప్రతులు సిపి బ్రౌన్ తయారు చేయించినవి. ఇందులోని ఒక ప్రతిలో 'సుమతీశతకం' పద్యాలకు బ్రౌను ఆంగ్లానువాదం కూడా ఉంది. రెండవది 'సుమతీశతకం' పద్యాల పద సూచి (word index).

ప్రమోదూత నామ సంవత్సరం, ఫాల్గుణమాసం, బహుళ పంచమీ శుక్రవారం వరకు కరుటూరి అచ్చన రాయడం పూర్తి చేసిన తాళపత్ర ప్రతిలో 115 పద్యాలు ఉన్నాయి (ప్రమోదూత సంవత్సరాలు మనకు 1990–91, 1930–31, 1870–71, 1810–11, 1750–51... ఇలా వచ్చాయి. వాటిల్లో ఫాల్గుణమాసం, బహుళ పంచమి శుక్రవారానికి 1811 ఫిబ్రవరి 15వ తేదీ సరిపోతుంది). బ్రౌను తయారు చేయించిన 'సుమతీశతకం' రాత ప్రతికి ఆధారమైన మూల ప్రతి ఏదో తెలియదు. బ్రౌను 'సుమతీశతకం' రాత ప్రతిలో 150 పద్యాలు ఉన్నాయి. ఈ రెండు ప్రతులలోని పద్యాలను పోల్చి చూసుకుంటే బ్రౌను రాతప్రతిలో లేని పద్యాలు కొన్ని అచ్చన రాసిన తాళపత్ర ప్రతిలో ఉన్నాయి. అలాగే అచ్చన తాళపత్ర ప్రతిలో లేని పద్యాలు కొన్ని బ్రౌను రాతప్రతిలో ఉన్నాయి. అయితే, ప్రస్తుతానికి బ్రౌను తయారు చేయించిన 'సుమతీ శతకం' రాత ప్రతిలో లేకుండా, కరుటూరి అచ్చన 1811 ఫిబ్రవరిలో రాసిన తాళపత్ర ప్రతిలో ఉన్న పద్యాలను ఎంచి చూపించడం ముఖ్యమని నాకు అనిపించింది. కారణం– ఆ పద్యాలు ఇప్పటి దాకా ఆ తాళపత్ర ప్రతిలోనే ఉండిపోయాయి. ఆ పద్యాల్లో కూడా కొన్ని పద్యాలు పరిష్కరణకు వీలుకాకుండా ఉన్నాయి. కారణం ఏమిటంటే, తాళపత్ర ప్రతిలో రెండు పత్రాలు పద్యం అంతమయ్యే వైపు మూలల్లో పురుగుపట్టి, పద్యంలో చివరి పాదం మూడు వంతులు కనపడకుండా అయిపోయాయి. అలా కొన్ని పద్యాలు పోగా, పూర్తిగా కొత్తవైన పది పద్యాలను స్వల్ప భావ వివరణతో ఇక్కడ ఇస్తున్నాను. ప్రతి పద్యం నాల్గవపాదం చివరన బ్రాకెట్లలో ఉన్నది తాళపత్ర ప్రతిలోని పద్య సంఖ్య.

కం. భూమీశు చిత్త మెరుగక
ప్రేమముతో మనవి జెప్ప బెడగుట లెల్లం
పాముకు వాకట్టెరుగక
సాముని చెయిచాచినట్టి చందము సుమతీ! (104)

'వాకట్టు' అంటే పాము విషానికి విరుగుడైన 'వాకట్టువేరు'. రాజు సంతోష చిత్తుడై ఉన్నాడో లేడో గ్రహించకుండా ఉల్లాస పరిచే సంగతులు చెబుతూ మధ్యలో తన కోరికను వెళ్ళబుచ్చడం ఎలాంటిదంటే– ఆ వాకట్టువేరు దగ్గర లేకుండా పాము ముందు సాహసంతో చేయి చాచడం వంటిది, అని భావం.

కం. తప్పునకు తగిన దండన
యప్పుడు శాయంగవలయు నవనీశుకున్
నిప్పుననుచీర జుట్టిన
యాపగిదిని శాయవలయు నారను సుమతీ! (112)

కట్టుకున్న చీరకు నిప్పు అంటుకుంటే ఆర్పడానికి ఎంత తొందరగా పూనుకుంటామో, అంతే తొందరను తప్పు చేసిన వ్యక్తిని దండించడంలోనూ చూపించాలి అని భావం.

కం. నగజాతకు హరుమేనను
సగబాలిప్పించె మరుడు; చచ్చిన పిదపన్
పగసాధింపని మనుజుడు
మగవాడా మగువగాక
మహిలో సుమతీ! (105)

శివపార్వతులకు జన్మించిన పుత్రుడి వలనే తారకాసురుడి బాధ తొలగుతుందని తెలిసిన ఇంద్రుడు, మన్మథుడిని శివపార్వతుల వద్దకు పంపాడు. కఠోర తపస్సులో ఉన్న శివుడు మూడవకన్ను తెరిస్తే మన్మథుడు భస్మం అయ్యాడు. చివరకు పార్వతి అభ్యర్థనతో మన్మథుడు అనంగుడవగా, పార్వతి శివుడిని చేరింది. వారి పుత్రుడు కుమారస్వామి తారకాసురుడి బాధను తొలగించాడు. ఈ కథ ఆధారంగా– మన్మథుడు మరణించి అనంగుడైనప్పటికీ పార్వతిని శివుడిలో సగ భాగం చేసి తన పగ తీర్చుకున్నాడు కదా! అని ఈ పద్యం చమత్కరిస్తుంది. మరణించినప్పటికీ పగసాధించడమే పురుష లక్షణం అని ఇందులో భావం.

కం. అరమాడజీతమైనను
ధరణీశుడు తగవరైన దగ్గిరవచ్చున్
సురరాజ్యమిచ్చె నేనియు
తరమెరుగని రాజు కొల్వు తగదుర సుమతీ! (107)

'తగవరి' అంటే రాజ్యపాలనలో తగినంత సమర్థత కనబరిచే వాడు అని అర్థం. 'దగ్గిరవచ్చున్' అనగా సమీపించవచ్చు, ఆ రాజు కొలువులో చేరవచ్చు అనే అర్థంలో ఉపయోగించబడింది. జీతం అత్యల్పమైనప్పటికీ సమర్థుడైన ప్రభువు కొలువులో పని చేయవచ్చు. కానీ తన అధీనంలోని ఒక రాజ్యానికి రాజును చేస్తాను అన్నప్పటికీ, 'తరమెరుగని' రాజు – సమర్థత లేని రాజు కొలువులో ఉద్యోగం పనికి రాదు అని భావం.

కం. యెడ్డెడు సతివలపెరుగని
జడ్డలబడి తిరుగువాడు జాణుండగునా
యడ్డముడిడ్డము దిరిగితె
తెడ్డెరుగునె పాలతీపి తెలియర సుమతీ! (106)

రాత సరిగా లేక చదవడానికి కష్టంగా ఉన్న పద్యాలు పది వరకూ ఈ తాళపత్ర ప్రతిలో ఉన్నాయి. అటువంటి పద్యాలలో ఇది ఒకటి. రాతలో మూడవ పాదంలో అక్షరాలు 'యడ్డముడిగటము దిరిగితె' అని ఉన్నాయి. పద్యం భావానికి సరిపోయేట్లుగా మూడో పాదం సవరించి రాయబడింది. సరసత తెలియని వ్యక్తులతో చేసే స్నేహం వలన ఇంట్లోని భార్య పిల్లలకు కష్టమే కలుగుతుంది తప్ప ప్రయోజనం ఉండదని చెప్పడం ఇందులో భావం.

కం. చెపలత లాభము చెరుచును
నెపమున పగవారి గూడి నేరము లెంచున్
అపవాదించును నమ్మిక
కపటాత్మునితోడి పొందు కాదుర సుమతీ! (91)

సుమతీశతకంలోని పద్యాల ముద్ర పూర్తిగా ఉన్న పద్యాలలో ఇది ఒకటి. మూడవ పాదంలో 'ఆపలాచించ్చును నంమ్మిక' అని రాతలో అక్షరాలను బట్టి 'నమ్మకం అతిగా వాదించేలా చేస్తుంది' అన్న భావం గ్రహించి, దానికి దగ్గరగా సరిచేయబడింది.

కం. పగవాడు తనకు జిక్కిన
పగచంపుట మేలు చేసి పంపుట ధరలో
పగవానికదియె చంపుట
తగువానికి అదియె నీతి తత్వము సుమతీ! (52)

శత్రువు నిస్సహాయుడై చిక్కిన తరువాత కూడా అతడిని పగవానిగా చూడడం మానవత్వంతో కూడుకున్న పని కాదని, కరుణించి వదిలి వేయడమే సరైనది అని ఇందులో భావం.

కం. కుటిలాత్ముని నొనగూడకు
పటువై సభలోన వెడల బల్కకు మతి దు
ర్ఘటమగు కార్యము శాయకు
నిటలాక్షుని మీద భక్తి నిల్పుము సుమతీ! (57)

కుటిలస్వభావుడైన వ్యక్తితో స్నేహం చేయడం, సభలో అందరి ఎదుట అవసరాన్ని మించిన గొప్పదనపు మాటలను మాట్లాడడం, నలుగురికి హాని చేసే పనులను చేయడం వంటివి తగని పనులని, నిటలాక్షుడైన శివుడిని నిరతం ధ్యానించడం శ్రేయస్సును కలుగజేస్తుందని చెబుతుంది పై పద్యం.

కం. కనరానిది పరతత్వము
వినరానిది గురువు నింద, వినికనియైనన్
అనరానిది పరుషత్వము
మనరాదవివేకి తోడ మతముర సుమతీ! (73)

మనిషి చూపు దైవత్వానికి సంబంధించిన సంగతులను చూడలేదు. అలాగే సత్పురుషుడు గురువును చేసే నిందను వినలేడు. ఒకరిని గురించి చెడుగా విన్నప్పటికీ, చూసినప్పటికీ కూడా పరుషంగా మాట్లాడకూడదు. అలాగే, అవివేకితో స్నేహం ఎక్కువ కాలం కొనసాగించకూడదు అని భావం.

కం. తెరవున యేనుగు పొడగని
మొరయించుకు వెర్రిగండు మొరగిన భంగిన్
దొర నల్పుడెరుగ కాడిన
సరిసేయగ వలదు వాని సహజము సుమతీ! (74)

ఏనుగు దారిలో నడుస్తున్నప్పుడు అల్ప జంతువులు భయంతోనూ, ఆశ్చర్యంతోనూ అనవసరమైన ఆర్భాటం చేసి అభాసుపాలైనట్లుగా, అల్పుడైన వ్యక్తి విజ్ఞత కోల్పోయి మాటాడే మాటలను గురించి ఉత్తముడైన వ్యక్తి పట్టించుకోనవసరం లేదని, ఒకవేళ సరిచేసే ప్రయత్నం చేస్తే, ఆ ప్రయత్నం వలన కూడా ప్రయోజనం ఉండదని భావం.

■ భట్టు వెంకటరావు

బొమ్మలు: అక్బర్

ఉద్యమంతో కలిసి నడిచే 'జూలూరు పథం'

తెలుగు సాహిత్య రంగంలో ముఖ్యంగా తెలంగాణ సాహిత్య రంగంలో వెలుడిన దీర్ఘ కావ్యాల చరిత్ర కూడ సుదీర్ఘమైందే. 1930లలో సురవరం నుంచి మొదలుపెడితే కాళోజీ, సినారె, కవిరాజమూర్తి, చెరబండరాజు, వరవరరావు, ఎన్కే, గద్దర్, సిధారెడ్డి వరకు ఈ పరంపర సుదీర్ఘం. 1980లలో మినీకవిత పేరుతో కోస్తా కేంద్రంగా రూపవాదం తెలుగు సాహిత్య రంగాన్ని చుట్టుముట్టినప్పుడు దానిని తిరస్కరిస్తూ తెలంగాణ కేంద్రంగా విప్లవసాహిత్యంలో భాగంగా వరవరరావు 'సముద్రం', ఎన్కే 'లాల్ బనో గులామి చోడో', నందిని సిధారెడ్డి 'పదఘటన ప్రతిఘటన' వంటి దీర్ఘ కావ్యాలు రాసి దానిని తిరస్కరించారు. ఈ ప్రతిఘటన క్రమంలో తెలంగాణ నుంచి దీర్ఘకావ్యాలు వెలువడుతూనే వచ్చాయి.


ఈ క్రమంలో వెలువడిన దీర్ఘకవిత 'జూలూరు పథం'. ఈ కవిత నిడివి 230 పేజీలు. దీర్ఘకవిత అని కవి భావిస్తున్నా ఇది కావ్యమే. ఆ లక్షణాలు ఉన్నాయి. ఈ కావ్యరచన చేసిన కవి జూలూరు గౌరీశంకర్. ఈ కావ్యం ఇతివృత్తం మలిదశ తెలంగాణ రాష్ట్ర ఉద్యమం. ఇది జూలూరు పథం మాత్రమే కాదు, వందేళ్ళ తెలంగాణ రాజకీయ, సామాజిక, సాంస్కృతిక ప్రస్థానం కూడా. సారాంశంలో చెప్పాలంటే ఇది తెలంగాణ ఆత్మకు అక్షరరూపం. అక్కడక్కడ ఉద్వేగం, ఆలోచనతోపాటు ఆధిపత్యం, దోపిడీలపై ధిక్కారం సమ్మిళితమై వెలువడిన కావ్యమిది. ఈ తరహా కావ్యాలు రాయడానికి బలమైన సామాజిక, రాజకీయ సందర్భం ఉండాలి. రాయపూనుకున్న కవికి సరైన రాజకీయ దృక్పథం ఉంటే ఆ కావ్యం పాఠకులకు చేరుతుంది. దీనిని కాళోజి కావ్యాలలో చూడవచ్చు. 'జూలూరు పథం' కావ్యానికి కూడ ఇది ఉన్నది.

తెలంగాణ సాంస్కృతిక రంగ యోధులు– సురవరం, చందాల కేశవదాసు, సుద్దాల హనుమంతు, దాశరథి, వట్టికోట ఆళ్వారుస్వామి, తెలంగాణ సాయుధ పోరాటంపై చిత్రాలు వేసిన చిత్ర ప్రసాద్‌లు ఈ కావ్యంలో పాఠకులకు తారసపడతారు. తెలంగాణ రాష్ట్ర ఉద్యమానికి ఊపిరిని ఊదిన జయశంకర్‌పై ప్రత్యేకమైన అధ్యాయమే ఉన్నది. భిన్న భావ జాలాలకు చెందిన రాజకీయ బృందాలు ఒకే వేదిక పైకి వచ్చి తెలంగాణ రాష్ట్ర సిద్ధికి ఉద్యమించడాన్ని గుర్తించడం ద్వారా కవి స్థానికంగా ఉన్న ప్రజాస్వామిక విలువలకు పట్టం కట్టాడు. చరిత్ర గతిలో తెలంగాణ పొదివి పట్టుకున్న బహుళ సంస్కృతుల స్వభావాన్ని వివరించాడు. శతాబ్దాలుగా తెలంగాణ పోరాటాల ప్రస్థానాన్ని చెబుతూ పాలస్తీనా, క్యూబాలతో పోల్చి అంతర్జాతీయతను ప్రతిపాదిస్తాడు. హైదరాబాద్ సహజీవన సంస్కృతిని విపులంగా చర్చించాడు.

సమీప కాలానిదే అయినా తెలంగాణ గత చరిత్రను అనుసంధానించడం వల్ల 'జూలూరు పథం' దీర్ఘ కావ్యం ఇతిహాస లక్షణాలను సంతరించుకున్నది. ఆంధ్ర మహాసభ, సురవరం ప్రస్తావనలతో పాటు తెలంగాణ సాయుధ పోరాటం, 1969 తెలంగాణ తిరుగుబాటు, జగిత్యాల జైత్రయాత్రను చాటుతూ తెలంగాణ రాష్ట్ర ఉద్యమ విస్తృతిని, న్యాయబద్ధతను విశ్లేషించాడు కవి. ఇవి కవికి ఉన్న చారిత్రక దృష్టిని పట్టి చూపుతాయి. అన్యాయంపై తెలంగాణ సమాజానికి ఉన్న తిరుగుబాటును, పోరాట స్వభావాన్ని పట్టుకోవడంలో ఈ కావ్యం సఫలమైంది. ఇంతేగాక తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో తారసిల్లిన ప్రతిమలుపును వ్యక్తీకరించడం ఈ కావ్యం ప్రత్యేకత. ఈ తరహా వైఖరి కాళోజీ కవిత్వంలో కనిపిస్తుంది. మొత్తంగా చూస్తే ఈ కావ్యం ప్రత్యేకత– స్థానికత, జాతీయత, అంతర్జాతీయత వ్యక్తం కావడం.

జూలూరు ఈ కావ్యం వెలువరించడానికి నేపథ్యం ఆయన పుట్టి పెరిగిన ఊరు నడిగూడెం. ఇది మునగాల సంస్థానానికి రాజధాని కేంద్రం. తెలంగాణ సాయుధ పోరాటానికి అండగా నిలిచిన ప్రాంతమిది. 1969 ఉద్యమం కూడ ఇక్కడ పెద్ద ఎత్తున జరిగింది. ఇటు తెలంగాణ అటు ఆంధ్ర ప్రాంతాల ఆధునిక వికాసానికి పూనుకున్న ప్రజాస్వామికవాది, స్వయంగా రచయిత అయిన నాయని వెంకట రంగారావు ఈ సంస్థానాధీశుడే. హైదరాబాద్ నగరంలో శ్రీకృష్ణదేవరాయ నిలయం, తెలుగు వారి ఆధునిక వికాసానికి ఎంతగానో కృషి చేసిన విజ్ఞాన చంద్రికా గ్రంథ మండలుల స్థాపనలో ప్రముఖ పాత్ర ఆయనదే. ఈ నడిగూడెం పక్కన ఉన్న రేపాల గ్రామం తెలంగాణ నాటకరంగానికి చేసిన సేవ ఎంతో ఉన్నతమైంది. ఈ వాతావరణంలో పుట్టిన గౌరీశంకర్ అక్షరాలతో ఆడుకుని దీర్ఘ కవితా పథాన్ని రాజేయడంలో ఆశ్చర్యమేమీ లేదు. మూడు కవితా ఉద్యమాలలో కీలక పాత్ర వహించిన కవి గౌరీ శంకర్. ఆ మూడు ఉద్యమాలలో ఒకటి దళిత కవితా ఉద్యమం. ఆయన తొలికావ్యం 'పాద ముద్ర' ఈ ఉద్యమ ఆరంభంలోనే వెలువడింది. రెండవది– బహుజన కవితా ఉద్యమం. ఈ ఉద్యమ ఆరంభంలో వెలువడిన కావ్యం 'వెనుక బడిన కులాలు, వెంటాడే కలాలు'. మూడవది తెలంగాణ కవితా ఉద్యమం. ఈ ఉద్యమం ఆరంభంలో వెలువరించిన సంకలనం 'పొక్కిలి'. మొత్తం 15 దీర్ఘ కావ్యాలు, మూడు వచన కవితా సంపుటాలు వెలువరించి 'పొక్కిలి' తెలంగాణ ఉద్యమ కవితా సంకలనానికి సంపాదకత్వం వహించాడు. ఇప్పుడు 'జూలూరి పథం' ఆయన 16వ దీర్ఘ కావ్యం. కాళోజి వలే తెలంగాణ రాష్ట్ర ఉద్యమం తిరిగిన

సమీప కాలానిదే అయినా తెలంగాణ గత చరిత్రను అనుసంధానించడం వల్ల 'జూలూరు పథం' దీర్ఘ కావ్యం ఇతిహాస లక్షణాలను సంతరించుకున్నది. అన్యాయంపై తెలంగాణ సమాజానికి ఉన్న తిరుగుబాటును, పోరాట స్వభావాన్ని పట్టుకోవడంలో ఈ కావ్యం సఫలమైంది. ఇంతేగాక తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో తారసిల్లిన ప్రతిమలుపును వ్యక్తీకరించడం ఈ కావ్యం ప్రత్యేకత.



ప్రతి మలుపును కవిత్వీకరించడం ఈ కావ్యంలో కనిపిస్తుంది. తనను కదిలించిన ఏ దుస్సంఘటనకైనా, అన్యాయానికైనా వెంటనే స్పందించి రాయడం కాళోజీ విధానం; గౌరీ శంకర్ కూడ అంతే. కాళోజీ మొత్తం కవితా రచనను అధ్యయనం చేస్తే తెలంగాణ సామాజిక చరిత్రను నిర్మించవచ్చు. మొత్తంగా చూస్తే గౌరీశంకర్ కూడ అంతే. 1991 నుంచి ప్రతి రాజకీయ, సామాజిక సందర్భంపైనా దీర్ఘకావ్యం వెవలువరించాడు. ఈ నేపథ్యంలో చూస్తే ఈ కవి కాళోజీకి అచ్చమైన వారసుడని చెప్పక తప్పదు.

■ సామిడి జగన్ రెడ్డి
✆ 85006 32551

రక్తం చుక్కల పొద్దు



హిమ హితులారా మీదొక పెదవి
మాదొక పెదవి విప్పి
శాంతిని గురించి మాట్లాడుదాం

రాజ్యం ఆయుధం పట్టుకొనే శాంతి అంటున్నది
అయినా సరే మనం కన్నీళ్ల దోసిట్లో పట్టుకొని మాట్లాడుదాం

రక్తం చుక్కల పొద్దును ఎవరు కోరుకుంటారు
యత్రికులైన, వ్యాపారులైన
సుందరమైన మధ్యాహ్నం కొండచరియ విరిగినట్టు
మనుషులు శవాలై రాలుతారని ఎవరు ఊహించగలరు
దుఃఖం ఎవరిదైనా దుఃఖమే
చంపిన చేతుల వెనక కుట్రను పసిగట్టి నిలదీయాల్సిందే

జీలంతో ముడిపడ్డ జీవితాలు
రోజూ చెమట చుక్కల నిశ్శబ్దాన్ని ప్రేమిస్తాయి
తూటాల శబ్దాన్ని కాదు

ఒరిగిన దేహాల సాక్షిగా మనమందరం
నిర్లిప్త మానవ రూపాలమై సంచరిస్తున్నందుకు
సిగ్గుపడుతూనే
ఆ మట్టిపొరల్లో దాక్కున్న పురా దుఃఖాన్ని
విందామా ఇప్పుడైనా

కరగడం బాగా తెలిసిన నేల అది
కన్నీటిని దేవదారు బెరళ్లకింద దాచి
నవ్వుతున్నట్టు కొమ్మల్ని కదుపుతున్నది
చూడండి

నదంత సృజనశీలి ఉందా ఈ ప్రపంచం మీద
పారే రక్తం ఎవరిదైనా రెండు చేతులతో
దశాబ్దాలుగా శుభ్రపరుస్తూనే ఉన్నది
శవాలని భుజంమీద మోస్తూనే ఉన్నది

ఆరిపోయిన వెలుతుర్లో
శవాలైన జంటలు కుంకుంపువ్వు రహస్యాల్ని
విప్పిచెబుతున్నాయి
కొంచెం చెవుల్ని తడిచేసుకొని విందాం

■ వేముగంటి మురళి

'లైఫ్ డ్రామా', 'భూమి నవ్వడం చూశాను' ఆవిష్కరణ

రాధకృష్ణ కర్రి 'లైఫ్ డ్రామా', అమూల్య చందు 'భూమి నవ్వడం చూశాను' కవితా సంపుటాల ఆవిష్కరణ మే 11 ఉ.10 గంటలకు విజయవాడలోని ఎంబీవీకే బాలోత్సవ్ భవన్‌లో జరుగుతాయి. ఆవిష్కర్త నగ్నముని. సభలో వసీరా, శాంతిశ్రీ, వాణిశ్రీ, సుధామురళి మాట్లాడతారు.

లలిత పబ్లికేషన్స్

రెండుతరాల కవిసంగమం

రెండు తరాల కవి సంగమం, సీజన్ 2, సిరీస్ 40 కార్యక్రమం మే 10, సా.6గంటలకు సౌజన్య వేదిక, నిజాం కాలేజి ప్రాంగణం, బషీర్ బాగ్, హైదరాబాద్‌లో జరుగుతుంది. పాల్గొను కవులు: ప్రసేన్, చిగురాల్ పల్లి ప్రసాద్, కల్యాణి కుంజ, బాలు అగ్నివేష్, మేనావత్ రఘు (నిజాం కాలేజి విద్యార్థి).

కవిసంగమం

పీచర సునీతారావు పురస్కారాలు

పీచర సునీతారావు చతుర్థ వార్షిక పురస్కారాల కోసం కవిత్వంలో తండా హరీశ్ గౌడ్ ('గాలి లేని చోట'); విమర్శలో ఎం. దేవేంద్ర ('తెలంగాణ కథ వర్తమాన జీవన చిత్రణ'); కథా విభాగంలో పిన్నంశెట్టి కిషన్ ('లేంబాళ వాటిక కథలు'), జడా సుబ్బారావు ('మంచు కింద ఉక్కపోత') ఎంపిక అయ్యారు. పురస్కార ప్రదానం మే 10 ఉ.10గంటలకు రవీంద్ర భారతి, హైదరాబాద్‌లో జరుగుతుంది.

కాంచనపల్లి గోవర్ధన్ రాజు

'కవితాదర్పణం', 'సీతాశతకం' ఆవిష్కరణ

దర్పణం సాహిత్య వేదిక నిర్వహణలో చీదెళ్ళ సీతాలక్ష్మి రచించిన 'కవితాదర్పణం', శంకర నారాయణ రచించిన 'సీతాశతకం' గ్రంథాల ఆవిష్కరణ సభ మే 5 సా.5.30 ని.లకు రవీంద్రభారతి, హైదరాబాద్‌లో జరుగుతుంది. అధ్యక్షత రాయారావు సూర్యప్రకాశ్ రావు, ముఖ్య అతిథి ఏనుగు నరసింహారెడ్డి. దాస్యం సేనాధిపతి, మామిడి హరికృష్ణ, నామోజు బాలాచారి, రామకృష్ణ చంద్రమౌళి తదితరులు పాల్గొంటారు.

రాయారావు సూర్యప్రకాశ్ రావు



అతలాకుతలం

జిల్లాలో ఆదివారం గాలివాన బీభత్సం సృష్టించింది. ఏకధాటిగా గంట పాటు కురిసిన వర్షంతో నగరం జల దిగ్బంధంలో చిక్కుకుంది. ఈదురు గాలులకు రోడ్డు పక్కన చెట్లు నేలకూలాయి. వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగించాయి. మైలవరం మార్కెట్ యార్డులో ఆరబెట్టిన మొక్కజొన్న, ధాన్యం తడిచిముద్దయ్యాయి. కుండపోతగా కురిసిన వర్షంతో అనేక చోట్ల ఇళ్లలోకి నీరు చేరింది. జిల్లాలో 297.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

నగరంలో గంటపాటు ఏకధాటిగా వర్షం

- ఈదురు గాలులకు నేలకూలిన చెట్లు
- మైలవరంలో ఇళ్లలోకి చేరిన నీరు
- తడిసి ముద్దయిన మొక్కజొన్న, ధాన్యం
- విస్సన్నపేట, విజయవాడలో కుండపోత
- పిడుగుపాటుకు దున్న మృతి
- జిల్లాలో 297.4 మి.మీ వర్షపాతం



(ఆంధ్రజ్యోతి, విజయవాడ/ ఇబ్రహీంపట్నం / జి.కొండూరు / మైలవరం రూరల్ / విస్సన్నపేట / రెడ్డిగూడెం / వత్సవాయి): ఈదురు గాలులతో కూడిన అకాల వర్షం ఆదివారం జిల్లా వాసులను వణికించింది. గంటపాటు వర్షం ఏకధాటిగా కురిసింది. ఈదురు గాలులకు విజయవాడలో పటమటలోని న్యూ ఆర్టీసీ కాలనీ, బెంజ్‌సర్కిల్ నారా చంద్రబాబు నాయుడు కాలనీ, భారతీనగర్, నూజివీడు రోడ్డులో చెక్‌పోస్టు వెనుక భారీ చెట్లు నేలకొరిగాయి. దీనితో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. విస్సన్నపేటలో వర్షం భారీగా కురిసింది. ఇక్కడ 54.4మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. మండల కేంద్రం వత్సవాయిని భారీ వర్షం ముంచెత్తింది. పలు చోట్ల విద్యుత్ సరఫరా నిలిపివేశారు. జి.కొం డూరు, మైలవరం, రెడ్డిగూడెం, జి.కొండూరు మండలాల్లో భారీ వర్షం కురిసింది. వి స్సన్నపేటలో మండల పరిషత్ కార్యా లయంలోకి వర్షపు నీరు మిగతా 6లో..





నగరంలో 121.2 మి.మీ వర్షం

విజయవాడలోని ఐదు మండలాల్లో మొత్తం 121.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. సుమారుగా గంటపాటు కుండపోత వర్షం కురవడంతో నగరంలోని రహదారులన్నీ జలమయవయ్యాయి. ఈ వర్షానికి మురుగునీరు రహదారులపైకి వచ్చింది. భూగర్భ డ్రైనేజీ మ్యాన్‌హోళ్లన్నీ చెత్తతో నిండిపోయాయి. దీనితో నీరు వెనక్కి తన్నడంతో ఇళ్లలోకి చేరింది. బెంజ్‌సర్కిల్, ఎన్టీఆర్ సర్కిల్, చిట్టినగర్, కేఎల్‌రావు నగర్, ఏలూరు రోడ్డు, లోబ్రిడ్జి, కబేళా, పాల ఫ్యాక్టరీ ప్రాంతాల్లో రహదారులపై భారీగా వర్షం నీరు నిలిచిపోయింది. దీనితో వాహనదారులు నానా ఇబ్బందులు పడ్డారు. వీఎంసీ వాహనాలు ఇంజన్లతో నీటిని డ్రైనేజీల్లోకి తోడాయి. సాయంత్రానికి నగరంలో సాధారణ పరిస్థితి కనిపించింది.


కడవకొల్లులో గాలివానకు గేదెలపై కూలిన చావిడిని తొలగిస్తున్న స్థానికులు



పిడుగుపాటుకు దున్నపోతు మృతి

రెడ్డిగూడెం మండలం కూనపరాజుపర్వ గ్రామంలో బీసీ కాలనీలో ఓ చెట్టు పక్కన కట్టిన దున్నపోతు పిడుగుపాటుకు చనిపోయింది. తాళ్లూరి నాగేశ్వరరావు దున్నపోతును చెట్టు పక్కన కట్టాడు. ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురవడంతో చెట్టుపై పిడుగు పడింది. చెట్టు పక్కన ఉన్న దున్నపోతుపై పిడుగు పడడంతో చనిపోయింది. దీని విలువ రూ.లక్ష ఉంటుందని పాడి రైతు నాగేశ్వరరావు తెలిపారు.

గ్రూప్-1 మెయిన్స్‌కు 1,153 మంది హాజరు 6లో


నగరంలోని సిద్దార్థ కళాశాల వద్ద పరీక్షా కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థులు

ప్రశాంతంగా నీట్ 6లో

సరసాల సార్ సస్పెన్షన్

ఏపీటీడీసీ డివిజనల్ ఆఫీస్ అకౌంటెంట్ గంగి వెంకటేశ్వర్లుపై వేటు!

భవానీపురం ప్రాంత మహిళతో రాసలీలలు!

హరిత బెర్మ్ పార్క్ ఏపీటీడీసీ ప్రధాన కార్యాలయంలో కామకలాపాలు

వెలుగులోకి తెచ్చిన 'ఆంధ్రజ్యోతి'.. ఒక్క రోజులో విచారణ పూర్తి

వెంకటేశ్వర్లును సస్పెండ్ చేసిన ఏపీటీడీసీ డివిజనల్ అధికారులు!

నేడు సస్పెన్షన్ ఆర్డర్ అందజేత

హరిత బెర్మ్ పార్క్, ఏపీటీడీసీ ప్రధాన కార్యాలయంలో కామకలాపాలు సాగిస్తున్న సరసాల సార్ సస్పెండ్ అయ్యారు. పర్యాటకాభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) విజయవాడ డివిజనల్ కార్యాలయంలో అకౌంటెంట్‌గా పనిచేస్తున్న గంగి వెంకటేశ్వర్లు ఓ మహిళతో రాసలీలలకు పాల్పడుతున్నట్టు గుర్తించిన ఏపీటీడీసీ ఉన్నతాధికారులు అతనిపై శాఖాపరంగా తక్షణ చర్యలు చేపట్టారు. సోమవారం అధికారికంగా సస్పెన్షన్ లేటర్ ఇవ్వనున్నారు. వ్యక్తిగతంగా వాట్సాప్ ద్వారా కూడా సస్పెన్షన్ ఆర్డర్‌ను అతనికి పంపనున్నారు.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): ఏపీటీడీసీ డివిజనల్ కార్యాలయంలోని కీలక విభాగంలో బాధ్యతలు నిర్వహిస్తున్న ఉద్యోగి ఒకరు రోజూ రాత్రిపూట తన ద్విచక్రవాహనంపై ఓ మహిళను వెంటబెట్టుకుని కార్యాలయానికి వచ్చి కామకలాపాలు సాగిస్తున్నారు. దీనిపై 'సరసాల సార్!' అనే శీర్షికతో 'ఆంధ్రజ్యోతి' ఆదివారం ప్రత్యేక కథనం ప్రచురించింది. దీనిపై ఏపీటీడీసీ ఉన్నతాధికారులు అప్రమత్తమయ్యారు. కార్యాలయంలో రాసలీలలు సాగిస్తున్నది పర్యాటకాభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) విజయవాడ డివిజనల్ కార్యాలయంలో అకౌంటెంట్‌గా పనిచేస్తున్న గంగి వెంకటేశ్వర్లుగా గుర్తించారు. విచారణను త్వరగా పూర్తి చేయాల్సిందిగా ఆదేశించారు. విజయవాడ డివిజన్ అధికారులు శరవేగంగా వి చారణను పూర్తి చేసి ఆదివారం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈడీ) పద్మావతికి నివేదికను అందించారు. ఏపీటీడీసీ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈడీ పద్మావతి కూడా ఆగమేఘాల మీద సస్పెండ్ చేయాల్సిందిగా విజయవాడ డివి జన్ అధికారులకు నిర్దేశించారు. విజయవాడ డివిజన్ అధికారులు సస్పెన్షన్ ఆర్డర్‌ను సిద్ధం చేశారు. ఈ ఆర్డర్‌ను సోమవారం అకౌంటెంట్ వెంకటేశ్వర్లుకు అందించనున్నారు. అతని వాట్సాప్‌కు కూడా సస్పెన్షన్ ఆర్డర్‌ను పంపించనున్నారు. ప్రభుత్వ రంగ సంస్థ ఆస్తిని ప్రైవేటు అవసరాల కోసం దుర్వినియోగం చేయటంపై క్రమశిక్షణా చర్యల్లో భాగంగా సస్పెండ్ చేస్తున్నట్టు ఆర్డర్‌లో పేర్కొన్నట్టు సమాచారం. విజయవాడ హెడ్ క్వార్టర్ పరిధి దాటి ఎక్కడికీ వెళ్లకూడదని కూడా వెంకటేశ్వర్లును ఏపీటీడీసీ ఉన్నతాధికారులు ఆదేశించారు.

అకౌంటెంట్ వెంకటేశ్వర్లు చాలా కాలంగా ఒక మహిళతో ఏపీటీడీసీ ఆఫీసుల్లో రాసలీలలు సాగిస్తున్నాడని విచారణలో అధికారులు గుర్తించారు. గతంలో హరిత బెర్మ్‌పార్క్‌లోని స్టాఫ్ రూమ్‌లో సాగించిన రాసలీలలు, విజయవాడ డివి జన్ ప్రధాన కార్యాలయంలో సాగించిన రాసలీలల్లో వెంకటేశ్వర్లు ప్రత్యక్షంగా పాల్గొన్నారని సీసీ టీవీ ఫుటేజీల ఆధారంగా నిర్ధారించారు. హరిత బెర్మ్‌పార్క్‌లోని స్టాఫ్ రూమ్‌లో అత్యంత జుగుప్సాకరంగా ఉన్న దృశ్యాలు బయటపడినట్టు సమాచారం. హరిత బెర్మ్‌పార్క్‌లో సాగించిన రాసలీలల వీడియోలు దారుణంగా ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. డివి జనల్ ఆఫీసుకు కూడా తరచూ బైక్‌పై మహిళను ఎక్కించుకుని వస్తుండటం, కార్యాలయంలోకి ఆ మహిళను తీసుకు వెళ్లి తలుపులు వేసుకోవటం, అర్థగంట తర్వాత ఇద్దరూ కలిసి బయటకు వచ్చి వాహనం మీద తిరిగి వెళ్లిపోతున్న దృశ్యాల్లోనూ వెంకటేశ్వర్లు ఉన్నట్టుగా గుర్తించారు. వెంకటేశ్వర్లుతో ఉన్న మహిళ ఎవరు అన్న దానిపై కూడా ఏపీటీడీసీ అధికారులు విచారణ జరిపారు. నగరానికి చెందిన మహిళగా గుర్తించారు. తరచూ వాకింగ్ చేయటానికి మిగతా 6లో..

నాడు వీడియోలు తీసి బయటపెట్టినా మారని తీరు!

నగరంలో డేంజర్ బెల్స్!

జెండా చెట్టు సెంటర్ అవుట్ ఫాల్ డ్రెయిన్ వెంట్‌లో ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోతే పాతబస్తీ మొత్తం మురుగునీటి ముంపును ఎదుర్కొంది. ప్రస్తుతం నగరంలో 90 శాతంగా ఉన్న అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ (యుజీడీ) పాలిథీన్ వ్యర్థాలతో నిండిపోతుంటే.. నగరమే మునిగిపోయినా ఆశ్చర్యపోనక్కరలేదు. ఆదివారం నగరంలో కురిసిన వర్షాల కారణంగా ఈ సమస్య తీవ్రత వెలుగు చూసింది. భవి ష్యత్తు డేంజర్ బెల్స్‌ను మోగించింది. రానున్న వర్షాకాలం నాటికి నగర యుజీడీ వ్యవస్థను ప్రక్షాళించకపోతే మాత్రం పెను ప్రమాదం పొంచి ఉందన్న సంగతి నగర పాలకులు మరిచిపోకూడదు. బుడమేరును ఇలానే తేలిగ్గా తీసుకుంటే అది చేసిన వి లయం మన కళ్లలో ఇప్పటికీ కదలాడుతూనే ఉంది.



90 శాతం వినియోగంలో ఉన్న యూజీడీలో భారీగా పాలిథీన్ వ్యర్థాలు

- నాడు.. ఒక్క జెండా చెట్టు డ్రెయిన్ వెంట్‌తోనే మునిగిన పాతబస్తీ
- ఇప్పుడు నగరమంతా యూజీడీలో ఇదే పరిస్థితి
- ఆదివారం భారీ వర్షంతో.. డేంజర్ బెల్స్ మోగించిన యూజీడీ

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): సరిగ్గా దశాబ్దంన్నర కిందట 2007- 08లో పాతబస్తీ మురుగునీటి ముంపుకు గురైంది. జెండా చెట్టు అవుట్ ఫాల్ డ్రెయిన్‌కు సంబంధించి విజయవాడ రైల్వే ట్రాక్స్ దిగువన ఉన్న వెంట్‌లో చెత్తా, చెదారంతో నిండిపోవటంతో .. మురుగు నీరు పారక.. అదికాస్తా పాతబస్తీపై దండయాత్ర చేసింది. మురుగు పారక.. వీధుల మీదకు ఎగదన్ని పాతబస్తీ మొత్తంగా మురుగుతో దిగ్బంధమైంది. ఈ మురుగును తొలగించటానికి కార్పొరేషన్ యంత్రాంగానికి పక్షం రోజుల సమయం పట్టింది. ప్రజలు రోడ్ల మీద చేరిన మురుగునీటిపై పడవులలో ప్రయాణించాల్సిన దుస్థితి దాపురించింది. మళ్లీ ఇప్పుడు ఆ ప్రమాదం కనిపిస్తోంది. ఎందుకంటే.. నగరంలో భూగర్భ మురుగునీటి పారుదల (యూజీడీ) వ్యవస్థ భయంకరంగా తయారైంది. అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ కాస్తా చెత్తా, చెదారంతో నిండిపోయింది. మురుగు ముందుకు కదిలే పరిస్థితి లేకుండా పోయింది. నగరమంతా ఇదే పరిస్థితి. ఆదివారం నగరంలో కురిసిన వర్షం మిగతా 6లో..

ఆందోళన కలిగిస్తున్న యూజీడీ వ్యవస్థ

యూజీడీ వ్యవస్థను చూస్తుంటే ఆందోళన కలిగిస్తోంది. ఈ వేసవిలో ఆదివారం కురిసిన భారీ వర్షంతో నగరం ఒక్కసారిగా జలదిగ్బంధమైంది. ఇంకా చెప్పాలంటే మురుగు ఎగదన్నింది. దీనికి కారణం.. నగర వ్యాప్తంగా ఉన్న యూజీడీ లోకి పెద్ద ఎత్తున చెత్త పేరుకు పోవటమే కారణం. దీంతో మ్యాన్‌హోల్స్ నుంచి మురుగు బయటకు రావటం తరచూ జరుగుతోంది. ఒక ప్రణాళిక ప్రకారం నిర్మించిన అండర్ గ్రౌండ్ డ్రెయినేజీలో సాఫీగా మురుగునీరు ప్రవహిస్తుంది. యూజీడీలో ఏమైనా వ్యర్థాలు ఉంటే అది సిల్టు మాత్రమే ఉంటుంది. కానీ మన యూజీడీలో మాత్రం శానిటరీ న్యాప్కిన్స్ , వాటర్ బాటిల్స్, పాల ప్యాకెట్ సంచులు, పెరుగు కప్పులు, ఇలా రకరకాల పాలిథీన్ వ్యర్థాలతో నిండిపోతున్నాయి. ఈ వ్యర్థాలతో ఎక్కడకక్కడ నగరంలో యూజీడీ స్తంభించి పోతోంది. ఇలా స్ట్రక్ అయిపోయిన ప్రాంతాలలో మ్యాన్‌హోల్స్ నుంచి మురుగు బయటకు వస్తోంది. వర్షం కురిసిన సందర్భాలలో రోడ్ల మీద చేరిన నీటిని కూడా కొంత మేర మ్యాన్‌హోల్ సంగ్రహిస్తాయి. ఈ క్రమంలో యూజీడీలో చెత్తాచెదారం ఉంటే మాత్రం ఒక్కసారిగా మురుగుతో వాననీరు కలిసిపోయి రోడ్ల మీదకు ఎగదన్నుతోంది. నగరంలోని మూడు నియోజకవర్గాలలోనూ ఈ పరిస్థితి కనిపిస్తోంది. దశాబ్దంన్నర కిందట జెండా చెట్టు అవుట్‌పాల్ డ్రెయిన్ వెంట్ ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోతేనే పాతబస్తీ మునిగిపోతే.. నగరంలోని యూజీడీ వ్యవస్థ దాదాపుగా వ్యర్థాలతో నిండిపోతే భవిష్యత్తులో ఎంత ఉపద్రవం వస్తుందో ఊహించటానికే భయందోళనలు కలిగిస్తోంది. నగరం మీదకు మురుగు దండెత్తితే ఇంతకంటే సిగ్గుచేటైన వి షయం మరొకటి ఉంటుందా అన్నది కార్పొరేషన్ పాలకులే ఆలోచించాల్సిన అవసరం ఉంది.

ఆడుకుంటూ సైడు కాల్వలో పడి

బాలుడు మృతి

మరో బాలుణ్ణి రక్షించిన స్థానికులు



గుణదల, మే 4(ఆంధ్రజ్యోతి): ఆడుకుంటూ సైడు కాల్వలో పడి ఓ బాలుడు చనిపోయిన ఘటన గుణదల వైఎస్ఆర్ కాలనీలో ఆదివారం జరిగింది. వైఎస్ఆర్ కాలనీలో నివాసం ఉంటున్న రాజేష్‌కు ముగ్గురు సంతానం. వీరిలో పెద్ద కుమారుడైన మణికంఠ(7) గుణదల సియోన్ బైబుల్ స్కూల్లో 2వ తరగతి చదువుతున్నాడు. ఆదివారం సాయంత్రం చుట్టుపక్కల పిల్లలతో ఆడుకుంటూ ప్రమాదవశాత్తు సైడు కాల్వలో పడిపోయాడు. అదే సమయంలో మరో బాలుడు సైడు కాల్వలో పడటాన్ని గమనించిన స్థానికులు క్షణాల్లో బయటికి తీయడంతో అతను ప్రాణాపాయ స్థితి నుంచి బయటపడ్డాడు. మొదట సైడు కాల్వలో పడ్డ మణికంఠను ప్రభుత్వాసుపత్రికి తరలించగా, అతను అప్పటికే చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. సమాచారం అందుకున్న మాచవరం సీఐ ప్రకాష్ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఊదరకొండ మణికంఠ నీరు ఉధృతంగా ప్రవహిస్తున్న సైడు కాల్వలో పడటంతో చనిపోయినట్లుగా ప్రాథమికంగా అంచనాకు వచ్చారు. మరో బాలుడు క్షేమంగా ఉన్నాడని తెలుసుకుని ఊపిరి పీల్చుకున్నారు. బాలుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మాచవరం పోలీసులు తెలిపారు. కాగా, బాలుడి కుటుంబాన్ని టిడిపి యువ నాయకుడు గద్దే క్రాంతి కుమార్ ఆదివారం రాత్రి పరామర్శించారు. తనవంతు సాయంగా బాలుడి కుటుంబానికి రూ.50 వేల ఆర్థిక సాయాన్ని క్రాంతి కుమార్ అందజేశారు.



పరీక్షా కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ లక్ష్మీశ

ప్రశాంతంగా నీట్

» ఎన్టీఆర్ జిల్లాలో 13,455 మంది హాజరు

విజయవాడ, మే 4 (ఆంధ్రజ్యోతి) : నీట్-2025 యూజీ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఆదివారం జరిగిన పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 28 కేంద్రాల్లో 13,625 మంది అభ్యర్థులకు 13,455 (98.75 శాతం) మంది హాజరయ్యారు. నగరంలో ఉదయం వరుణుడు ఆందోళన కలిగించినా కొంతసేపటికి వర్షం ఆగిపోవడంతో అభ్యర్థులు ఊపిరిపీల్చుకున్నారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా నీట్ పరీక్ష సజావుగా ముగిసింది. కలెక్టర్ ఆదేశాల మేరకు ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సిబ్బంది జాగ్రత్త పడ్డారు. వీజీ సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, సిద్ధార్థ పబ్లిక్ స్కూల్ పరీక్షా కేంద్రాలను ఆకస్మికంగా కలెక్టర్ తనిఖీ చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, బయోమెట్రిక్, కంట్రోల్ రూమ్ విధులు, వీడియోగ్రఫీ, సీల్డ్ కవర్, నివేదికలు తదితర అంశాలపై నిర్వహణ అధికారులు, సిబ్బందికి శిక్షణ ఇచ్చినట్టు తెలిపారు.

గ్రూప్-1 మెయిన్స్‌కు 1,153 మంది హాజరు



విజయవాడ, మే 4 (ఆంధ్రజ్యోతి) : గ్రూప్-1 పరీక్ష రెండోరోజు ప్రశాంతంగా ముగిసింది. ఎన్టీఆర్ జిల్లాలో 1,801 మందికిగాను 1,153 (64.02 శాతం) హాజరయ్యారు. ఎలాంటి ఇబ్బంది లేకుండా ఆదివారం పరీక్షను అధికారులు నిర్వహించారు. ఉదయం వరుణుడు ఇబ్బంది పెట్టినా అధికారుల చొరవతో రోడ్లపై నీటిని యుద్ధ ప్రాతిపదికన తొలగించి, ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చేయడంతో అభ్యర్థులు సమయానికి పరీక్షా కేంద్రాలకు చేరుకోగలిగారు.

కానూరులో కళాశాల విద్యార్థుల మధ్య ఘర్షణ

» ఫర్నీచర్ ధ్వంసం.. రంగంలోకి పోలీసులు

పెనమలూరు, మే 4 (ఆంధ్రజ్యోతి): కానూరులోని ఓ ప్రైవేటు జూనియర్ కళాశాలలో శనివారం సాయంత్రం విద్యార్థుల మధ్య చెలరేగింది. ఘర్షణలో కళాశాలకు చెందిన ఫర్నీచర్ ధ్వంసమైంది. దీంతో ఆదివారం విద్యార్థులు, వారి తల్లిదండ్రులను కళాశాల యాజమాన్యం, పెనమలూరు పోలీసులు పిలిపించి విచారణ చేశారు. మురళీనగర్‌లోని ఓ ప్రయివేటు కళాశాలలో నీట్ లాంగ్‌టర్మ్‌కు శిక్షణ పొందుతున్న విద్యార్థుల మధ్య ఎప్పటి నుంచో చిన్నచిన్న గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో శనివారం రాత్రి విద్యార్థులు రెండు గ్రూపులుగా విడిపోయి పరస్పరం దాడులు చేసుకున్నారు. ఘర్షణలో కళాశాలకు సంబంధించిన ఫర్నీచర్‌ను ధ్వంసం చేశారు. విషయం తెలుసుకున్న పెనమలూరు పోలీసులు కళాశాల యాజమాన్యంతో చర్చించి గొడవకు కారణాలను తెలుసుకొని విద్యార్థులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. తల్లిదండ్రులను పిలిపించి విద్యార్థులను వారికి అప్పగించారు.



ముగిసిన త్యాగరాజస్వామి జయంత్యుత్సవాలు

» పంచరత్న కృతుల గోష్ఠిగానంలో పాల్గొన్న కళాకారులు

విజయవాడ కల్చరల్, మే 4 (ఆంధ్రజ్యోతి) : దుర్గాపురంలోని శివరామకృష్ణ క్షేత్రంలో జరుగుతున్న త్యాగరాజస్వామి 258వ జయంత్యుత్సవాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. శ్రీ శృంగేరీ శారదాపీఠం పరిపాలనా క్షేత్రంలో నిర్వహించిన ఈ ఉత్సవాల్లో భాగంగా పంచరత్న కృతుల గోష్ఠిగానంతో పాటు సంగీత కచేరీలు నిర్వహించారు. చినముత్తేవి సంజన, బీవీఎస్ శ్రీకృష్ణ, సీహెచ్ సూర్య గాత్ర ప్రదర్శనలు చేశారు. అనంతరం శ్రీకృష్ణ, కస్తూరి భార్గవ్, పోహూరి శ్యామసుందర్, కె.సుబ్రహ్మణ్యేశ్వరరాజు, కె.అనిల్ కుమార్ వాయిద్య, గాత్ర ప్రదర్శనలతో ప్రేక్షకులను మంత్రముగ్ధులయ్యారు. ముందుగా త్యాగరాజస్వామి ఘనరాగ పంచరత్న కృతుల గోష్ఠిగానం సాగింది. చింతపల్లి సువర్ణలక్ష్మి, మంగళగిరి శ్రీవ్యాస్, వరుణ్ రవిచంద్రన్, రావినూతల శ్రీవైష్ణవి, బి.హర్షిత, మంత్రిప్రగడ ప్రమీల, పి.శ్రీరామచరణ్, ఎం.చారుమతీ పల్లవి, చిట్టా కార్తీక్, టీకేవీ రామానుజాచార్యులు తదితరులు సంగీత ప్రతిభతో శ్రోతలను ఆకట్టుకున్నారు. మల్లాది సోదరులు శ్రీరామప్రసాద్, రవికుమార్ ప్రత్యేక గాత్ర వేదిక అందించగా, వారి కుటుంబ సభ్యులు మల్లాది సిందురాగేశ్వరి (వయోలిన్), మల్లాది శివానంద యశస్వి (మృదంగం) వాయిద్య సహకారంతో కచేరీని ముగించారు. ఈ కార్యక్రమాన్ని పోహూరి గౌరీనాథ్ పర్యవేక్షించారు.



రోడ్లపై వర్షపునీరు తొలగింపు పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ


నగరంలో కలెక్టర్ లక్ష్మీశ పర్యటన

బెంజిసర్కిల్, మే 4 (ఆంధ్రజ్యోతి) : అకాలవర్షం వల్ల ఆదివారం నగరంలో వర్షపునీటితో మునిగిపోయిన రోడ్లను ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ, వీఎంసీ అడిషనల్ కమిషనర్ చంద్రశేఖర్‌లు పరిశీలించారు. బందరురోడ్డు, ఏలూరురోడ్డు తదితర ప్రాంతాల్లో వారు పర్యటించి రోడ్లపై ఉన్న వర్షపునీటిని సెవరేజ్ క్లీనింగ్ మిషన్‌తో తొలగించే ప్రక్రియను వారు పరిశీలించి తగు సూచనలు చేశారు.

సరసాల సార్ సస్పెన్షన్

(5వ పేజీ తరువాయి)

హరిత బెర్మ్ పార్కుకు వస్తుందని, ఆ సమయంలోనే వెంకటేశ్వర్లు ఆమెను ట్రాప్ చేసి లోబరుచుకున్నట్టు తెలిసింది. అప్పటి నుంచి తరచూ హరిత బెర్మ్‌పార్క్ స్టాఫ్ రూమ్‌లోనే వీరిద్దరూ తరచూ ఏకాంతంగా ఉండేవారని సమాచారం. స్టాఫ్ రూమ్‌లో కామక్రీడల వ్యవహారాన్ని అక్కడి సిబ్బంది వీడియోలు తీసి బయట పెట్టడంతో ఏకంగా విజయవాడ డివిజనల్ కార్యాలయాన్నే ఇందుకోసం ఎంపిక చేసుకుని కామకలాపాలు సాగించటం ప్రారంభించారు. కొద్ది నెలలుగా తరచూ మహిళతో వస్తున్న అకౌంటెంట్ వ్యవహార శైలిపై అనుమానం వచ్చిన సెక్యూరిటీ సిబ్బంది ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకువెళ్లటంతో ఈ వ్యవహారం వెలుగు చూసింది.



జలమయమైన ఎన్టీఆర్ స్టేడియం





గాలి దుమారం

ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి చేసిన వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. ఆదివారం ఉదయం జిల్లా కరి మబ్బులతో భీతిగొల్పింది. ఈదురు గాలులతో గంటపాటు భారీ వర్షం కురిసింది. పెనుగాలులకు పలుచోట్ల భారీ చెట్లు నేలకూలాయి. విస్సన్నపేటలో వర్షం భారీగా కురిసింది. పలుచోట్ల విద్యుత్ స్తంభాలు పడిపోవడంతో సరఫరా నిలిపివేశారు. రోడ్లు జలమయం కావడంతో నీరు నిలిచిపోయి వాహన చోదకులు తీవ్ర అవస్థలు పడ్డారు. -



ఆదివారం ఉదయం 8 గంటల ప్రాంతంలో కానూరు వద్ద కమ్మేసిన కారుమబ్బులు



పెనుగాలికి రోడ్డుపై చెల్లా చెదురుగా పడిపోయిన ఇనుప బారికేడ్లు





విజయవాడ నగరంలో జలమయంగా వీధులు

మహోన్నత శక్తి యోగా

» ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

» ప్రపంచ రికార్డులో భాగస్వాములకు సర్టిఫికెట్ల ప్రదానం

చల్లపల్లి, మే 4 (ఆంధ్రజ్యోతి) : సనాతన ధర్మం అందించిన మహోన్నత శక్తి యోగా అని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. మహాసూర్యవందనం - 2025, ఉభయ తెలుగు రాష్ట్రాల యోగా చైతన్య యాత్ర పేరుతో అరకులో గత నెలలో 21850 మందితో 108 నిముషాల్లో 108 సార్లు సూర్యనమస్కారాలతో ప్రపంచ రికార్డు నెలకొల్పిన వారికి సర్టిఫికెట్ల ప్రదానోత్సవం ఆదివారం రాత్రి పురిటిగడ్డ శ్రీకృష్ణ సాయి ధాన్యమందిర కళ్యాణమండపంలో జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ, యోగాతో ఆరోగ్యంగా ఉండగలమన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నిరంతర యోగాసాధన ద్వారానే శక్తిని పొందగల్గుతున్నారని తెలిపారు. ప్రపంచ రికార్డులో యార్లగడ్డ ఆయుష్ ఆరోగ్య యోగా మందిర్ విద్యార్థులకు భాగస్వామ్యం లభించటం గర్వకారణమన్నారు. అరకులో వేలాదిమంది గిరిజనులతో ప్రపంచ రికార్డు స్థాయిలో యోగ నిర్వహించిన పతంజలి శ్రీనివాసును అభినందించారు. విశ్రాంత ఆర్టీవో నాదెళ్ల శివరామకృష్ణ అధ్యక్షతన జరిగిన సభలో యోగా గురువు పంతజలి శ్రీనివాసు, ఆయుష్ హాస్పటల్ ఎండీ డాక్టర్ యార్లగడ్డ రమేష్, సర్పంచ్ యార్లగడ్డ హేమాంజనేయప్రసాద్, యోగా శిక్షకులు తదితరులు పాల్గొన్నారు. ప్రపంచ రికార్డులో భాగస్వాములైన కృష్ణా, గుంటూరు జిల్లాలకు చెందిన 24 మందికి వరల్డ్ రికార్డ్స్ యూనియన్ వారి సర్టిఫికెట్లను ఎమ్మెల్యే అందజేశారు. పతంజలి శ్రీనివాసును సన్మానించారు. తొలుత విద్యార్థులతో కలిసి గురువు పతంజలి శ్రీనివాస్ తదితరులు యోగాసనాలు వేశారు. పలువురు చిన్నారులు వేసిన ఆసనాలు ఆకట్టుకున్నాయి.



రికార్డు సాధించిన విద్యార్థులతో ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ తదితరులు



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్ఎల్వి గ్రూప్ చైర్మన్ పెన్మత్స శ్రీనివాసరాజు, పలువురు ప్రముఖులు

ఎస్ఎల్వి ఇన్‌ఫ్రా నూతన ప్రాజెక్టు ప్రారంభం

వన్‌టౌన్, మే 4 (ఆంధ్రజ్యోతి) : రామవరప్పాడులో ఎస్ఎల్వి అమరావతి గ్రాండ్ త్రీలో ఆదివారం ఎస్ఎల్వి ఇన్‌ఫ్రా నూతన లేఅవుట్ ప్రాజెక్టు ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా గ్రూప్ చైర్మన్ పెన్మత్స శ్రీనివాసరాజు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కన్‌స్ట్రక్షన్ రంగంలో కస్టమర్లకు నాణ్యత అందించటంలో రాజీ పడని వ్యక్తి అని పెన్మత్స శ్రీనివాసరాజును కొనియాడారు. రామవరప్పాడులో ఎస్ఎల్వి గ్రూప్ అమరావతి గ్రాండ్ వన్, టూ, త్రీ అపార్టుమెంట్లు, గ్రీన్ మెడోస్ విల్లాలు నిర్మించారని తెలిపారు. చైర్మన్ పెన్మత్స శ్రీనివాసరాజు మాట్లాడుతూ 20 ఏళ్లుగా కన్‌స్ట్రక్షన్ రంగంలో గేటెడ్ కమ్యూనిటీ అపార్టుమెంట్‌లు, విల్లాలు, సిటీ కమర్షియల్ స్పేస్, లేఅవుట్లు మొత్తం 40 ప్రాజెక్టులను విజయవంతంగా పూర్తి చేశామన్నారు. రామవరప్పాడు, గుణదల, మంగళగిరిలో అపార్టుమెంట్‌లు, విల్లాలు నిర్మించినట్టు తెలిపారు. కస్టమర్ల నమ్మకమే తమ సంస్థకు పునాది అని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారంలోకి రావటంతో స్థిరాస్థి రంగం బలపడిందని, ఇతర రాష్ట్రాల నుంచి కూడా అపార్టుమెంట్‌లు, ఇళ్ల స్థలాలు కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎల్వీ సీఈవో, డైరెక్టర్ విఘ్నేష్ అప్పలరాజు (నాని), విశ్వహిందూ పరిషత్ జాతీయ ట్రస్టీ పుట్టగుంట సతీష్ కుమార్, డైరెక్టర్ ఉప్పలపాటి చైతన్య వర్మ, గ్రూప్ చైర్మన్ వెంకటరత్నం, విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర కోశాధికారి దుర్గాప్రసాద్ రాజు, ప్రముఖులు, వ్యాపార వేత్తలు, రైతులు పాల్గొన్నారు.

మహిళా సెక్యూరిటీ గార్డును దూషించి, కొట్టిన వ్యక్తి అరెస్టు

ఇంద్రకీలాద్రి, మే 4 (ఆంధ్రజ్యోతి) : దుర్గామల్లేశ్వర దేవస్థానంలో విధుల్లో ఉన్న ప్రైవేటు మహిళా సెక్యురిటీ గార్డును అసభ్యకరంగా దూషించి కొట్టిన ఓ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధిని ఆదివారం వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. బాధితురాలు పోలీసులకు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తపేట మహంతిపురం అప్పలస్వామివీధిలో యాంద్రపు వెంకట లావణ్య కుటుంబసభ్యులతో ఉంటోంది. సుమారు ఎనిమిదేళ్ల నుంచి ప్రైవేటు సెక్యురిటీ గార్డుగా దుర్గగుడి దేవస్థానంలో పనిచేస్తున్నది. ఆదివారం ఉదయం 5 గంటలకు ఆలయ ప్రాంగణంలోని రావిచెట్టు వద్ద విధుల్లో ఉండగా అక్కడకు వచ్చిన ఓ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధి మోహన్‌ను ఆమె తన గురించి దేవస్థానంలో పలువురికి అసభ్యకరంగా ఎందుకు చెబుతున్నావని ప్రశ్నించింది. సహోద్యోగితో అక్రమ సంబంధం అంటగట్టటం ఎంతవరకు న్యాయం అని మోహన్‌ను నిలదీసింది. దీంతో మోహన్ ఆమెను అసభ్యకరంగా దూషిస్తూ ముఖంపై పిడిగుద్దులు గుద్దడంతో ఆమె ముఖంపై గాయాలయ్యాయి. దీంతో బాధితురాలు దేవస్థాన అధికారులు, సెక్యురిటీ సంస్థ ప్రతినిధులకు విషయం తెలిపి వారి సూచనల మేరకు వన్‌టౌన్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు మోహన్‌పై బీఎన్ఎస్ ప్రకారం 74, 79, 351(3), 115(2) సెక్షన్ల కింద కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

డేంజర్ బెల్స్!

(5వ పేజీ తరువాయి)

సరికొత్త ప్రశ్నలను లేవనెత్తుతోంది.

సరిగ్గా పదిహేనేళ్ల కిందట..

సరిగ్గా పదిహేనేళ్ల కిందట విజయవాడ పాతబస్తీని ఎగదన్నిన మురుగు సమస్య రాష్ట్ర స్థాయి అంశంగా మారిపోయింది. ప్రతిపక్షాల ఆందోళనలతో .. ఏకంగా ఈ సమస్యపై అప్పటి ప్రభుత్వం ఫైవ్‌మెన్ కమిటీనే నియమించాల్సి వచ్చింది. కాబట్టి సమస్య చిన్నదే కదా అనుకుంటే.. అది పెను సమస్యను సృష్టించే అవకాశం ఉంటుంది. కిందటిసారి నగరంలో భారీ వర్షాలు కురిసినపుడు బుడమేరును లైట్ తీసుకోవటం వల్ల జరిగిన నష్టం కళ్లకు కట్టినట్టుగా కనిపించింది. ఉపద్రవాలు వచ్చే వరకు చూడకుండా.. వాటిని అస్సలు రానీయకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. నగరంలో కురిసిన భారీ వర్షం కారణంగా యూజీడీ వ్యవస్థ ఎంత దారుణంగా ఉందో వెలుగు చూసింది. దీనిని దృష్టిలో ఉంచుకుని రానున్న వర్షాకాలానికి నగరంలోని భూగర్భ డ్రెయినేజీని నూరు శాతం చెత్తా చెదారం లేకుండా చర్యలు తీసుకోకపోతే మాత్రం భారీ మూల్యం చెల్లించుకునే పరిస్థితులు ఉంటాయి. విజయవాడ నగరంలో 90 శాతం ప్రాంతాలలో యూజీడీ వ్యవస్థ అమల్లో ఉంది. కాబట్టి ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకోకపోతే మాత్రం మొదటికే నష్టం వచ్చే అవకాశం ఉంది.

యూజీడీలోకి పాలిథీన్ వ్యర్థాలు?

నగర యూజీడీ వ్యవస్థలోకి పాలిథీన్ వ్యర్థాలు ఎలా చేరుతున్నాయన్నదానిపై కార్పొరేషన్ యంత్రాంగం యుద్ధ ప్రాతిపదికన దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. యూజీడీ అనేది పూర్తిగా భూగర్భంలో ఉండే వ్యవస్థ. భూగర్భంలోకి పాలథీన్ వ్యర్థలు చేరితే.. మురుగు ముందుకు పారదు. యూజీడీలోకి దిగి టన్నుల కొద్దీ పాలిథీన్ వ్యర్థాలను తొలగించటం అన్నది కూడా ఎంతో సవాళ్లతో కూడిన పని. సిల్టును తొలగించటానికి యూజీడీలోకి దిగే కార్మికులు ఎంతో మంది విషవాయువుల కారణంగా చనిపోయారు. విజయవాడలో ఇలాంటి సంఘటనలు ఎన్నో జరిగాయి. ప్రాణాలను పణంగా పెట్టి యూజీడీలోని పాలిథీన్ వ్యర్థాలను తొలగించలేని పరిస్థితి నెలకొనే అవకాశం ఉంది. కాబట్టి నియంత్రణపైనే దృష్టి సారించాల్సి వస్తోంది. పాలిథీన్‌లోనే అనేక వ్యర్థాలు ఉంటున్నాయి. మహిళలు ఉపయోగించిన శానిటరీ న్యాప్‌కిన్స్ పెద్ద సంఖ్యలో ఉంటున్నాయి. ఇవి యూజీడీలోకి ఎలా చొరబడుతున్నాయన్నది పెద్ద మిస్టరీగా ఉంది. యూజీడీలోకి వెళ్లిన శానిటరీ న్యాప్‌కిన్స్ చేస్తున్న నష్టం అంతా, ఇంతా కాదు. శానిటరీ న్యాప్‌కిన్స్ నీటిలో నానిన కొద్దీ అవి మరింతగా ఉబ్బిపోతుంటాయి. వీటివల్ల యూజీడీ ఆటంకమేర్పడుతోంది. ఇళ్ల నుంచి యూజీడీలోకి నేరుగా వీటిని పంపిస్తున్నారా ? సమీపంలోని మ్యాన్‌హోల్స్ తొలగించి వేస్తున్నారా ? మరెలా చేరుతున్నాయన్నది దృష్టి పెట్టాలి. పాలిథీన్ సంచులు, ఇతర పాలిథీన్ వ్యర్థాలు కూడా నేరుగా తమ ఇళ్లలోని పైపుల నుంచి యూజీడీలోకి పంపిచలేరు. ఇలా చేస్తే వారి డ్రెయినేజీ కూడా బ్లాక్ అవుతుంది. మరెలా చేరుతున్నాయన్న దానిపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

కొండ ప్రాంతాల నుంచి సమస్య ఉత్పన్నం అవుతుందా ?

యూజీడీలోకి పాలిథీన్ వ్యర్థాలు ఎలా చేరుతున్నాయన్నది పరిశీలిస్తే కొండ ప్రాంతాల నుంచి ఈ సమస్య ఉత్పన్నమవుతుందన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. నగర జనాభాలో 27 శాతం మంది ప్రజలు కొండ ప్రాంతాలలోనే నివశిస్తున్నారు. కొండ ప్రాంతాలలోకి శానిటరీ సిబ్బంది మెట్లు ఎక్కలేక సరిగా విధులు నిర్వహించకపోవటం వల్ల అక్కడ ఉత్పత్తి అవుతున్న ప్లాస్టిక్ వ్యర్థాలను మ్యాన్‌హోల్స్‌లోకి కానీ, కొండల నుంచి వచ్చే పైపులలోకి రంధ్రాలు ఏర్పాటు చేసి డంప్ చేస్తున్నారన్న అనుమానాలు కూడా కలుగుతున్నాయి. కాబట్టి కొండ ప్రాంతాలపై కూడా దృష్టి సారించాల్సిన పరిస్థితి ఎంతైనా ఉంది.

అమ్మా.. నీవద్దకే వస్తున్నా!

» రోడ్డు ప్రమాదంలో కళ్లెదుటే తల్లి దుర్మరణం

» 21 రోజులు మృత్యువుతో పోరాడి కొడుకు మృతి

» ఈనెల 27న తల్లీకొడుకుల జన్మదినం..

» శోకసంద్రంలో కుటుంబసభ్యులు



తల్లి బోదుల దుర్గా భవానితో సాయి అరవింద్ (ఫైల్)

గుణదల, మే 4 (ఆంధ్రజ్యోతి) : మైల స్నానం చేద్దామని రామవరప్పాడు నుంచి కృష్ణానదికి ద్విచక్ర వాహనంపై బయలుదేరిన తల్లీకొడుకును రింగ్‌రోడ్డులో లారీ ఢీకొంది. ప్రమాదంలో తల్లి అక్కడికక్కడే మృతిచెందగా.. కుమారుడికి రెండు కాళ్లు ఛిద్రమయ్యాయి. ఈ ఘటన ఏప్రిల్ 14న జరిగింది. కొనూపిరితో చికిత్స పొందుతూ సాయి అరవింద్(23) శనివారం రాత్రి మృతిచెందాడు. ఈ ఘటనతో ఆ కుటుంబంలో విషాదఛాయలు అలముకున్నాయి. వివరాలిలా ఉన్నాయి.. రామవరప్పాడులో నివాసం ఉంటున్న బోదుల దుర్గా భవాని(47), గంగాధరరావులకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. గంగాధరరావు పోలవరం ప్రాజెక్టు వద్ద జేసీబీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కుమార్తె 2016లో తీవ్ర అస్వస్థతకు గురై చనిపోయింది. కుమారుడు సాయి అరవింద్ ప్రభుత్వ డెంటల్ ఆసుపత్రిలో పెస్ట్ కంట్రోల్ విభాగంలో కాంట్రాక్టు బాయ్‌గా పనిచేస్తున్నాడు. ఇదిలా ఉండగా ఏలూరులో ఉంటున్న సాయి అరవింద్ పెదనాన్న గుండెపోటుతో చనిపోవడంతో దశదిన కార్యక్రమాలకు హాజరై తిరిగి విజయవాడ చేరుకున్నారు. మైల స్నానం చేసి వద్దామని తల్లిని వెంట బెట్టుకుని ఇంటినుంచి బైక్‌పై బయలుదేరిన కొద్దిసేపటికే రామవరప్పాడు రింగ్‌రోడ్డు వద్ద లారీ ఢీకొనడంతో తల్లి దుర్గా భవాని అక్కడికక్కడే మృతిచెందగా.. సాయి అరవింద్ రెండు కాళ్లూ ఛిద్రమయ్యాయి. 21 రోజులుగా ఆసుపత్రిలో మృత్యువుతో పోరాడి శనివారం రాత్రి మృత్యుఒడికి చేరుకున్నాడు. దీంతో బంధువులు శోకసంద్రంలో మునిగిపోయారు. మే 27న తల్లీకొడుకుల పుట్టిన రోజు కావడంతో బంధువులు జీర్ణించుకోలేకపోతున్నారు. కుమార్తెను పోగొట్టుకున్న బాధనుంచి బయటపడిన ఆ తండ్రికి.. భార్య, కుమారుడు కూడా దూరమవడంతో ఆయన్ను ఓదార్చడం ఎవరితరం కావడంలేదు. సాయి అరవింద్ మృతదేహాన్ని ఆదివారం పోస్టుమార్టం అనంతరం అంత్యక్రియలకు ఏలూరులోని సొంత గ్రామానికి తరలించారు.

అతలాకుతలం!

(5వ పేజీ తరువాయి)

చేరింది. రహదారులకు అడ్డుగా పడిపోయిన చెట్లను వీఎంసీ, మున్సిపాలిటీ సిబ్బంది యుద్ధప్రాతిపదికన తొలగించారు. విజయవాడలో కలెక్టర్ లక్ష్మీషా క్షేత్రస్థాయిలో పర్యటించి రహదారులపై పడి ఉన్న చెట్లను సిబ్బందితో తొలగింపచేశారు. విజయవాడ - విస్సన్నపేట రహదారిలో కందులపాడు నుంచి వెల్లటూరు ఊరి చివరి వరకు రహదారిపై ఉన్న పెద్దపెద్ద గుంతల్లోకి వర్షపు నీరు చేరింది. దీంతో వాహన చోదకులు నానా అవస్థలు పడ్డారు. ఓ వ్యక్తి మామిడి కాయల మూటతో వెళ్తుండగా గుంతలో పడ్డాడు.

విస్సన్నపేటలో అధికం... తిరువూరులో అత్యల్పం...

జిల్లాలో ఆదివారం 297.4 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. జిల్లాలో విస్సన్నపేటలో అధిక వర్షపాతం నమోదైంది. ఇక్కడ 54.4 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. తిరువూరులో అత్యల్పంగా 1.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జగ్గయ్యపేట, పెనుగంచిప్రోలు ఎలంటి వర్షపాతం నమోదు కాలేదు. వత్సవాయి 21.4, చందర్లపాడు 12.6, ఇబ్రహీంపట్నం 12.4, కంచికచర్ల 8.6, వీరులపాడు 7.8, గంపలగూడెం 5.2, నందిగామ 3.8, మైలవరం 4.8, ఎ.కొండూరు 16.2, రెడ్డిగూడెం 18.4, విస్సన్నపేట 54.4, జి.కొండూరు 9.0, విజయవాడ సెంట్రల్, పశ్చిమలో 24.6, విజయవాడ రూరల్ 24.4, విజయవాడ ఈస్ట్ 23.4, విజయవాడ నార్త్ 24.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

పంటలపై వరుణిడి పగ

ప్రస్తుతం పరిస్థితిని పరిశీలిస్తే పంటలపై వరుణుడు పగ పట్టాడా అన్న ప్రశ్న ఉత్పన్నమవుతుంది. రెండు నెలలుగా కురుస్తున్న అకాల వర్షాలకు రైతులు నెత్తినోరు కొట్టుకుంటున్నారు. వర్షాకాలంలో కురిసినట్టుగా వానలు పడుతుండడంతో రైతులకు చేతికొచ్చిన పంటలు తడిసి ముద్దవుతున్నాయి. మైలవరం మార్కెట్ యార్డ్‌లో ఆరబెట్టిన మొక్కజొన్న పంట వర్షానికి తడిసింది. కొన్ని ప్రాంతాల్లో ధాన్యం పొలాల్లోనే ఉండడంతో వర్షానికి రైతులు దానిపై టార్పాలు కప్పలేకపోయారు. ఇప్పటికే మూడు సార్లు కురిసిన వర్షాలకు మామిడి రైతులకు తీరని నష్టం కలిగింది. ప్రస్తుతం మామిడి పంట చివరి దశలో ఉంది. దీనితో ఆదివారం కురిసిన వర్షాలకు, గాలులకు తక్కువ నష్టం కలిగింది.

విజయవాడ తూర్పు

ముగిసిన చదరంగ పోటీలు

విజయవాడ స్పోర్ట్స్, మే 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అండర్-9 బాలబాలికల చదరంగ పోటీలు కానూరులోని స్కాట్ స్ప్రైన్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఆదివారం ముగిశాయి. 2 రోజుల పాటు జరిగిన ఈ పోటీల్లో 97 మంది బాలురు, 37 మంది బాలికలు పాల్గొన్నారు. బాలుర విభాగంలో పి.జస్వంత్, పి.జయ సాకేత్ గెలుపొందగా, బాలికల విభాగంలో వై.మోధిత రెడ్డి, వై శ్రీనిఖిల గెలుపొందారు. వీరు జూన్‌లో జరిగే నేషనల్ టోర్నమెంట్ లో ఆంధ్రప్రదేశ్ తరపున ప్రాతినిధ్యం వహిస్తారని నిర్వాహకులు తెలిపారు.ముఖ్యఅతిథిగా పాల్గొన్న మేజర్ కేఆర్ శేషాద్రిరావు విజేతలకు బహుమతులుఅందజేశారు. స్కాట్ స్ప్రైన్ స్కూల్ సీఈవో కొడాలి జాహ్నవి, ప్రిన్సిపాల్ చలసాని ప్రతిమ, చెస్ కోచ్ కాసిం, టోర్నమెంట్ చీఫ్ ఆర్బిటర్ రాజీవ్‌పాల్గొన్నారు.

అకాల వర్షం.. అతలాకుతలం

- తూర్పు పరిధిలో జలమయమైన లోతట్టు ప్రాంతాలు
- రోడ్లపై నిలిచిపోయిన నీరు.. పూడుకుపోయిన డ్రెయినేజీలు
- సీవరేజీ క్లినింగ్ మిషన్ ద్వారా తొలగింపు
- ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా చర్యలు


బెంజిసర్కిల్ రామాలయం వెనుక సర్వీస్‌రోడ్డులో నిలిచిన వర్షం నీరు


న్యూ ఆర్టీసీ కాలనీలో విరిగిన చెట్టు

భారతీనగర్, మే 4 (ఆంధ్రజ్యోతి): ఈ అకాల వర్షానికి 3, 4 డివిజన్లలోని కాలనీల ప్రధాన, అంతర్గత రోడ్లతోపాటు పలు సర్వీస్ రోడ్లు జలమయమయ్యాయి. భారతీనగర కాలనీ 8వ రోడ్డులోని చెట్లు విరిగిపోవడంతో వాహనదారుల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ముఖ్యంగా 5వ నెంబర్ రోడ్డు, ఐటీఐ కళాశాల రోడ్డు, భారతీనగర్ నోవాటెల్ సర్వీస్ రోడ్డు, గురునానక్ రోడ్డు, ఎన్టీఆర్ కాలనీ, శ్రీరామచంద్రనగర్ కాలనీ, పలు సర్వీస్ రోడ్లు, ఆటోనగర్ రోడ్డు, సమీపంలోని గమేశా బజార్ రోడ్డులో ఉన్న సైడ్ డ్రైనేజీలు పూడికతో నిండిపోయాయి. దీంతో పలు కాలనీ ప్రధాన, అంతర్గత రహదారులు జలమయమయ్యాయి. ఆ సమయంలో వర్షపు నీరు ఎక్కువగా రావడంతో ద్విచక్రవాహనదారులు, పాదచారులు తీవ్ర ఇక్కట్లు పడుతూ రాకపోకలు సాగించారు. అధికారులు స్పందించి రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని సైడు డ్రైనేజీల లోని పూడిక తొలగించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

తూముల్లో చెత్త.. రోడ్లపై నీళ్లు

బెంజ్‌సర్కిల్ నుంచి రామవరప్పాడు రింగ్ వరకు ఉన్న జాతీయ రహదారి, సర్వీస్ రోడ్లో వర్షపు నీటిని మళ్లించడానికి ఏర్పాటు చే సిన తూముల్లో మట్టి, చెత్త పేరుకుపోయాయి. ఏలూరు జాతీయ రహదారి వెంబడి ఉన్న సర్వీస్ రోడ్డుపై, జాతీయ రహదారిపై పలు చోట్ల వాన నీరు నిలిచిపోయింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ఇప్పుడే ఇలా ఉంటే రాబోయే వర్షాకాలంలో రోడ్లన్నీ మునిగిపోతాయని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వర్షపునీరు నిలిచి ట్రాఫిక్ ఇబ్బందులు

బెంజిసర్కిల్: ఈ అకాలవర్షానికి బెంజిసర్కిల్ ప్రాంతంలో వర్షపునీరు రోడ్డుపై నిలిచి ట్రాఫిక్‌కు కొంతమేర ఇబ్బంది కలిగించింది. ముఖ్యంగా బెంజిసర్కిల్ రామాలయం వెనుక సర్వీస్‌రోడ్డులో వర్షపునీరు నిలవడంతో పాదచారులతోపాటు వాహనచోదకులు తీవ్ర ఇబ్బందుకు గురయ్యారు. దీంతో మున్సిపల్ సిబ్బంది స్పందించి బెంజిసర్కిల్, నిర్మలా కాన్వెంట్ రోడ్లలో నిలిచిన వర్షపునీటిని సెవరేజ్ క్లినింగ్ మిషన్ ద్వారా తొలగించారు. వర్షం తగ్గడం, వర్షపునీటిని మిషన్ సహాయంతో తోడటంతో ట్రాఫిక్ ఇబ్బందులు తొలిగాయి. కాగా నారా చంద్రబాబు నాయుడు కాలనీలో రోడ్డుపై చెట్టుకొమ్మ విరిగిపడటంతో స్థానికులు ఇబ్బందికి గురయ్యారు.

పలుచోట్ల నేలకొరిగిన చెట్లు

పటమట: ఈదురు గాలులతో కూడిన వర్షం కారణంగా పటమట పరిసర ప్రాంతాల్లో జనజీవనం అతలాకుతలమైంది. 13వ డివిజన్ జేడీ నగర్, న్యూ ఆర్టీసీ కాలనీ, 12వ డివిజన్ పండరీపురం, చౌదరి పేట, 14వ డివిజన్ ఎన్ఎస్ఎమ్ స్కూల్ వద్ద పలుచోట్ల భారీ వృక్షాలు నేలకొరిగాయి, కొమ్మలు విరిగాయి. అవి విద్యుత్ లైన్లపై పడి విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. విద్యుత్‌శాఖ ఏఈ రాజశేఖర్ ఆధ్వర్యంలో సిబ్బంది చెట్లను తొలగించి విద్యుత్‌ను పునరుద్ధరించారు.


పెటర్నరీ కాలనీ సమీపంలో విరిగిన చెట్టు


పెంటిటి ఆసుపత్రి రోడ్డులో..


భారతీనగర్ సర్వీస్ రోడ్డులో నిలిచిన నీరు


ఏలూరు జాతీయ రహదారిపై



భారతీనగర్ మెయిన్ రోడ్డు

డ్రెయినేజీ వ్యవస్థను మెరుగు పరుస్తాం

- ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్


2వ డివిజన్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్


ప్రభుత్వాసుపత్రి, మే 4 (ఆంధ్రజ్యోతి): త్వరలోనే డ్రెయినేజీ వ్యవస్థలు మెరుగుపరుస్తామని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. ఆదివారం కురిసిన భారీ వర్షానికి 2వ డివిజన్‌లో పలు ప్రాంతాలు జయలమయ్యాయి. రోడ్లపైకి నీరు చేరింది. 2వ డివిజన్ మాచవరం డౌన్ రెవెన్యూ కాలనీలో 1,2 రోడ్లలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం డ్రెయినేజీ వ్యవస్థను పూర్తిగా విస్మరించి పూడిక కూడా తీయలేదన్నారు. అందువల్లే వర్షపునీరు మొత్తం రోడ్లపైకి చేరిందన్నారు. డ్రెయినేజీ వ్యవస్థను మెరుగు పరిచేందుకు సీఎం చంద్రబాబు రూ.200 కోట్లు సీఆర్‌డీఏ నుంచి మంజూరు చేయించారని ఆ నిధులతో నగరంలోని డ్రెయినేజీ వ్యవస్థను పూర్తిగా బాగు చేయిస్తామన్నారు. డివిజన్ పార్టీ అధ్యక్షుడు దాసరి గాబ్రియేల్ డ్రెయినేజీని క్లీన్ చేయించారు. పర్వతనేని రత్నశ్రీ, ఏడుకొండలు, పూర్ణ, ఎలిసిల సురేష్ బాబు, దుర్గారావు పాల్గొన్నారు.


సైనిక్‌స్కూల్ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న లింగం సుధాకరరెడ్డి, చలసాని బాబు రాజేంద్రప్రసాద్, సర్వారాయుడు, డాక్టర్ సిఎల్.వెంకటరావు తదితరులు

కేతనకొండలో నేతాజీ సైనిక్ స్కూల్

సత్యనారాయణపురం, మే4 (ఆంధ్రజ్యోతి): విద్యాభారతి-ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ రక్షణ మంత్రిత్వశాఖ అనుమతితో నేతాజీ సైనిక్ స్కూల్ సొసైటీ ద్వారా స్కూల్‌లను జూన్‌లో కేతనకొండలో ప్రారంభిస్తున్నామని నేతాజీ సైనిక్‌స్కూల్ సొసైటీ ఆర్గనైజింగ్ సెక్రటరీ విద్యాభారతి, దక్షిణమధ్య క్షేత్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ లింగం సుధాకరరెడ్డి తెలిపారు. సత్యనారాయణపురం కొమ్మువారి వీధిలోని కార్యలయంలో సైనికస్కూల్ స్థల ధాత చలసాని బాబూరాజేంద్రప్రసాద్, సైనిక్ స్కూల్ సొసైటీ అధ్యక్షుడు కంటిపూడి సర్వారాయుడు, న్యాయవాది వాసిరెడ్డి వినోద్‌కుమార్, డాక్టర్ సి.ఎల్.వెంకటరావు ఆదివారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా సుధాకరరెడ్డి మాట్లాడుతూ కేతనకొండలో ప్రారంభించే నేతాజీ సైనిక్‌స్కూల్‌కు కేంద్రప్రభుత్వ రక్షణ మంత్రిత్వం శాఖ నుంచి ఏప్రిల్ 25న అనుమతి లభించిందన్నారు. సైనిక్ స్కూల్స్ సొసైటీ నియమ నిబంధనలకు లోబడి పని చేస్తాయన్నారు. ఇక్కడ చదివే విద్యార్థులు మిలటరీ, ఇంజనీరింగ్, డాక్టర్, లాయర్, సివిల్ సరీవసెస్‌లో ఇతర కోర్సుల్లో కొనసాగ వచ్చునన్నారు. ఈ సైనిక్‌స్కూల్ రాష్ట్రంలో నాలుగోదన్నారు. తెలంగాణలో సైనిక్‌స్కూల్ లేనందున రెండు తెలుగురాష్ట్రాల విద్యార్థులకు ఈ నాలుగు స్కూల్స్ స్థానికులుగా పరిగణించి (తెలంగాణ విద్యార్థులకు) కూడా ప్రవేశాలకు అనుమతి లభిస్తుందన్నారు. సైనిక్ స్కూల్‌లో చేరేందుకు ఆల్ ఇండియాసైనిక్ స్కూల్ పరీక్షను, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ గతనెల ఏప్రిల్‌లో నిర్వహించింది. పరీక్షల్లో కనీస అర్హత పొందిన విద్యార్థులు వెబ్ కౌన్సెలింగ్ ద్వారా వచ్చే విద్యా సంత్సరానికి కేతన కొండలో అడ్మిషన్లు లభిస్తాయని తెలిపారు. సైనిక స్కూల్ 6వ తరగతిలో 120సీట్లు ఉన్నాయని (బాలురకు) మాత్రమేనన్నారు.

ఇంద్రకీలాద్రిపై భక్తుల రద్దీ



ఇంద్రకీలాద్రి, మే 4 (ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మ దర్శనానికి ఆదివారం పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. కొందరు మొక్కుబడుల మేరకు అమ్మవారికి తలనీలాలు సమర్పించుకుని, కృష్ణానదిలో పవిత్ర స్నానాలు చేసి అమ్మవారి దర్శనానికి కొండపైకి చేరుకున్నారు. అమ్మవారి దర్శనం శీఘ్రతరంగా జరిగేందుకు ఈవో కె.రామచంద్ర మోహన్, సిబ్బంది క్యూలైన్లలో భక్తులను నియంత్రించారు. అమ్మవారి దర్శనం నిమిత్తం పెద్ద ఎత్తున భక్తులు రావటంతో అంతరాలయ దర్శనాలు (రూ.500)ను నిలిపివేశారు. వేసవిని పురస్కరించుకుని దేవస్థానం సిబ్బంది చలివేంద్రాలు ద్వారా భక్తులకు తాగునీరు, ఉచితంగా మజ్జిగ పంపిణీ చేశారు. వృద్ధులు, దివ్యాంగులు, చిన్నారుల తల్లులకు త్వరగా దర్శనం అయ్యే విధంగా చర్యలు తీసుకున్నారు. ఆదివారం ఉదయం భారీ వర్షం కురవడం వలన ఘాట్ రోడ్డు మూసివేసినప్పటికీ, కనకదుర్గానగర్ మార్గం ద్వారా భక్తుల రాకపోకలు కొనసాగేందుకు తగు చర్యలు తీసుకున్నారు.

7న విద్యుత్ వ్యతిరేక నిరసన ప్రదర్శన


9వ డివిజన్‌లో సీపీఎం నాయకుల ఇంటింటి ప్రచారం

పటమట, మే 4 (ఆంధ్రజ్యోతి): గుణదల విద్యుత్ సౌధ కార్యాలయం వద్ద ఈనెల 7న పెరిగిన విద్యుత్ చార్జీలకు నిరసన సీపీఐం ఆధ్వర్యంలో జరిగే నిరసన ప్రదర్శనను జయప్రదం చేయాలని విజయవాడ తూర్పు నగర కమిటీ సభ్యుడు వీటీ రాజు ప్రజలను కోరారు. ఆదివారం 9వ డివిజన్‌లో ప్రజాభేరి సంతకాల ఉద్యమంలో భాగస్వామ్యం అనే కార్యక్రమంలో భాగంగా సీపీఎం నేతలు, కార్యకర్తలు డోర్ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాన్య ప్రజలపై విద్యుత్ భారాలు తగ్గించాలని, సర్దుబాటు చార్జీలు రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్లు పెట్టి ప్రజలపై భారాల గుది బండ వేయవద్దన్నారు. నేతలు కొనమల మల్లికార్జునరావు, కన్నాబాబు, నరేంద్ర, వెంకటేష్, పి.రాజు పాల్గొన్నారు.

అలరించిన కూచిపూడి నృత్యప్రదర్శన


పవన్‌కుమార్‌శర్మ

విజయవాడ కల్చరల్, మే 4(ఆంధ్రజ్యోతి) : ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ సంగీత నృత్య కళాశాల వేదికగా కూచిపూడి నృత్య రంగప్రవేశం ఆదివారం వైభవంగా జరిగింది. వల్లభజ్యోశ్యుల పవన్ కుమార్‌శర్మ ప్రదర్శించిన నాట్య ప్రదర్శన కళాప్రియులను ఆకట్టుకుంది. కార్యక్రమాన్ని ఉస్తాద్ బిస్మిల్లా ఖాన్ పురస్కార గ్రహీత డాక్టర్ చింతా రవి బాలకృష్ణ నిర్వహించారు. ముఖ్య అతిథిగా వైద్య నిపుణుడు శ్రీకుందా శ్రీధర్ హాజరయ్యారు. కళారత్న కుమారా సూర్యనారాయణ, గంధ ర్వులు, రాజమండ్రి నృత్య కళాశాల కూచిపూడి నాట్యాచార్యుడు డాక్టర్ పసుమర్తి శ్రీనివాస్‌శర్మ, ఘంటసాల కళాశాల అధ్యాపకుడు సీహెచ్ అజయ్ కుమార్, నాట్యాచారిణి డాక్టర్ ఉషా మాధవి, హేమంత్, యల్లాజోష్యుల వెంకటనాగ అనురాధను సత్కరించారు. నట్టువాంగం చింతా రవిబాలకృష్ణ, గాత్రం సుధాశ్రీనివాస్, మృదంగం పసుమర్తి హరనాధశాస్త్రి, వయోలిన్ శ్రీ పాలపర్తి ఆంజనేయులు, ఫ్లూట్ ఎస్.కుమార్‌బాబు సమకూర్చారు.

దిక్సూచి

సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోకెమికల్స్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ దేశ వ్యాప్తంగా ఉన్న 30 సీపెట్ కేంద్రాల్లో అడ్మిషన్ టెస్ట్ ద్వారా డిప్లొమా, పీజీ డిప్లొమా, పోస్ట్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది. ఆంధ్రప్రదేశ్ విజయవాడ కేంద్రంలో 150, తెలంగాణ హైదరాబాద్ కేంద్రంలో 300 సీట్లు ఉన్నాయి. అర్హులైన స్త్రీ, పురుష అభ్యర్థులు 2025 మే 29 తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.

సీపెట్ అడ్మిషన్ టెస్ట్ 2025

కోర్సులు

డిప్లొమా ఇన్ ప్లాస్టిక్ మౌల్డ్ టెక్నాలజీ: మూడు సంవత్సరాల వ్యవధి కోర్సు ఇది. మొత్తం ఆరు సెమిస్టర్లు ఉంటాయి. పదో తరగతి పాసైన వారు దరఖాస్తు చేసుకోవచ్చు.

డిప్లొమా ఇన్ ప్లాస్టిక్ టెక్నాలజీ: మూడు సంవత్సరాల వ్యవధి కోర్సు ఇది. మొత్తం ఆరు సెమిస్టర్లు ఉంటాయి. పదో తరగతి పాసైన వారు దరఖాస్తు చేసుకోవచ్చు.

పోస్ట్ గ్రాడ్యుయేషన్ డిప్లొమా ఇన్ ప్లాస్టిక్ ప్రాసెసింగ్ అండ్ టెస్టింగ్: రెండు సంవత్సరాల వ్యవధి కోర్సు ఇది. నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. సైన్స్‌తో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు.

పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ ప్లాస్టిక్ మౌల్డ్ డిజైన్ విత్ క్యాడ్/క్యామ్: ఒక సంవత్సరం ఆరు నెలల వ్యవధి కోర్సు ఇది. మూడు సెమిస్టర్లు ఉంటాయి. మెకానికల్/ప్లాస్టిక్స్/పాలిమర్/టూల్/ప్రొడక్షన్/మెకట్రానిక్స్/ఆటోమొబైల్/టూల్ అండ్ డై మేకింగ్/ పెట్రోకెమికల్స్/ ఇండస్ట్రియల్/ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్/ టెక్నాలజీ లేదా డీపీఎంటీ/డీపీటీ(సీపెట్) డిప్లొమా చేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు.

(హైదరాబాద్ క్యాంపస్‌లో నాలుగు కోర్సులు ఉండగా, విజయవాడ క్యాంపస్‌లో మాత్రం క్యాడ్/కామ్ కోర్సు లేదు)

వయస్సు: ఈ కోర్సులకు ఎలాంటి గరిష్ఠ వయోపరిమితి లేదు.

ఎంపిక విధానం: ప్రవేశ పరీక్ష ఆధారంగా

దరఖాస్తు రుసుము: 100/-

చివరి తేదీ: 2025 మే 29

ఎంట్రెన్స్ తేదీ: జూన్ 8

కోర్సు ప్రారంభం: 2025 జూలై 14

వెబ్‌సైట్: www.cipet.gov.in

CIPET सिपेट
probe - perform - practice - Plastics



ఉపాధ్యాయ ఉద్యోగాల కోసం జరిగే ముఖ్యమైన పరీక్ష డీఎస్సీ(డిస్ట్రిక్ సెలెక్షన్ కమిటీ). నిర్ణీతమైన పద్ధతిలో అధ్యయనం చేస్తే ఇందులో విజయం సాధించడం పెద్ద కష్టం ఏమీ కాదు.

సిలబస్ అర్థం చేసుకోవాలి: మొదట అభ్యర్థి తను ఎంచుకున్న పోస్టుకు సంబంధించిన సిలబస్‌ను క్షుణ్ణంగా పరిశీలించాలి. ఉదాహరణకు ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్, టీజీటీ, పీజీటీ, భాషా పండిట్స్ వంటి పోస్టుల సిలబస్‌ను పూర్తిగా చూసుకోవాలి. తరువాత సబ్జెక్టు వారీగా ముఖ్యమైన టాపిక్స్‌ను గుర్తించాలి.

టైమ్ టేబుల్ తయారు చేసుకోవాలి: ఏ రోజు, ఏ సమయంలో ఏ సబ్జెక్టు చదవాలో ఒక ప్రణాళిక తయారు చేసుకోవాలి. సబ్జెక్టుల వారీగా ప్రాముఖ్యత కలిగిన టాపిక్స్ గుర్తించాలి. జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్, ప్రాస్పెక్టివ్స్ ఇన్ ఎడ్యుకేషన్, ఎడ్యుకేషన్ సైకాలజీ, సబ్జెక్టుకు సంబంధించిన కంటెంట్ మెథడాలజీ ఇలా వీటికి నిర్ణీత సమయం కేటాయించాలి.

స్టడీ మెటీరియల్, బుక్స్: ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు ఆంధ్రప్రదేశ్ ఎస్సీఈఆర్‌టీ పుస్తకాలు తీసుకోవాలి. అలాగే సిలబస్‌కు అనుగుణంగా తెలుగు అకాడమీ పుస్తకాలు కూడా సిద్ధం చేసుకోవాలి.

నమూనా పరీక్షలు, గత ప్రశ్నపత్రాలు: గత ప్రశ్నపత్రాలను తీసి, ప్రశ్నలు ఎక్కువగా ఏయే టాపిక్స్ నుంచి వస్తున్నాయో ఒక అంచనాకు రావాలి. అలాగే నమూనా పరీక్షలు రాయడం వల్ల, లోటు పాట్లపై ఒక అవగాహన వస్తుంది. ఎక్కడ వెనకబడుతున్నామో అర్థం చేసుకుని ఆయా టాపిక్స్‌పై మరింత దృష్టిపెట్టాలి. అలాగే సమయ పాలన కూడా చాలా ముఖ్యమైన అంశం.

సొంత నోట్స్: ప్రతీ సబ్జెక్టులోని, ప్రతీ చాప్టర్‌కి సొంతంగా నోట్స్ తయారు చేసుకోవాలి. ఇందులో కూడా ముఖ్యమైన పాయింట్లను అండర్‌లైన్ చేసుకోవాలి. పరీక్ష ముందు ఒకసారి తొందరగా చూసుకోవడానికి ఉపయోగపడతాయి.

మనోధైర్యం, క్రమశిక్షణ: అదృష్టవశాత్తు అని కాకుండా, నేను తప్పకుండా సాధించగలను అని మొదట అభ్యర్థి నమ్మాలి. ఆ తర్వాత ప్రిపరేషన్ ప్రారంభించాలి. అది కూడా క్రమం తప్పకుండా ఉండాలి. టైమ్‌టేబుల్ ఎప్పుడైనా గాడి తప్పినట్లు అనిపిస్తే సరిచేసుకోవాలి. ఒక్కోరోజు దీనిని పాటించడానికి కుదరకపోతే ఒకటి రెండు రోజుల్లోపు ఆ సిలబస్‌ను కవర్ చేయాలి. పరీక్షలకు సమయం కొద్దిగానే ఉన్నందున సమగ్ర ప్రిపరేషన్ అవసరం. దీనితోపాటు సరైన నిద్ర, ఆహారం, ఆరోగ్యం ముఖ్యం. దీనిని కూడా సరిగ్గా పట్టించుకోవాలి.

అధికారిక సమాచారం: సిలబస్ మొదలుకుని పరీక్షకు సంబంధించిన ఏ సమాచారం కావాలన్నా అధికారిక వెబ్‌సైట్‌ను చూడడం ఉత్తమం.

పరీక్ష షెడ్యూల్

- **దరఖాస్తుల దాఖలు చివరి తేదీ:** 2025 మే 15
- **హాల్‌టికెట్ల డౌన్‌లోడ్:** 2025 మే 30
- **పరీక్ష తేదీలు:** జూన్ 6 నుంచి జూలై 7వ వరకు
- **ప్రాథమిక కీ:** పరీక్షలు పూర్తయిన రెండో రోజు

ఎంపిక విధానం

- **ఎస్ఏ, ఎల్పీ:** రాత పరీక్ష 80 శాతం, టెట్ వెయిటేజీ 20 శాతం
- **పీఈటీ:** రాత పరీక్ష 50 శాతం, ఫిజికల్ ఎఫీషియన్సీ టెస్ట్ 30 శాతం, టెట్ 20 శాతం
- **మ్యూజిక్ టీచర్లు:** రాత పరీక్ష, స్కిల్ టెస్ట్
- **క్రాఫ్ట్, ఆర్ట్, డ్రాయింగ్:** రాత పరీక్ష
- **ఎస్జీటీ:** ఇంతకు ముందు టెట్ అర్హత సాధించిన అందరూ టెట్ కమ్ టీఆర్టీ రాయాలి. గతంలో టెట్ రాసినవారికి ఏ పరీక్షలో ఎక్కువ మార్కులు వస్తే వాటినే పరిగణనలోకి తీసుకుంటారు. గతంలో టెట్ రాయనివారు ఈ పరీక్షలో ఓసీ 60 శాతం, బీసీ 50 శాతం, ఎస్సీ/ ఎస్టీ/పీహెచ్ వారు 40 శాతం అర్హత సాధించాలి.

డీఎస్సీ ప్రిపరేషన్ ఇలా

సిలబస్‌లో ప్రధాన అంశాలు

- జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్
- విద్యలో దృక్కోణాలు(పర్‌స్పెక్టివ్స్ ఇన్ ఎడ్యుకేషన్)
- ఎడ్యుకేషన్ సైకాలజీ
- కంటెంట్, మెథాలజీ

ప్రతీ పోస్టుకు ప్రత్యేక సిలబస్

- ఎస్‌జీటీ(సెకెండరీ గ్రేడ్ టీచర్)
- స్కూల్ అసిస్టెంట్
- టీజీటీ(ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్)
- పీజీటీ(పోస్ట్‌గ్రాడ్యుయేట్ టీచర్)

ఎస్‌జీటీ సిలబస్

- జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్(08 మార్కులు)
- విద్యా దృక్పథాలు (04 మార్కులు)
- విద్య మనోవిజ్ఞాన శాస్త్రం (08 మార్కులు)
- కంటెంట్, మెథడాలజీ (60 మార్కులు)
- మొత్తంగా 80 మార్కులకు పరీక్ష ఉంటుంది.

పార్ట్-1
జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్(08 మార్కులు)
పార్ట్-2
విద్యా దృక్పథాలు(04 మార్కులు)
పార్ట్-3
విద్య మనో విజ్ఞాన శాస్త్రం(08 మార్కులు)
పార్ట్-4
జనరల్ తెలుగు కంటెంట్(08 మార్కులు)
తెలుగు బోధన పద్ధతులు(04 మార్కులు)
పార్ట్-5
ఇంగ్లిష్ కంటంట్(08 మార్కులు)
ఇంగ్లిష్ మెథడాలజీ(04 మార్కులు)
పార్ట్-6
గణితం కంటెంట్(08 మార్కులు)
గణితం బోధన శాస్త్రం (04 మార్కులు)
పార్ట్-7
సైన్స్ కంటెంట్ (8 మార్కులు)
సైన్స్ బోధన శాస్త్రం(4 మార్కులు)
పార్ట్-8
సోషల్ స్టడీస్ కంటెంట్ (08 మార్కులు)
సోషల్ మెథడాలజీ (04 మార్కులు)

స్కూల్ అసిస్టెంట్ తెలుగు

- జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్ (10 మార్కులు)
- విద్య దృక్పదాలు(05 మార్కులు)
- విద్య మనోవిజ్ఞాన శాస్త్రం(05 మార్కులు)
- కంటెంట్(40 మార్కులు)
- మెథడాలజీ(20 మార్కులు)
- మొత్తంగా 80 మార్కులకు పరీక్ష ఉంటుంది

పార్ట్-1
జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్(10 మార్కులు)
పార్ట్-2
విద్యా దృక్పథాలు(05 మార్కులు)
పార్ట్-3
విద్య మనో విజ్ఞాన శాస్త్రం(05 మార్కులు)
పార్ట్-4
తెలుగు కంటెంట్(40 మార్కులు)
తెలుగు బోధన పద్ధతులు(20 మార్కులు)

స్కూల్ అసిస్టెంట్ ఫిజిక్స్

- జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్ (10 మార్కులు)
- విద్య దృక్పదాలు(05 మార్కులు)
- విద్య మనోవిజ్ఞాన శాస్త్రం (05 మార్కులు)
- కంటెంట్(40 మార్కులు)
- మెథడాలజీ(20 మార్కులు)
- మొత్తంగా 80 మార్కులకు పరీక్ష ఉంటుంది

పార్ట్-1
జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్(10 మార్కులు)
పార్ట్-2
విద్యా దృక్పథాలు(05 మార్కులు)
పార్ట్-3
విద్య మనో విజ్ఞాన శాస్త్రం(05 మార్కులు)
పార్ట్-4
ఫిజిక్స్ కంటెంట్(40 మార్కులు)
బోధన పద్ధతులు (20 మార్కులు)



డా. మంతెన రవికుమార్

స్కూల్ అసిస్టెంట్ గణితం

- జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్ (10 మార్కులు)
- విద్య దృక్పదాలు(05 మార్కులు)
- విద్య మనోవిజ్ఞాన శాస్త్రం(05 మార్కులు)
- కంటెంట్(40 మార్కులు)
- మెథడాలజీ(20 మార్కులు)
- మొత్తంగా 80 మార్కులకు పరీక్ష ఉంటుంది

పార్ట్-1
జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్(10 మార్కులు)
పార్ట్-2
విద్యా దృక్పథాలు(05 మార్కులు)
పార్ట్-3
విద్య మనో విజ్ఞాన శాస్త్రం(05 మార్కులు)
పార్ట్-4
మేథ్స్ కంటెంట్(40 మార్కులు)
బోధన పద్ధతులు(20 మార్కులు)

స్కూల్ అసిస్టెంట్ బయాలజీ

- జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్(10 మార్కులు)
- విద్య దృక్పదాలు(05 మార్కులు)
- విద్య మనోవిజ్ఞాన శాస్త్రం(05 మార్కులు)
- కంటెంట్(40 మార్కులు)
- మెథడాలజీ(20 మార్కులు)
- మొత్తంగా 80 మార్కులకు పరీక్ష ఉంటుంది

పార్ట్-1
జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్(10 మార్కులు)
పార్ట్-2
విద్యా దృక్పథాలు(05 మార్కులు)
పార్ట్-3
విద్య మనో విజ్ఞాన శాస్త్రం(05 మార్కులు)
పార్ట్-4
బయాలజీ కంటెంట్(40 మార్కులు)
బయాలజీ మెథడాలజీ(20 మార్కులు)

స్కూల్ అసిస్టెంట్ సోషల్ స్టడీస్

- జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్(10 మార్కులు)
- విద్య దృక్పదాలు(05 మార్కులు)
- విద్య మనోవిజ్ఞాన శాస్త్రం(05 మార్కులు)
- కంటెంట్(40 మార్కులు)
- మెథడాలజీ(20 మార్కులు)
- మొత్తంగా 80 మార్కులకు పరీక్ష ఉంటుంది

పార్ట్-1
జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్(10 మార్కులు)
పార్ట్-2
విద్యా దృక్పథాలు(05 మార్కులు)
పార్ట్-3
విద్య మనో విజ్ఞాన శాస్త్రం(05 మార్కులు)
పార్ట్-4
సోషల్ కంటెంట్(40 మార్కులు)
సోషల్ బోధన పద్ధతులు(20 మార్కులు)

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

కలలన్నీ నిజమయ్యేలా



కమల్‌హాసన్ కథానాయకుడిగా మణిరత్నం దర్శకత్వంలో తెరకెక్కిన భారీ యాక్షన్ థ్రిల్లర్ 'థగ్ లైఫ్'. 'నాయకుడు' చిత్రం విడుదలైన మూడున్నర దశాబ్దాల తర్వాత వీరిద్దరి కలయికలో వస్తోన్న చిత్రమిది. మాఫియా ముఠాల పగ, ప్రతీకారం నేపథ్యంలో సాగే కథతో 'థగ్ లైఫ్'ను ఆసక్తికరంగా తెరకెక్కించారు మణిరత్నం. హీరో శింబు ముఖ్యపాత్రను పోషిస్తున్నారు. త్రిష కథానాయిక. సాన్యా మల్హోత్రా, జోజూ జార్జ్, ఐశ్వర్యలక్ష్మి కీలకపాత్రలు పోషిస్తున్నారు. జూన్ 5న 'థగ్‌లైఫ్' ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఏ.ఆర్. రెహమాన్ సంగీత సారథ్యం వహించిన ఈ చిత్రం నుంచి తొలి గీతాన్ని మేకర్స్ ఆదివారం విడుదల చేశారు. 'కలలన్నీ నిజమయ్యేలా... జింగుచా జింగుచా' అంటూ వివాహ వేడుక నేపథ్యంలో ఉత్సాహంగా సాగే ఈ గీతానికి రెహమాన్ వినసొంపైన బాణీలను అందించారు. అనంత శ్రీరామ్ సాహిత్యం అందించగా, మంగ్లీ, శ్రీకృష్ణ హృద్యంగా ఆలపించారు. కమల్‌హాసన్, మణిరత్నం, ఆర్. మహేంద్రన్, శివ ఆనంద్ సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రాన్ని ఎన్. సుధాకర్‌రెడ్డి తెలుగులో విడుదల చేస్తున్నారు. సినిమాటోగ్రఫీ: రవి కే చంద్రన్

తెలుగువాడినని వద్దన్నారు




ఇటీవలె విడుదలైన హిందీ చిత్రం 'జాట్'తో హిట్ కొట్టారు దర్శకుడు గోపీచంద్ మలినేని. దాదాపు వంద కోట్లకు పైగా కలెక్షన్స్ సాధించిన ఆ చిత్రానికి సీక్వెల్‌నూ ప్రకటించారు. తాజాగా మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో దర్శకుడిగా తనకు ఓ ప్రాజెక్ట్ విషయంలో ఎదురైన చేదు అనుభవాన్ని గుర్తుచేసుకున్నారు గోపీచంద్. "బాలకృష్ణతో 'వీరసింహా రెడ్డి' సినిమా చేశాక, తదుపరి ప్రాజెక్ట్ కోసం తమిళ హీరో విజయ్‌కు కథ చెప్పా. సింగిల్ సిట్టింగ్‌లోనే ఆయన ఆ కథను ఓకే చేశారు. ఆ సమయంలోనే విజయ్ రాజకీయాల్లోకి ప్రవేశిస్తున్నట్లు ప్రకటించారు. అప్పటికే ఆయన ఓ తెలుగు డైరెక్టర్‌తో 'వారీసు' (వారసుడు) చేశారు. మరో సినిమాను తెలుగువాడితో కాకుండా తమిళ దర్శకుడితోనే చేయమని ఆయనకు తమిళుల నుంచి ఒత్తిడి వచ్చింది అని అనుకుంటున్నాను. దాంతో ఆ ప్రాజెక్ట్ పట్టాలెక్కలేదు" అని పేర్కొన్నారు. ప్రస్తుతం బాలకృష్ణతో ఓ సినిమాను తెరకెక్కించే సన్నాహాల్లో ఉన్నారు గోపీచంద్ మలినేని.

యాక్షన్ హంగామా



దుల్కర్ సల్మాన్ కథానాయకుడిగా నటిస్తున్న కొత్త చిత్రం పట్టాలెక్కింది. నహాస్ హిదాయత్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి 'ఐ యామ్ గేమ్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. దుల్కర్ సల్మాన్ నిర్మిస్తున్నారు. ఆదివారం తిరువనంతపురంలో పూజా కార్యక్రమాలతో చిత్రీకరణ ప్రారంభించారు. కథానాయకుడిగా దుల్కర్‌కు ఇది 40వ చిత్రం. ఆంటోనీ వర్గీస్ కీలకపాత్ర పోషిస్తున్నారు. ఈ చిత్రంతో తమిళ దర్శకుడు మిస్కిన్ నటుడిగా మలయాళ సినిమాల్లోకి అడుగుపెడుతున్నారు. 'దుల్కర్ కెరీర్లోనే భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతోన్న మలయాళ చిత్రమిది. ఇందులో ఆయన యాక్షన్ హంగామాను చూడబోతున్నారు. తిరువనంతపురంలో తొలి షెడ్యూల్ చిత్రీకరణ కొనసాగుతుంది. ఇతర వివరాలు త్వరలో వెల్లడిస్తాం' అని చిత్రబృందం తెలిపింది. ఈ చిత్రానికి సంగీతం: జేక్స్ బిజోయ్, సినిమాటోగ్రఫీ: జిమ్షి ఖలీద్.

ముగింపు దశలో చిత్రీకరణ



పవన్ కల్యాణ్ సినిమా కోసం ఎదురుచూస్తున్న అభిమానులకు శుభవార్త చెప్పారు 'హరి హర వీరమల్లు' మేకర్స్. జ్యోతి కృష్ణ దర్శకత్వంలో రూపొందుతోన్న ఈ చిత్ర షూటింగ్‌లో పవన్ పాల్గొన్నట్లు చిత్ర యూనిట్ సోషల్ మీడియా వేదికగా వెల్లడించింది. పవన్ ప్రస్తుతం రెండు రోజుల షూటింగ్‌లో పాల్గొంటారని, దీనితో సినిమా గ్రాండ్‌గా ఒక ముగింపు దశకు వచ్చేసినట్లేనని పేర్కొంది. అతి త్వరలోనే 'హరి హర వీరమల్లు' సాలిడ్ ట్రైలర్ సహా పాటలు విడుదల చేయబోతున్నట్లు మేకర్స్ ప్రకటించారు. త్వరలోనే అధికారిక రిలీజ్ డేట్ కూడా రానున్నట్లు సమాచారం. ఈ భారీ చిత్రాన్ని ఏ.ఎం.రత్నం నిర్మిస్తుండగా ఎం.ఎం.కీరవాణి సంగీతం అందిస్తున్నారు.

'తమ్ముడు' రాక ఖాయం



నితిన్ హీరోగా శ్రీరామ్ వేణు దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'తమ్ముడు'. ఆదివారం శ్రీరామ్ వేణు పుట్టిన రోజు. ఈ సందర్భంగా చిత్రబృందం రిలీజ్ డేట్‌ను ప్రకటించింది. జూలై 4న 'తమ్ముడు' చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. ప్రేక్షకులకు మర్చిపోలేని సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్‌ను ఈ చిత్రంతో అందించబోతున్నట్లు దర్శకుడు చెప్పారు. ఈ చిత్రంలో వర్ష బొల్లమ్మ, సప్తమి గౌడ కథానాయికలు. లయ కీలకపాత్ర పోషిస్తున్నారు. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్ రాజు, శిరీష్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం: అజనీష్ లోకనాథ్, సినిమాటోగ్రఫీ: కేవీ గుహన్.

మరింత వినోదంతో...



హీరోయిన్ తాప్సీ పన్ను ఇటీవలె విడుదలైన 'ఫిర్ ఆయీ హసీనా దిల్‌రూబా' చిత్రంతో ప్రేక్షకులను పలకరించిన సంగతి తెలిసిందే. 2021లో విక్రాంత్ మస్సే, తాప్సీ జంటగా వినీల్ మాథ్యూ దర్శకత్వంలో తెరకెక్కిన 'హసీనా దిల్‌రూబా'కు ఇది సీక్వెల్. ఇవి నెట్‌ఫ్లిక్స్‌లో విడుదలయ్యాయి. ఇప్పుడు ఈ చిత్రానికి మూడో భాగం కూడా రాబోతోందని హింట్ ఇచ్చారు రచయిత్రి కనికా ధిల్లాన్. ప్రస్తుతం స్క్రిప్ట్ పనులు జరుగుతున్నాయని.. మొదటి రెండు భాగాల కంటే మూడో భాగం మరింత వినోదంతో అలరించేలా ఉండబోతోందని తెలిపారు. ఈ రొమాంటిక్ థ్రిల్లర్ గురించి మరిన్ని వివరాలను త్వరలోనే ప్రకటించనున్నారు. ప్రస్తుతం 'గాంధారీ' చిత్రంతో ప్రేక్షకులను పలకరించేందుకు సిద్ధంగా ఉన్నారు తాప్సీ పన్ను.

ఆ ఒక్క రాత్రి.. జీవితాన్నే మార్చేసింది

నాని

ప్రస్తుతం 'హిట్ 3' అందించిన విజయాన్ని ఆస్వాదిస్తున్నారు హీరో నాని. తాజాగా, ఓ పాడ్‌కాస్ట్‌లో పలు ఆసక్తికర విషయాలను వెల్లడించారు. ఓ ప్రమాదం తన జీవితాన్నే మార్చేసిందని తెలిపారు. "నేను నా మొదటి కారును కొనకముందు ఓ ప్రమాదం జరిగింది. నా మిత్రుడి కారులో లాంగ్‌డ్రైవ్ వెళ్లాం. చీకటిలో నేను నడుపుతున్న కారు రోడ్డుపై నిలిచిపోయి ఉన్న ఓ లారీని ఢీకొట్టింది. నాకూ, నా పక్కనే ఉన్న ప్రశాంత్ అనే మిత్రుడికీ తీవ్ర గాయాలయ్యాయి. ప్రశాంత్ స్పృహ కోల్పోయాడు. ప్రశాంత్.. ప్రశాంత్ అని గట్టిగా అరవడంతో ఆయన స్పృహలోకి వచ్చాడు. దాంతో ఊపిరి పీల్చుకున్నా. చికిత్స కోసం ఓ అంబులెన్స్‌లో హాస్పిటల్‌కు వెళ్తుంటే దారిలో మరో ప్రమాదం జరిగింది. ఆ ప్రమాదంలో ఓ కుటుంబమంతా తీవ్రంగా గాయపడ్డారు. అందులో ఓ చిన్న పాప కూడా ఉంది. మాతో పాటూ వారినీ అంబులెన్సులో తీసుకుని ఆస్పత్రికి వెళ్లాం. ఆ పాపను ఐసీయూలో ఉంచారు. అర్ధరాత్రి నుంచి ఉదయం వరకూ ఆ పాప పరిస్థితి తెలుసుకోవడానికి నేను వేచి చూశా. మరణం అంచులకు తీసుకెళ్లిన ఆ రాత్రి నన్ను పూర్తిగా మార్చేసింది. జీవితాన్ని చూసే కోణాన్ని, పలు విషయాలకు స్పందించే విధానాన్ని నేర్పింది" అని పేర్కొన్నారు.



పరోటా మాస్టర్‌గా విజయ్ సేతుపతి



విజయ్ సేతుపతి, నిత్యా మేనన్ జంటగా పాండిరాజ్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం టైటిల్‌ను 'తలైవా తలైవి' అని మేకర్స్ ఖరారు చేశారు. దీనిని ప్రకటిస్తూ తాజాగా టైటిల్ టీజర్‌ను రిలీజ్ చేశారు. ఇందులో విజయ్ సేతుపతి పరోటా మాస్టర్‌గా నటిస్తున్నారు. అందుకోసం ఆయన కొంత శిక్షణ కూడా తీసుకున్నట్లు తెలిసింది. టీజర్‌లో..విజయ్ సేతుపతి, నిత్యామేనన్ వంట చేస్తూనే గొడవపడుతూ ఉంటారు. వారిద్దరు సరదాగా పోట్లాడుకుంటూ భార్యాభర్తలుగా కనిపిస్తారు. ఒకరిపై మరొకరు పెద్దగా అరుచుకుంటారు. చివరికి విజయ్ సేతుపతి నోటికి టవల్ కట్టుకొని తనలో తాను మాట్లాడుకుంటూ ఉండిపోతాడు. కాగా, ఈ చిత్రంలో టబు లీడ్ రోల్‌లో నటించనున్నారు. నటి రాధికా ఆప్టే కూడా త్వరలో ఈ ప్రాజెక్టులో భాగం కానున్నట్లు సమాచారం. జూన్‌లో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానున ఈ చిత్రాన్ని పాన్ ఇండియా స్థాయిలో విడుదల చేయనున్నారు.

చీర కట్టులో అవని



మెగాస్టార్ చిరంజీవి హీరోగా వశిష్ఠ దర్శకత్వంలో రాబోతున్న చిత్రం 'విశ్వంభర'. త్రిష కృష్ణన్ కథానాయిక. యూవీ క్రియేషన్స్ నిర్మిస్తోంది. ఆదివారం త్రిష పుట్టిన రోజు సందర్భంగా ఆమెకు శుభాకాంక్షలు తెలియజేస్తూ మేకర్స్ ప్రత్యేక పోస్టర్ రిలీజ్ చేశారు. ఈ చిత్రంలో త్రిష అవని పాత్ర పోషిస్తున్నట్లు వెల్లడించారు. చీర కట్టులో త్రిష మెరిసిపోతూ కనిపించారు. 2006లో విడుదలైన 'స్టాలిన్' తర్వాత చిరంజీవి, త్రిష కలసి నటిస్తున్న చిత్రమిది. సృష్టి, స్థితి, లయ ఈ మూడింటి నేపథ్యంలో ఈ చిత్ర కథ సాగనున్నట్లు సమాచారం. సినిమాలో భారీ సన్నివేశాలు ఉంటాయని ఇప్పటికే చిత్ర యూనిట్ వెల్లడించింది. ఆంజనేయ భక్తునిగా చిరంజీవి కనిపించనున్నారు. ఆషికా రంగనాథ్, కునాల్ కపూర్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఎం.ఎం.కీరవాణి సంగీతం అందిస్తున్నారు.

జానూతో ప్రేమ గీతం



రాజ్ తరుణ్ హీరోగా రామ్ కడుముల దర్శకత్వంలో తెరకెక్కుతోన్న క్రైమ్ కామెడీ ఎంటర్‌టైనర్ 'పాంచ్ మినార్'. రాశి సింగ్ కథానాయిక. గోవిందరాజు సమర్పణలో మాధవి, ఎం.ఎస్.ఎం రెడ్డి నిర్మిస్తున్నారు. చిత్ర బృందం ఆదివారం 'జానూ మేరీ జానూ' అంటూ సాగే ప్రేమగీతాన్ని విడుదల చేసింది. శ్రీహర్ష ఈమని సాహిత్యానికి శేఖర్‌చంద్ర స్వరాలు సమకూర్చగా, వినాయక్ ఆలపించారు. అజయ్ ఘోష్, బ్రహ్మాజీ, శ్రీనివాసరెడ్డి, రవి వర్మ కీలకపాత్రలు పోషిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: ఆదిత్య జవ్వాది, ఎడిటర్: ప్రవీణ్ పూడి.

'తేనెటీగ రామారావు' కన్నుమూత



నిర్మాత జవాజి వెంకట రామారావు అలియాస్ తేనెటీగ రామారావు(68) ఆదివారం హైదరాబాద్‌లో కన్నుమూశారు. కొంతకాలంగా లివర్ సంబంధ వ్యాధితో బాధపడుతున్నారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. రాజేంద్రప్రసాద్‌తో 'తేనెటీగ', వంశీ దర్శకత్వంలో నరేశ్-వాణీ విశ్వనాథ్‌తో 'ప్రేమ అండ్ కో', శివకృష్ణతో 'బొబ్బిలివేట', 'బడి' వంటి చిత్రాలను నిర్మించడంతో పాటు పలు డబ్బింగ్ సినిమాలకు రామారావు నిర్మాతగా వ్యవహరించారు.



సబలెంకాదే 'మాడ్రిడ్' కిరీటం

మాడ్రిడ్: ప్రపంచ టెన్నిస్ నెంబర్‌వన్ క్రీడాకారిణి అరియానా సబలెంకా మాడ్రిడ్ ఓపెన్‌లో అదరగొట్టింది. ఆదివారం జరిగిన మహిళల సింగిల్స్ ఫైనల్లో టాప్‌సీడ్ సబలెంకా (బెలారస్) 6-3, 7-6 (3)తో అమెరికా స్టార్ కొకొ గాఫ్‌ను ఓడించి ఈ వేదికపై మూడోసారి విజేతగా నిలిచింది. ఈ క్రమంలో మూడు సార్లు ఈ టైటిల్ నెగ్గిన పెట్రా క్విటోవా రికార్డును సమం చేసింది. కాగా, సబలెంకాకు ఇది కెరీర్‌లో 20వ టైటిల్.



ముఖేష్ డబుల్ ధమాకా

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): జాతీయ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో గుంటూరు యువ షూటర్ ముఖేష్ మరో రెండు పసిడి పతకాలు సాధించాడు. మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో ఆదివారం జరిగిన 25 మీటర్ల స్టాండర్డ్ పిస్టల్ ఈవెంట్ సీనియర్, జూనియర్ విభాగాల్లో చాంపియన్‌గా నిలిచాడు. దీంతో ఈ టోర్నీలో ముఖేష్ మొత్తం మూడు పతకాలను ఖాతాలో వేసుకున్నాడు. ముందురోజు 25 మీటర్ల పిస్టల్ ఈవెంట్‌లోనూ ముఖేష్ పసిడి సాధించడం తెలిసిందే.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
బెంగళూరు	11	8	3	0	16	0.482
పంజాబ్	11	7	3	1	15	0.376
ముంబై	11	7	4	0	14	1.274
గుజరాత్	10	7	3	0	14	0.867
ఢిల్లీ	10	6	4	0	12	0.362
కోల్‌కతా	11	5	5	1	11	0.249
లఖ్‌నవూ	11	5	6	0	10	-0.469
రాజస్థాన్	12	3	9	0	6	-0.718
హైదరాబాద్	10	3	7	0	6	-1.192
చెన్నై	11	2	9	0	4	-1.117

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

మ్యాక్స్‌వెల్ స్థానంలో ఓవెన్



న్యూఢిల్లీ: గాయంతో ఐపీఎల్‌కు దూరమైన మ్యాక్స్‌వెల్ స్థానంలో విచెల్ ఓవెన్‌ను ఎంపిక చేసినట్టు పంజాబ్ కింగ్స్ జట్టు ప్రకటించింది. ఆస్ట్రేలియాకు చెందిన ఓవెన్.. ప్రస్తుతం పాకిస్థాన్ సూపర్ లీగ్‌లో పెషావర్ జల్మి జట్టు తరపున ఆడుతున్నాడు. ఈనెల 9న ఆ జట్టు చివరి గ్రూప్ మ్యాచ్ ఆడాక ఓవెన్ ఐపీఎల్‌లో భాగం కానున్నాడు. 23 ఏళ్ల ఓవెన్ గతేడాది బిగ్‌బాష్ లీగ్‌లో 452 పరుగులతో టాప్‌లో నిలిచాడు.

లక్ష్యం.. ఒలింపిక్స్ ఆతిథ్యం

- ప్రధాని మోదీ
- ఖేలో ఇండియా యూత్ గేమ్స్ ప్రారంభం



పట్నా: 2036 ఒలింపిక్స్ ఆతిథ్యమే లక్ష్యంగా దేశంలో క్రీడా మౌలిక సదుపాయాలను ఆధునికీకరిస్తున్నామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వెల్లడించారు. దేశంలో క్రీడా సంస్కృతి పెరిగితే, అంతర్జాతీయంగా భారత్ పరపతి ఇనుమడిస్తుందని.. ఆదివారం ఖేలో ఇండియా యూత్ గేమ్స్ ప్రారంభం సందర్భంగా మోదీ అన్నారు. బిహార్ రాజధాని పట్నా వేదికగా జరుగుతున్న ఈ పోటీలను మోదీ ఢిల్లీ నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు.

వైభవ్ సూర్యవంశీకి ప్రశంస: ఈ సందర్భంగా తన ప్రసంగంలో మోదీ.. 14 ఏళ్ల బిహార్‌కు చెందిన టీనేజ్ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీ గురించి ప్రస్తావించారు. 'బిహార్ బిడ్డ వైభవ్ సూర్యవంశీ అద్భుత ప్రతిభను ఐపీఎల్ మ్యాచ్‌లో తిలకించా. ఇంత చిన్న వయస్సులో అంత గొప్ప రికార్డు సాధించడం ఆషామాషీ కాదు. వైభవ్ ప్రతిభ వెనుక ఎంతో కష్టం దాగి ఉంది' అని ప్రధాని కొనియాడారు. ఇటీవల గుజరాత్ టైటాన్స్‌తో ఐపీఎల్ మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్ 'చిన్నో'డు సూర్యవంశీ కేవలం 35 బంతుల్లోనే సెంచరీ చేసి సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే.



పరాగ్ భయపెట్టినా..

గట్టెక్కిన కోల్‌కతా

- రస్సెల్ మెరుపులు
- పోరాడి ఓడిన రాజస్థాన్



కోల్‌కతా: ఆఖరి బంతి వరకూ ఉత్కంఠగా సాగిన పోరులో కోల్‌కతా నైట్‌రైడర్స్ గట్టెక్కింది. ప్లేఆఫ్స్ ఆశలను సజీవంగా నిలబెట్టుకొంది. ఆదివారం హోరాహోరీగా జరిగిన మ్యాచ్‌లో కోల్‌కతా ఒక్క పరుగు తేడాతో రాజస్థాన్ రాయల్స్‌పై గెలిచింది. తొలుత కోల్‌కతా 20 ఓవర్లలో 4 వికెట్లకు 206 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ఆండ్రీ రస్సెల్ (25 బంతుల్లో 4 ఫోర్లు, 6 సిక్సర్లతో 57 నాటౌట్), రఘువంశీ (44), రహ్మనుల్లా గుర్బాజ్ (35), కెప్టెన్ అజింక్యా రహానె (30) రాణించారు. ఛేదనలో ఓవర్లన్నీ ఆడి 205/8 స్కోరు చేసిన రాజస్థాన్ విజయానికి పరుగు దూరంలో నిలిచిపోయింది. సారథి రియాన్ పరాగ్ (45 బంతుల్లో 6 ఫోర్లు, 8 సిక్సర్లతో 95), యశస్వీ జైస్వాల్ (34), హెట్‌మయర్ (29) పోరాటం సరిపోలేదు. హర్షిత్, వరుణ్, మొయిన్ అలీ తలో రెండు వికెట్లు పడగొట్టారు.

ఆశలు రేపి..: ఛేదనలో రాజస్థాన్ 71/5తో కష్టాల్లో పడింది. ఈ దశలో పరాగ్, హెట్‌మయర్ ఆరో వికెట్‌కు 92 పరుగుల భాగస్వామ్యంతో ఆశలు రేకెత్తించారు. ముఖ్యంగా పరాగ్ ప్రత్యర్థి బౌలర్లకు చుక్కలు చూపించాడు. 13వ ఓవర్‌లో అలీ బౌలింగ్‌లో పరాగ్ ఏకంగా ఐదు సిక్సులతో 32 పరుగులు పిండుకోవడంతో.. రాజస్థాన్ ఒక్కసారిగా మ్యాచ్‌లోకి వచ్చింది. అయితే, హెట్‌మయర్‌ను అవుట్ చేసిన హర్షిత్ జట్టుకు కావాల్సిన బ్రేక్‌ను అందించాడు. చివరి 3 ఓవర్లలో 38 పరుగులు కావాల్సి ఉండగా.. పరాగ్‌ను కూడా హర్షిత్ వెనక్కిపంపాడు. ఆఖరి 6 బంతుల్లో రాజస్థాన్ విజయానికి 22 పరుగులు అవసరమవగా.. వైభవ్ అరోరా బౌలింగ్‌లో శుభం దూబె (14 బంతుల్లో ఫోర్, 2 సిక్సులతో 25 నాటౌట్) 6,4,6 బాదడంతో వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. చివరి బంతికి మూడు పరుగులు కావాల్సి ఉండగా.. దూబే సింగిల్ మాత్రమే తీశాడు. రెండో పరుగు కోసం వచ్చిన ఆర్చర్ (12) రనౌటయ్యాడు. అంతకుముందు ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ (4) నిరాశపర్చగా.. కునాల్ సింగ్ (0), జైస్వాల్‌ను అలీ పెవిలియన్ చేర్చాడు. ధ్రువ్ జురెల్ (0), హసరంగ (0)ను వరుణ్ అవుట్ చేశాడు.

దంచేసిన రస్సెల్..: టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన కోల్‌కతా.. ఓపెనర్ నరైన్ (11) వికెట్‌ను వేగంగా కోల్పోయింది. కానీ, గుర్బాజ్, రహానె రెండో వికెట్‌కు 56 పరుగుల భాగస్వామ్యంతో ఆదుకొన్నారు. గుర్బాజ్‌ను తీక్షణ అవుట్ చేసినా.. రఘువంశీతో కలసి రహానె స్కోరు బోర్డును నడిపించాడు. దీంతో జట్టు స్కోరు 12వ ఓవర్‌లో సెంచరీ మార్క్ దాటింది. కానీ, కీలక సమయంలో రహానెను పరాగ్ అవుట్ చేశాడు. ఈ దశలో క్రీజులోకి వచ్చిన రస్సెల్.. రాజస్థాన్ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. రఘువంశీ జతగా నాలుగో వికెట్‌కు 33 బంతుల్లోనే 61 పరుగులు జోడించాడు. రఘువంశీని ఆర్చర్ వెనక్కి పంపగా.. ఆ స్థానంలో వచ్చిన రింకూ సింగ్ (6 బంతుల్లో ఫోర్, 2 సిక్సులతో 19 నాటౌట్) 4,6,6తో ఫినిషింగ్ టచ్ ఇవ్వడంతో కోల్‌కతా స్కోరు డబుల్ సెంచరీ దాటింది.

స్కోరుబోర్డు

కోల్‌కతా: గుర్బాజ్ (సి) హెట్‌మయర్ (బి) తీక్షణ 35, నరైన్ (బి) యుధ్‌వీర్ 11, రహానె (సి) జురెల్ (బి) పరాగ్ 30, రఘువంశీ (సి/సబ్) అశోక్ (బి) ఆర్చర్ 44, రస్సెల్ (నాటౌట్) 57, రింకూ (నాటౌట్) 19; **ఎక్స్‌ట్రాలు: 10; మొత్తం: 20 ఓవర్లలో 206/4; వికెట్ల పతనం:** 1-13, 2-69, 3-111, 4-172; **బౌలింగ్:** ఆర్చర్ 4-0-30-1, యుధ్‌వీర్ 2-0-26-1, తీక్షణ 4-0-41-1, ఆకాశ్ 3-0-50-0, హసరంగ 4-0-35-0, పరాగ్ 3-0-21-1.

రాజస్థాన్: జైస్వాల్ (సి) రింకూ (బి) అలీ 34, వైభవ్ సూర్యవంశీ (సి) రహానె (బి) అరోరా 4, కునాల్ (సి) రస్సెల్ (బి) అలీ 0, పరాగ్ (సి) అరోరా (బి) హర్షిత్ 95, జురెల్ (బి) వరుణ్ 0, హసరంగ (బి) వరుణ్ 0, హెట్‌మయర్ (సి) నరైన్ (బి) హర్షిత్ 29, శుభమ్ దూబె (నాటౌట్) 25, ఆర్చర్ (రనౌట్) 12; **ఎక్స్‌ట్రాలు: 6; మొత్తం: 20 ఓవర్లలో 205/8; వికెట్ల పతనం:** 1-5, 2-8, 3-66, 4-71, 5-71, 6-163, 7-173, 8-205; **బౌలింగ్:** వైభవ్ అరోరా 4-0-50-1, మొయిన్ అలీ 3-0-43-2, హర్షిత్ 4-0-41-2, వరుణ్ 4-0-32-2, నరైన్ 4-0-27-0, రస్సెల్ 1-0-11-0.



పంజాబ్ దూకుడు

37 రన్స్ తేడాతో లఖ్‌నవూ ఓటమి

ప్రభ్‌సిమ్రన్ సూపర్ ఇన్నింగ్స్ ● అర్ష్‌దీప్‌నకు మూడు వికెట్లు

ధర్మశాల: అన్ని విభాగాల్లో రాణిస్తూ అత్యంత పటిష్ఠంగా కనిపిస్తున్న పంజాబ్ కింగ్స్ నుంచి మరో అద్భుత ప్రదర్శన. యువ ఓపెనర్ ప్రభ్‌సిమ్రన్ (48 బంతుల్లో 6 ఫోర్లు, 7 సిక్సర్లతో 91) తుఫాన్ ఆటతీరుతో విరుచుకుపడగా.. పేసర్ అర్ష్‌దీప్ (4-0-16-3) పొదుపైన బౌలింగ్‌కు లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ బెంబేలెత్తింది. ఫలితంగా ఆదివారం జరిగిన ఈ మ్యాచ్‌లో శ్రేయాస్ సేన 37 పరుగులతో ఘనవిజయం అందుకుంది. దీంతో ఏడు విజయాలు, 15 పాయింట్లతో రెండో స్థానానికి ఎగబాకింది. తమకు మిగిలిన మూడు మ్యాచుల్లో ఒక్కటి నెగ్గినా.. పంజాబ్ ప్లేఆఫ్స్‌కు చాన్స్ ఉంటుంది. అటు లఖ్‌నవూ రాబోయే మూడు మ్యాచ్‌ల్లో కచ్చితంగా గెలిచి తీరాల్సిందే. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన పంజాబ్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 236 పరుగులు చేసింది. కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్ (25 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సర్లతో 45), శశాంక్ (15 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్‌తో 33 నాటౌట్) రాణించారు. ఆకాశ్, దిగ్వేష్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఛేదనలో లఖ్‌నవూ 20 ఓవర్లలో 7 వికెట్లకు 199 పరుగులకే పరిమితమైంది. ఆయుష్ బదోని (40 బంతుల్లో 5 ఫోర్లు, 5 సిక్సర్లతో 74), అబ్దుల్ సమద్ (24 బంతుల్లో 2 ఫోర్లు, 4 సిక్సర్లతో 45) మాత్రమే ఆకట్టుకున్నారు. అర్ష్‌దీప్‌నకు 3, అజ్మతుల్లాకు 2 వికెట్లు దక్కాయి. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా ప్రభ్‌సిమ్రన్ నిలిచాడు.

బదోని-సమద్ పోరాటం: భారీ ఛేదనలో లఖ్‌నవూ ఆరంభంలోనే చతికిలపడింది. టాపార్డర్ పేలవ ఆటతీరుతో జట్టు ఏ దశలోనూ లక్ష్యం వైపు సాగలేకపోయింది. చివర్లో బదోని, సమద్ పోరాటం ఏమాత్రం సరిపోలేదు. కెప్టెన్ రిషభ్ పంత్ (18) నిరాశాజనక ప్రదర్శన ఈ మ్యాచ్‌లోనూ కొనసాగింది. ఓపెనర్లు మార్ష్ (0), మార్‌క్రమ్ (13)లను పేసర్ అర్ష్‌దీప్ మూడో ఓవర్‌లోనే అవుట్ చేయడంతో జట్టుకు గట్టి ఝలక్ తగిలింది. తన మరుసటి ఓవర్‌లోనే ప్రమాదకర పూరన్ (6)ను కూడా అర్ష్‌దీప్ వెనక్కిపంపడంతో 27/3 స్కోరుతో లఖ్‌నవూ కష్టాల్లో పడింది. దీనికి తోడు పేసర్ అజ్మతుల్లా పంత్, మిల్లర్ (11)లకు చెక్ పెట్టాడు. పది ఓవర్లలోనే సగం వికెట్లు కోల్పోయిన వేళ యువ ఆటగాళ్లు బదోని, సమద్ తెగువ చూపారు. 12వ ఓవర్‌లో బదోని 6,4,4.. సమద్ 6తో 21 పరుగులు వచ్చాయి. చాహల్ ఓవర్‌లో రెండు సిక్సర్లు బాదిన సమద్.. స్టొయినిస్ ఓవర్‌లో 4,6తో సత్తా చాటాడు. చివరకు జాన్సన్ రిటర్న్ క్యాచ్‌తో సమద్ వెనుదిరగ్గా ఆరో వికెట్‌కు 81 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. బదోని మాత్రం దాటిని కొనసాగిస్తూ 18వ ఓవర్‌లో 6,6,4తో 18 రన్స్ అందించాడు. కానీ చివరి ఓవర్‌లో 49 రన్స్ కావాల్సిన వేళ.. తొలి బంతికే బదోని అద్భుత ఇన్నింగ్స్ ముగియడంతో లఖ్‌నవూ చేసేదేమీ లేకపోయింది.

చెలరేగిన ప్రభ్‌సిమ్రన్: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన పంజాబ్ ఇన్నింగ్స్‌ను ఓపెనర్ ప్రభ్‌సిమ్రన్ అంతా తానై కదం తొక్కించాడు. ఆరంభంలో ఇన్‌గ్లిస్, మిడిలార్డర్‌లో శ్రేయాస్ అతడికి సహకారం అందించారు. ఇక చివర్లో శశాంక్ జత కలవడంతో స్కోరు అవలీలగా 220 దాటేసింది. మరో ఓపెనర్ ప్రియాన్ష్ ఆర్య (1) తొలి ఓవర్‌లోనే అవుటైనా.. ఇన్‌గ్లిస్ వచ్చీ రావడంతోనే 4,6,6,6తో దాటిని చూపాడు. నాలుగో ఓవర్‌లో ప్రభ్‌సిమ్రన్ 6,6,4తో స్కోరు రాకెట్ వేగంతో దూసుకెళ్లింది. ఇన్‌గ్లిస్‌ను ఆకాశ్ అవుట్ చేయగా, ఆరో ఓవర్‌లో ప్రభ్‌సిమ్రన్ క్యాచ్‌ను పూరన్ వదిలేశాడు. అయితే పవర్‌ప్లేలో జట్టు 66/2తో పటిష్ఠ స్థితిలోనే నిలిచింది. అలాగే మధ్య ఓవర్లలో అడపాదడపా బౌండరీలతో ప్రభ్‌సిమ్రన్-శ్రేయాస్ జోడీ జోరు కనబర్చింది. అటు 30 బంతుల్లో ప్రభ్‌సిమ్రన్ ఈ సీజన్‌లో హ్యాట్రిక్ హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. అయితే శ్రేయాస్‌ను దిగ్వేష్ వెనక్కి పంపడంతో మూడో వికెట్‌కు 78 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. నేహల్ వధేరా (16) నిరాశపర్చగా.. శశాంక్ ఆఖర్లో వేగం చూపాడు. ఆవేశ్ వేసిన ఇన్నింగ్స్ 18వ ఓవర్‌లో శశాంక్ 4,4.. ప్రభ్‌సిమ్రన్ 6,4,6తో 26 పరుగులు సమకూరాయి. కానీ సెంచరీకి చేరువలో ప్రభ్‌సిమ్రన్‌ను దిగ్వేష్ క్యాచవుట్ చేశాడు. దీంతో ఐదో వికెట్‌కు 54 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. చివరి ఓవర్‌లో 18 రన్స్‌తో పంజాబ్ స్కోరు 230 దాటింది.



వేదిక	
నేటి మ్యాచ్	హైదరాబాద్
సన్‌రైజర్స్ x ఢిల్లీ	రా.7.30 నుంచి

స్కోరుబోర్డు

పంజాబ్: ప్రియాన్ష్ (సి) మయాంక్ (బి) ఆకాశ్ 1, ప్రభ్‌సిమ్రన్ (సి) పూరన్ (బి) దిగ్వేష్ రాఠి 91, ఇన్‌గ్లిస్ (సి) మిల్లర్ (బి) ఆకాశ్ 30, శ్రేయాస్ (సి) మయాంక్ (బి) దిగ్వేష్ రాఠి 45, నేహల్ (బి) ప్రిన్స్ 16, శశాంక్ (నాటౌట్) 33, స్టొయినిస్ (నాటౌట్) 15, **ఎక్స్‌ట్రాలు: 5; మొత్తం: 20 ఓవర్లలో 236/5; వికెట్ల పతనం:** 1-2, 2-50, 3-128, 4-162, 5-216; **బౌలింగ్:** ఆకాశ్ సింగ్ 4-0-30-2, మయాంక్ 4-0-60-0, అవేశ్ ఖాన్ 4-0-57-0, దిగ్వేష్ రాఠి 4-0-46-2, ప్రిన్స్ యాదవ్ 4-0-43-1.

లఖ్‌నవూ: మార్‌క్రమ్ (బి) అర్ష్‌దీప్ 13, మార్ష్ (సి) నేహల్ (బి) అర్ష్‌దీప్ 0, పూరన్ (ఎల్బీ) అర్ష్‌దీప్ 6, పంత్ (సి) శశాంక్ (బి) అజ్మతుల్లా 18, బదోని (సి) అర్ష్‌దీప్ (బి) చాహల్ 74, మిల్లర్ (సి) శశాంక్ (బి) అజ్మతుల్లా 11, అబ్దుల్ (సి అండ్ బి) జాన్సెన్ 45, అవేశ్ (నాటౌట్) 19, ప్రిన్స్ (నాటౌట్) 1, **ఎక్స్‌ట్రాలు: 12; మొత్తం: 20 ఓవర్లలో 199/7; వికెట్ల పతనం:** 1-15, 2-16, 3-27, 4-58, 5-73, 6-154, 7-188; **బౌలింగ్:** అర్ష్‌దీప్ 4-0-16-3, జాన్సెన్ 4-0-31-1, అజ్మతుల్లా 4-0-33-2, చాహల్ 4-0-50-1, వైశాఖ్ 3-0-49-0, స్టొయినిస్ 1-0-17-0.

హాకీ అమ్మాయిలకు ఓ విజయం

పెర్త్: ఆస్ట్రేలియా పర్యటనలో భారత మహిళల హాకీ జట్టు ఎట్టకేలకు ఓ విజయాన్ని నమోదు చేసింది. ఆదివారం జరిగిన ఆఖరి పోరులో భారత్ 1-0తో ఆస్ట్రేలియా సీనియర్ జట్టును చిత్తుచేసి గెలుపుతో టూర్‌ను ముగించింది. మ్యాచ్‌లో ఏకైక గోల్‌ను నవ్‌నీత్ కౌర్ (21వ) సాధించింది. కాగా, ఈ టూర్‌లో భాగంగా ఆరంభంలో ఆస్ట్రేలియా 'ఏ' జట్టుతో వరుసగా రెండు మ్యాచ్‌లు ఓడిన భారత జట్టు.. ఆ తర్వాత సీనియర్ జట్టుతోనూ రెండు మ్యాచ్‌లను చేజార్చుకున్న సంగతి తెలిసిందే.

లంక.. ఏడేళ్లలో తొలిసారి

- భారత్‌పై గెలుపు
- మహిళల ముక్కోణపు సిరీస్



కొలంబో: ఆల్‌రౌండర్ నీలాక్షికా సిల్వా (33 బంతుల్లో 56) దూకుడైన బ్యాటింగ్‌తో ఏడు సంవత్సరాల సుదీర్ఘ విరామం తర్వాత వన్డేలలో భారత్‌పై శ్రీలంక మహిళలు తొలి విజయం అందుకున్నారు. ముక్కోణపు వన్డే సిరీస్‌లో భాగంగా ఆదివారం జరిగిన మ్యాచ్‌లో ఆతిథ్య జట్టు 3 వికెట్లతో హర్మన్ సేనను ఓడించింది. టోర్నీలో రెండో విజయం సాధించిన శ్రీలంక ఫైనల్‌కు చేరువైంది. ఇక సిరీస్‌లో భారత్‌కిది తొలి పరాజయం. అయితే ఇప్పటికే రెండు మ్యాచ్‌ల్లో నెగ్గినందున ఈ ఓటమి హర్మన్ సేన ఫైనల్ చేరికపై ప్రభావం చూపే అవకాశం లేదు. టాస్ కోల్పోయి మొదట బ్యాటింగ్ చేసిన భారత్ 50 ఓవర్లలో 275/9 స్కోరు సాధించింది. కీపర్ రిచా ఘోష్ (48 బంతుల్లో 58) మెరుపు ఇన్నింగ్స్ ఆడింది. జెమీమా (37), ప్రతికా రావల్ (35) పర్లేదనిపించారు. అనంతరం శ్రీలంక 49.1 ఓవర్లలో 278/7 స్కోరు చేసి నెగ్గింది.


సంక్షిప్తస్కోర్లు: భారత్: 50 ఓవర్లలో 275/9 (రిచా 58, జెమీమా 37, ప్రతికా రావల్ 35, హర్మన్ 30, చమరి అటపట్టు 3/43, సుగందికా కుమారి 3/44). **శ్రీలంక:** 49.1 ఓవర్లలో 278/7 (నీలాక్షిక 56, హర్షిత 53, కవిష 35, స్నేహ్ రాణా 3/45).

సుప్రీంకోర్టు ఎలాంటి తప్పు చేయలేదు

» బిల్లుల ఆమోదంపై కాలపరిమితి సబబే: జస్టిస్ కేఎం జోసెఫ్

కోచి, మే 4: రాష్ట్ర అసెంబ్లీలు ఆమోదించిన బిల్లులపై సంతకాలు చేసేందుకు రాష్ట్రపతి, గవర్నర్లకు గడువు విధించడం సబబేనని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ కె.ఎం.జోసెఫ్ అన్నారు. ఇందుకు సంబంధించి సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించారు. ఈ విషయంలో సుప్రీంకోర్టు ఎలాంటి తప్పు చేయలేదన్నారు. ప్రజాస్వామ్యం, సమాఖ్య వ్యవస్థ ప్రయోజనాల దృష్ట్యా ఇలాంటి నిర్ణయం అవసరమని తెలిపారు. కోచిలో శనివారం ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ ఆధ్వర్యంలో 'గవర్నర్ల అధికారాల్లో న్యాయ వ్యవస్థ' పాత్ర అనే అంశంపై జరిగిన సదస్సులో ఆయన ప్రసంగించారు. బిల్లుల ఆమోదంలో గవర్నర్ల పాత్ర పరిమితంగా ఉంటుందని తెలిపారు. కాగా, వక్ఫ్ సవరణ చట్టం-2025 రాజ్యాంగ చెల్లుబాటును సవాల్ చేస్తూ దాఖలైన పలు పిటిషన్లను సుప్రీంకోర్టు సోమవారం విచారించనుంది. ఇదిలా ఉండగా, అరెస్టులు, ఆస్తుల జప్తు విషయమై ఈడీకి ఉన్న అధికారాలను సమర్థిస్తూ 2022లో ఇచ్చిన తీర్పు సమీక్షించాలా.. వద్దా అన్నదానిపై నిర్ణయించేందుకు సుప్రీంకోర్టు త్రిసభ్య ధర్మాసనాన్ని ఏర్పాటు చేసింది.

యోగా గురువు శివానంద బాబా కన్నుమూత



వారణాసి, మే 4: ప్రముఖ యోగా గురువు, ఆధ్యాత్మిక వేత్త శివానంద బాబా వారణాసిలో తుదిశ్వాస విడిచారు. కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న బాబా శనివారం రాత్రి కన్నుమూసినట్లు ఆయన అనుచరులు ప్రకటించారు. బాబా మరణంపై ప్రధాని మోదీ, ఉత్తరప్రదేశ్ సీఎం యోగి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆధ్యాత్మిక సాధనకు, యోగా రంగానికి శివానంద చేసిన కృషిని ఈ సందర్భంగా కొనియాడారు. ప్రస్తుత బంగ్లాదేశ్‌లోని సిల్హెట్ జిల్లాలో 1896వ సంవత్సరంలో ఓ నిరుపేద కుటుంబంలో శివానంద బాబా జన్మించారు. తల్లిదండ్రులు తన చిన్నతనంలోనే మరణించడంతో గురువు ఓంకార నంద సంరక్షణలో పెరిగారు. గురువు దగ్గరే యోగా, ఆధ్యాత్మికతకు సంబంధించిన విషయాలను నేర్చుకున్నారు. యోగా రంగంలో శివానంద బాబా చేసిన సేవలను గుర్తిస్తూ కేంద్ర ప్రభుత్వం 2022లో ఆయనను పద్మశ్రీతో సత్కరించింది.

కులగణనపై కాంగ్రెస్ ఇంటింటి ప్రచారం

ప్రతి నియోజకవర్గంలో సంవిధాన్ బచావో ర్యాలీలు.. సోషల్ మీడియా వేదికగా పెద్దఎత్తున ప్రచారం

- » పర్యవేక్షణకు పీసీసీలో కంట్రోల్ రూం ఏర్పాటు
- » జిల్లా స్థాయిలో పరిశీలకులు
- » పీసీసీల అధ్యక్షులకు అధిష్ఠానం దిశానిర్దేశం
- » తెలంగాణలో కులగణనను సమర్థంగా పూర్తిచేసిన విషయాన్ని దేశవ్యాప్తంగా వివరించనున్న కాంగ్రెస్



తెలంగాణలో కులగణన నిర్వహిస్తున్నప్పటి చిత్రం(ఫైల్)

న్యూఢిల్లీ, మే 4 (ఆంధ్రజ్యోతి): కులగణనపై ఇంటింటి ప్రచారం చేయాలని కాంగ్రెస్ అధిష్ఠానం నిర్ణయించింది. రాహుల్ గాంధీ ఒత్తిడి మేరకే కేంద్ర ప్రభుత్వం కులగణన చేపడతామని ప్రకటించిందనే విషయాన్ని గ్రామస్థాయిలో వివరించేందుకు సిద్ధమవుతోంది. రాహుల్ హామీ మేరకు ఇప్పటికే తెలంగాణలో కులగణనను సమర్థవంతంగా పూర్తిచేశామనే విషయాన్ని దేశవ్యాప్తంగా వివరించాలని భావిస్తోంది. ఈ మేరకు ఇటీవల కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రత్యేక కార్యాచరణను ప్రకటించింది. కులగణనపై కాంగ్రెస్ వైఖరిని, బీజేపీ మొదటి నుంచీ వ్యతిరేకించిన తీరును దేశవ్యాప్తంగా ఇంటింటికీ చేరవేయాలని పీసీసీ అధ్యక్షులకు మార్గదర్శకాలు జారీ చేసింది. ఇందులో భాగంగా మే 30 వరకు ప్రత్యేక కార్యాచరణను ప్రకటించింది. కులగణనపై ఇంటింటి ప్రచారం నిర్వహించాలని, ప్రతి నియోజకవర్గంలో సంవిధాన్ బచావో ర్యాలీలు చేపట్టాలని, సోషల్ మీడియా వేదికగా పెద్దఎత్తున ప్రచారం చేయాలని కాంగ్రెస్ అధిష్ఠానం సర్క్యులర్ జారీ చేసింది. ఈ కార్యక్రమాల పర్యవేక్షణకు పీసీసీల ఆధ్వర్యంలో ప్రత్యేకంగా కంట్రోల్ రూములు ఏర్పాటు చేయాలని, జిల్లాస్థాయిలో పరిశీలకులను నియమించాలని అన్ని రాష్ట్రాల పీసీసీ అధ్యక్షులు, సీఎల్పీ నేతలకు సూచించింది. పాటిబ్యూరో ప్రధాన కార్యదర్శులు, రాష్ట్రాల ఇన్‌చార్జులు, సంఘాల బాధ్యులు, ఏఐసీసీ కార్యదర్శులు, డీసీసీ అధ్యక్షులకు సైతం సర్క్యులర్ కాపీలను పంపింది. కులగణన చేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తే... మోదీ ప్రభుత్వం ఎగతాళి చేసిందని, చివరికి ప్రజాస్వామ్య నిర్ణయానికి తలొగ్గి కులగణన ప్రకటన చేసిందని సర్క్యులర్‌లో తెలిపింది. ప్రైవేట్ విద్యా సంస్థల్లోనూ ఓబీసీలు, దళితులు, ఆదివాసీలకు రిజర్వేషన్లు కల్పించడానికి రాజ్యాంగంలోని ఆర్టికల్ 15(5) అమలు చేయాలన్న డిమాండ్‌ను సంవిధాన్ బచావో ర్యాలీల్లో హైలెట్ చేయాలని తెలిపింది. ఈ ర్యాలీలు, ఇంటింటి ప్రచారాలను పీసీసీ అధ్యక్షులు ప్రత్యక్షంగా పర్యవేక్షించాలని ఆదేశించింది. సామాజిక కార్యకర్తలు, పౌర సమాజ కార్యకర్తలు, ఉపాధ్యాయులు, న్యాయవాదులు, దుకాణదారులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, బహుజన వర్గాల క్రియాశీల భాగస్వామ్యంతో చౌపాల్ సమావేశాలు నిర్వహించాలని సూచించింది. రాహుల్ గాంధీ పోషించిన నాయకత్వ పాత్రతో సహా, కాంగ్రెస్ పార్టీ చరిత్రాత్మక నిర్ణయాన్ని క్షేత్రస్థాయిలో వివరించాలని పేర్కొంది. బీజేపీ బహుజన వ్యతిరేక భావజాలాన్ని బహిర్గతం చేయాలని తెలిపింది. కాగా, ఏవో సాకులు చూపుతూ కులగణనను ఆలస్యం చేయొద్దని కేంద్రానికి కాంగ్రెస్ సూచించింది. పార్లమెంటులో చర్చించి పూర్తిస్థాయిలో బడ్జెట్ కేటాయించాలని, నిర్దిష్ట కాల పరిమితిని ప్రకటించాలని డిమాండ్ చేసింది. కులగణన సర్వే కోసం సమగ్ర నివేదికతో కూడిన ప్రొఫార్మా రూపొందించాలని కోరింది.



క్షిపణి దాడిలో ధ్వంసమైన రోడ్డు

టెల్‌అవీవ్ విమానాశ్రయ సమీపంలో క్షిపణి దాడి

» ఢిల్లీ నుంచి టెల్‌అవీవ్ వెళ్తున్న విమానాన్ని అబుదాబికి మళ్లించిన ఎయిర్‌ఇండియా

న్యూఢిల్లీ, మే 4: ఇజ్రాయెల్ నగరం టెల్‌అవీవ్‌లోని ఓ విమానాశ్రయానికి సమీపంలో ఆదివారం ఉదయం క్షిపణి దాడి జరగడంతో ఢిల్లీ నుంచి టెల్ అవీవ్‌కు వెళ్తున్న తన విమానాన్ని ఎయిర్ ఇండియా అబుదాబికి మళ్లించింది. టెల్ అవీవ్‌లో ఎయిర్ ఇండియా బోయింగ్ 787 విమానం ఏఐ139 దిగడానికి అరగంట ముందు ఈ క్షిపణి దాడి ఘటన జరిగింది. ఈ నేపథ్యంలో ఎయిర్ ఇండియా అధికారులు అప్రమత్తమయ్యారు. మే 6 వరకు టెల్‌అవీవ్‌కు విమానాల రాకపోకలను తక్షణమే నిలిపివేసినట్టు ఎయిర్ ఇండియా తెలిపింది. టెల్‌అవీవ్ నుంచి ఢిల్లీకి ఆదివారం రావాల్సిన ఎయిర్ ఇండియా విమానాన్ని కూడా రద్దు చేశారు. యెమెన్ నుంచి హౌతీ రెబెల్స్ ప్రయోగించిన బాలిస్టిక్ క్షిపణి టెల్‌అవీవ్‌లోని బెన్‌గురియన్ విమానాశ్రయం మూడో టెర్మినల్‌కు 75 మీటర్ల దూరంలో పడింది. దీంతో 25 మీటర్ల లోతు గొయ్యి ఏర్పడింది. కాగా క్షిపణిని అడ్డుకోవడానికి పలు ప్రయత్నాలు చేసినప్పటికీ విఫలమైనట్టు ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ పేర్కొంది. క్షిపణి దాడి నేపథ్యంలో ఇజ్రాయెల్ రక్షణ మంత్రి కట్జ్ తీవ్ర హెచ్చరిక చేశారు. విమానాశ్రయదాడికి ప్రతీకారం తీర్చుకుంటామన్నారు.

అందగత్తెలకు అపూర్వ స్వాగతం

మిస్ బ్రెజిల్ జెస్సికా, సౌత్ ఆఫ్రికా భామ రెన్స్‌బర్గ్‌సహా

90 మంది అందగత్తెల రాకతో శంషాబాద్‌లో సందడి

హైదరాబాద్/శంషాబాద్ రూరల్, మే 4(ఆంధ్రజ్యోతి): మిస్‌వరల్డ్ పోటీల్లో పాల్గొనేందుకు వివిధ దేశాలకు చెందిన అందాల బామలు హైదరాబాద్ చేరుకుంటున్నారు. శంషాబాద్ విమానాశ్రయం చేరుకున్న సుందరీమణులకు టూరిజంశాఖ అధికారులు సంప్రదాయ పద్ధతిలో స్వాగతం పలుకుతున్నారు. ఆదివారం మిస్ బ్రెజిల్ జెస్సికా స్కాండుజ్ పెడ్రోసో, మిస్ సౌత్‌ఆఫ్రికా మిస్‌జోయలైజ్ జాన్సన్‌వాన్ రెన్స్‌బర్గ్‌తోపాటు 90 మంది పోటీదారులు హైదరాబాద్ చేరుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సోమవారం మరికొందరు పోటీదారులు వచ్చే అవకాశం ఉంది. అందగత్తెలు ఎయిర్‌పోర్టుకు చేరుకోవడంతో ఆ ప్రాంగణమంతా సందడిగా మారింది. అనంతరం వారిని ఆయా హోటళ్లకు తరలించారు. కాగా, శంషాబాద్ ఎయిర్‌పోర్టులో టూరిజం శాఖ ప్రత్యేక స్టాల్‌ను ఏర్పాటు చేసింది. అతిథులకు సమాచారం ఇచ్చేందుకు ప్రత్యేకంగా హెల్ప్ డెస్క్‌ను అందుబాటులోకి తెచ్చింది.



ఇంధన సంస్థల్లో ఉద్యోగాలు ఖాళీ!

» **2017 తర్వాత ఇప్పటిదాకా భర్తీనే లేదు**

అమరావతి, మే 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఇంధన సంస్థలలో ఉద్యోగులు తగ్గిపోతున్నారు. ఖాళీలు పెరిగిపోతున్నాయి. రిటైర్ అవుతున్న ఇంజనీర్లు, ఉద్యోగుల స్థానాలను ఆర్థిక నిర్వహణ పేరిట భర్తీ చేయడం లేదు. 2017లో టీడీపీ ప్రభుత్వ హయాంలో ఏపీ జెన్కో, ట్రాన్స్‌కో, డిస్కమ్‌లలో ఇంజనీరింగ్ పోస్టుల్లో నియామకాలు చేపట్టారు. ఆ తర్వాత.. మళ్లీ లేదు. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి ఏటా జనవరి 1న జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేస్తానంటూ ప్రతిపక్షంలో ఉండగా జగన్మోహన్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలో ఊరూరా హామీ ఇచ్చారు. కానీ ఆ ఐదేళ్లలో క్యాలెండర్లు మారిపోయాయే తప్ప ఒక్క ఏడాది కూడా ఉద్యోగ నియామక ప్రకటనలు రాలేదు. దీంతో.. 2023లో జరిగిన గ్రాడ్యుయేషన్ కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో యువత వైసీపీకి గట్టి గుణపాఠాన్ని చెప్పింది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో జగన్ పార్టీ 11 స్థానాలకే పరిమితమైంది. ఇక, తాజాగా కూటమి అధికారంలోకి వచ్చాక.. నిరుద్యోగ యువత మరోసారి తమ డిమాండ్లను ముందుకు తెస్తోంది. ప్రధానంగా ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్లు ఉద్యోగ నియమాకాల కోసం కూటమి ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతున్నారు.

వేలల్లో ఇంజనీరింగ్ పోస్టుల ఖాళీ

ఏపీ ట్రాన్స్‌కోలో ఏఈఈ పోస్టులు 500 వరకూ ఖాళీగా ఉన్నాయి. ట్రాన్స్‌కో సబ్ ఇంజనీర్ల పోస్టులు 234 భర్తీ చేయాల్సి ఉంది. జెన్కోలో ఏఈఈ పోస్టులు 383, సబ్ ఇంజనీర్ పోస్టులు 343 ఖాళీగా ఉన్నాయి. వీటిని తక్షణమే నింపాలని నిరుద్యోగ యువత కోరుతోంది. గతంలో విద్యుత్‌లో సంస్థల్లో పోస్టుల భర్తీ చేసినట్లుగానే ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ దఫాలోనూ తమకు మేలు చేసేలా ఉద్యోగాలు భర్తీ చేయాలని కోరుతున్నారు. కాగా.. రిటైర్ అవుతున్న వారు అవుతున్నట్లుగానే ఖాళీలను భర్తీ చేయకపోవడం వల్ల తమపై పనిభారం పడుతోందని, విద్యుత్ డిమాండ్‌కు సరిపడా సరఫరా చేయడంపై నిరంతరం శ్రమించాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఇంధన సంస్థల ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పనిభారం, ఒత్తిడి తగ్గాలంటే ఇంధన సంస్థలలో ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని విద్యుత్ ఇంజనీర్ల సంఘం డిమాండ్ చేస్తోంది.

పేట్‌బషీరాబాద్‌లో వైసీపీ నేత బంధువు

'భూ'ఆగడాలు

» **రాజకీయ పలుకుబడితో పినిపె బంధువు దౌర్జన్యాలు**

» **రిజిస్ట్రేషన్ పూర్తయినా తుది లే ఔట్‌కు అడ్డంకులు**

» **శివోమ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు హరిబాబు ఆవేదన**

పంజాగుట్ట, మే 4 (ఆంధ్రజ్యోతి): పైసాపైసా కూడబెట్టి కొనుగోలుచేసిన ప్లాట్లను లేఔట్ వేసి అభివృద్ధి చేసుకోకుండా తమను వైసీపీ సీనియర్ నేత, ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి పినిపె విశ్వరూప్ బావమరిది ఇసుకపాట్ల సాంబమూర్తి ఇబ్బందుల పాల్జేస్తున్నారని పలువురు శివోమ్ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ బాధితులు ఆరోపించారు. శివోమ్ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్లు వీఎస్ఎన్ రాజు, పి.బోసురాజు, చిలుకూరి నరేశ్‌లు జీడిమెట్ల మండలం కుత్బుల్లాపూర్ గ్రామం పేట్ బషీరాబాద్‌లోని 18,19 సర్వే నంబర్ల పరిధిలో గల 3 ఎకరాల 35 గుంటల భూమిని 45 ప్లాట్లుగా విభజించి లే ఔట్ వేశారని శివోమ్ సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.హరిబాబు, సభ్యులు రాధాకృష్ణ, మార్టిన్, అనిత, రజనీ తదితరులు ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ చెప్పారు. తొలుత ఇల్లు కట్టుకుంటామంటేనే ప్లాట్లు విక్రయిస్తామని, లేకుంటే లేదని చెప్పారని, తాము పైసాపైసా కూడబెట్టి రూ.50 కోట్లు చెల్లించి సేల్ డీడ్ ద్వారా 40 ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు తెలిపారు. మిగతా ఐదు ప్లాట్లను జీహెచ్ఎంసీకి మార్టగేజ్ చేసిన ప్లాట్లను పలువురికి విక్రయించిన శివోమ్ ప్రాజెక్ట్స్ ఎండీ, డైరెక్టర్లు.. వారి వద్ద డబ్బు తీసుకుని కూడా రిజిస్ట్రేషన్ చేయలేదని హరిబాబు తదితరులు తెలిపారు. ప్రస్తుతం భూమి విలువ పెరగడంతో ఇసుకపాట్ల సాంబమూర్తి, ఆంధ్రప్రదేశ్‌కే చెందిన పి.బోసురాజు తమకు రాజకీయ పలుకుబడి ఉందని తమను బెదిరించడంతోపాటు దౌర్జన్యానికి పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తుది లేఔట్ ఖరారు కాక ఇళ్ల నిర్మాణానికి అధికారులు అనుమతించడం లేదని శివోమ్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేశారు. భూ యజమానుల దగ్గరికెళితే 'మాకు సంబంధం లేదు. అభివృద్ధి చేసిన వారి వద్దకే వెళ్లండి. మా వద్దకు ఎందుకు వస్తున్నారు' అని బెదిరిస్తున్నారని తెలిపారు. లేఔట్ రద్దుచేయించి తమ ప్లాట్లు కబ్జా చేయాలని చూస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇదిలా ఉంటే, పాత రికార్డుల ప్రకారం ఆ భూమి తమదేనని పొరుగున ఉన్న కొందరు గత మార్చిలో తమ పాట్లలో కట్టిన ప్రహరీగోడలను జేసీబీలతో కూల్చేశారని హరిబాబు చెప్పారు. దీనివల్ల తమకు రూ.10 లక్షలకు పైగా నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసిన పోలీసులు.. ఇప్పటికి నిందితులను అరెస్ట్ చేయలేదని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు. తమను మోసగించిన వారిని చట్ట ప్రకారం శిక్షించాలని విజ్ఞప్తి చేశారు.



విజయవాడ సిద్ధార్థ కాలేజీలో జరిగిన నీట్ పరీక్షకు హాజరైన విద్యార్థులు



రాజమహేంద్రవరంలో చివరి నిముషంలో విద్యార్థిని ఉరుకులు



కర్నూలులో విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది



కర్నూలులో విద్యార్థిని కాలి పట్టీలు తీసేస్తున్న దృశ్యం

ఘాటుగా నీట్

(మొదటి పేజీ తరువాయి)

తల్లిదండ్రులు.. లోపలికి అనుమతించాలంటూ సిబ్బందిని బతిమిలాడుకున్నా ఉపయోగం లేకపోయింది. దీంతో వారు కన్నీటిపర్యంతమయ్యారు. ఇక.. కొన్ని పరీక్షా కేంద్రాల్లో గోడ గడియారాలను ఏర్పాటు చేయలేదు. దీంతో విద్యార్థులు సమయం ఎంత అయిందో తెలియక, పరీక్ష రాయడానికి ఇంకా ఎంత సమయం ఉందో తెలుసుకునే వెసులుబాటు లేక తీవ్రంగా ఇబ్బంది పడ్డారు.

మునుపెన్నడూ లేనంత.. నీట్ యూజీ 2018లో మొదలైంది. నాటి నుంచి కిందటి సంవత్సరం దాకా.. ఏ ఏడాదీ నీట్ ప్రశ్నపత్రం ఇంత కఠినంగా లేదని అధ్యాపకులు, విద్యారంగ నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా ఫిజిక్స్ ప్రశ్నలు తమను బెంబెలెత్తించినట్లు విద్యార్థులు వెల్లడించారు. నీట్ పేపర్‌లో.. ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీలలో మొత్తం 180 ప్రశ్నలుంటాయి. ఫిజిక్స్‌లో 45 ప్రశ్నలకుగాను 20-25 ప్రశ్నలకు జవాబు రాస్తే చాలా గొప్పేనని నిపుణులు చెబుతున్నారు. మెరిట్ విద్యార్థులు సైతం ఫిజిక్స్‌లో 30 ప్రశ్నలకు మించి సమాధానాలు రాయలేకపోయారని.. ఎవరైనా 40 ప్రశ్నలకు సమాధానాలు రాస్తే ఆలిండియా ర్యాంకు తథ్యమని వస్తుందని పేర్కొన్నారు. అలాగే, కెమిస్ట్రీలో ఆరు ప్రశ్నలను అత్యంత కఠినంగా ఇచ్చారని, అవి సుదీర్ఘంగా, సమయం ఎక్కువ తీసుకునేలా ఉన్నాయని ఓ ప్రముఖ విద్యాసంస్థలో కెమిస్ట్రీ సీనియర్ ఫ్యాకల్టీగా ఉన్న జె.శ్రీనివాస్ అభిప్రాయపడ్డారు. బోటనీలోనూ ఇదే పరిస్థితి నెలకొందని.. కొన్ని ప్రశ్నలు కష్టంగా ఇచ్చారని ఆయన వెల్లడించారు. అయితే మెజారిటీ విద్యార్థులు ఆ ప్రశ్నలకు బాగానే సమాధానాలు రాసినట్లు చెబుతున్నారు. జువాలజీలో 3-4 ప్రశ్నలు అర్థం కాలేదని కొంతమంది పేర్కొన్నారు. చాలామంది విద్యార్థులు బోర్డు ఎగ్జామ్ సిలబస్‌ను పట్టించుకోలేదని.. వాటిలో ప్రశ్నలు అడగడం లేదన్న ధీమాతో ఉంటున్నారని.. కానీ, ఈసారి వాటి నుంచి కూడా ప్రశ్నలు అడిగారని.. నిపుణులు తెలిపారు. ప్రశ్నపత్రం కఠినంగా రావడంతో విద్యార్థులు ఒకరకమైన బాధతో కనిపించారు. ఈ ఏడాదితో పోలిస్తే నిరుటి నీట్ పేపర్ తేలిగ్గా ఉందని చాలామంది వాపోయారు. నిరుడు రాష్ట్రంలో జనరల్ కేటగిరీలో 490 స్కోర్ చేసిన వారికి కన్వీనర్ కోటాలో సీటు దక్కింది. రిజర్వేషన్ కోటా 400 పైచిలుకు మార్కులు వచ్చిన వారికి ఏ కేటగిరీలో సీటు వచ్చింది. ఈ ఏడాది మాత్రం పేపరు కఠినంగా ఉండటంతో భారీగా స్కోర్లు చేసే అవకాశం తక్కువగా ఉంటుందంటున్నారు. కాగా.. నీట్ ఫలితాలను జూన్ 14న వెల్లడిస్తామని జాతీయ పరీక్షా సంస్థ ప్రకటించింది. ఈ నెలఖారులోగా 'కీ' విడుదలయ్యే అవకాశం ఉంది. లాంగ్‌టర్మ్ తీసుకుని నిరుడు పరీక్ష రాసినవారిలో 2వేల మంది వరకూ ఎంబీబీఎస్ సీటు సాధించారని.. ఈసారి మాత్రం ఆ సంఖ్య వెయ్యిలోపే ఉంటుందని నీట్ నిపుణులు అభిప్రాయపడ్డారు. సాధారణంగా నీట్ లాంగ్‌టర్మ్ విద్యార్థులకు భౌతికశాస్త్రమే ఇబ్బందిగా ఉంటుందని.. ఈ ఏడాది అదే కష్టంగా రావడంతో వారు సీటు కొట్టడం చాలా కష్టమని పేర్కొన్నారు.

ఎన్ని కష్టమైన ప్రశ్నలో..

నీట్ ప్రశ్నపత్రంలో ఏయే సబ్జెక్టుల్లో ఎన్ని ప్రశ్నలు కఠినంగా వచ్చాయంటే..

సబ్జెక్టు	సులభం	మధ్యస్థం	కఠినం	మొత్తం
ఫిజిక్స్	10	19	16	45
కెమిస్ట్రీ	11	19	15	45
బోటనీ	20	16	14	50
జువాలజీ	19	15	6	40
మొత్తం	60	69	51	180

450 వస్తే జనరల్‌లో సీటు!



కిందటి సంవత్సరం చాలామంది విద్యార్థులు 720 మార్కులు సాధించారు. ఈసారి 700 సాధించడమే చాలా కష్టం. ఈ ఏడాది కటాఫ్ బాగా (50-60 మార్కుల మేర) తగ్గే అవకాశం కనిపిస్తోంది. నిరుడు తెలంగాణలో 490 మార్కులు సాధించిన వారికి కన్వీనర్ కోటాలో సీటుదక్కింది. ఈసారి 450 మార్కులు సాధిస్తే జనరల్ కేటగిరీలో సీటు రావొచ్చు.

- డి.శంకర్‌రావు, డీన్, శ్రీచైతన్య కాలేజ్, కూకట్‌పల్లి, హైదరాబాద్

779 కాలేజీలు.. 1.17 లక్షల సీట్లు

అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం.. ఈ ఏడాది దేశవ్యాప్తంగా 779 మెడికల్ కాలేజీల్లో 1.17 లక్షల ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఈ సీట్ల కోసం దేశవ్యాప్తంగా 5400కు పైగా కేంద్రాల్లో.. 22.7 లక్షల మందికి పైగా అభ్యర్థులు పరీక్ష రాశారు. అంటే.. ఒక్కో సీటుకు సగటున 19 నుంచి 20 మంది పోటీ పడుతున్నారు. ఈ ఏడాది కూడా అబ్బాయిల కంటే అమ్మాయిలే ఎక్కువగా ఈ పరీక్షకు హాజరు కావడం విశేషం. కాగా.. మన రాష్ట్రంలో 8500 దాకా ఎంబీబీఎస్ సీట్లున్నాయి.

3,300కుపైగా కంపెనీల పేర్లు తొలగింపు!

బిజినెస్

కసరత్తు చేస్తున్న ప్రభుత్వం

న్యూఢిల్లీ: కంపెనీల చట్టం కింద నమోదైన కంపెనీల సంఖ్య తగ్గనుంది. ఎలాంటి వ్యాపార కార్యకలాపాలు లేనందున తమ పేర్లు తొలగించాలని 3,300కు పైగా కంపెనీలు కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు దరఖాస్తు చేశాయి. దీనిపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలపాలని వివిధ రాష్ట్రాల రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్ (ఆర్‌ఓసీ) పత్రికల్లో నోటిఫికేషన్లు జారీ చేశాయి. కంపెనీల చట్టంలోని సెక్షన్ 248 (2) ప్రకారం ఏదైనా కంపెనీ నమోదైన ఏడాదిలోగా వ్యాపారం ప్రారంభించకపోయినా లేదా ఒక ఆర్థిక సంవత్సరం తర్వాత వరుసగా రెండేళ్ల పాటు ఎలాంటి వ్యాపార కార్యకలాపాలు చేయకపోయినా ఆ కంపెనీ తమ పేరును రికార్డుల నుంచి తొలగించమని కోరవచ్చు. అయితే అందుకు వాటాదారుల్లో 75 శాతం మంది ఆమోదం కావాలి.

మహారాష్ట్ర నుంచే ఎక్కువ: తమ పేర్లను రికార్డుల నుంచి తొలగించమని మహారాష్ట్ర నుంచే ఎక్కువ కంపెనీలు కోరాయి. ఆ రాష్ట్రం నుంచి దీనికి సంబంధించి 700కు పైగా కంపెనీల నుంచి విజ్ఞప్తులు అందాయి. ఢిల్లీ (500+) కర్ణాటక (350+) తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. గుజరాత్, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్ నుంచి కూడా రెండేసి వందల కంపెనీలు ఇందు కోసం విజ్ఞప్తి చేశాయి. ఈ ఏడాది మార్చి నెలాఖరు నాటికి దేశంలో 28,52,449 కంపెనీలు నమోదై ఉండగా అందులో 18,50,932 కంపెనీలు మాత్రమే చురుగ్గా పని చేస్తున్నాయి.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



5వ తేదీ			
హైదరాబాద్	465	విజయవాడ	500
వరంగల్	467	గోదావరి	475
చిత్తూరు	543	విశాఖపట్నం	480
		దజను గుడ్లు రూ. 60	

ఐఎంఎఫ్ ఈడీ కేవీ సుబ్రమణియన్‌పై వేటు



పాక్‌పై ఆర్థిక యుద్ధం మరింత తీవ్రం చేసేందుకే..

న్యూఢిల్లీ: పాకిస్థాన్‌పై ఆర్థిక యుద్ధాన్ని కేంద్ర ప్రభుత్వం మరింత తీవ్రం చేసింది. అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ (ఐఎంఎఫ్)లో మన దేశం తరఫున ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈడీ)గా ఉన్న కేవీ సుబ్రమణియన్‌ను కేంద్ర ప్రభుత్వం ఆకస్మికంగా తొలగించింది. ఆయన పదవీ కాలం ఇంకా ఆరు నెలలు ఉండగానే ప్రభుత్వం ఆయనపై వేటు వేసింది. వాస్తవానికి సుబ్రమణియన్ పదవీ కాలం ఈ ఏడాది అక్టోబరుతో ముగియాల్సి ఉంది. అయితే ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర క్యాబినెట్ నియామకాల కమిటీ ఈ నెల ఒకటో తేదీ నుంచే సుబ్రమణియన్‌కు ఉద్వాసన పలకాలని నిర్ణయించింది. ఇందుకు కారణాలు మాత్రం వెల్లడించలేదు.

పాక్‌పై ఒత్తిడి పెంచేందుకే: తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న పాకిస్థాన్‌పై ఒత్తిడి పెంచేందుకే కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని భావిస్తున్నారు. ఐఎంఎఫ్ విషయ సేకరణపై సుబ్రమణియన్ గతంలో చేసిన వ్యాఖ్యలు ఆ సంస్థలోని చాలా దేశాలకు రుచించలేదు. దీనికి తోడు ఇటీవల ఆయన తన తాజా పుస్తకం 'ఇండియా @ 100: ఎన్‌విజనింగ్ టుమారోస్ ఎకనామిక్ ప్రమోషన్' ప్రమోషన్ కోసం చేసిన ప్రచారం ఆయన స్థాయికి తగ్గట్టు లేదని ఆరోపణలు వచ్చాయి.

ఈ నేపథ్యంలో ఈ నెల 9న జరిగే ఐఎంఎఫ్ సమావేశంలో పాకిస్థాన్‌కు కొత్త రుణాలు పుట్టకుండా మిగతా దేశాల మద్దతు కూడగట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ చర్య తీసుకుందని భావిస్తున్నారు. ఈ సమావేశంలో పాక్‌కు మరో విడత 130 కోట్ల డాలర్ల రుణం మంజూరు చేయడంతో పాటు ఇప్పటికే మంజూరు చేసిన రుణాల వినియోగాన్ని ఐఎంఎఫ్ సమీక్షించనుంది. ఈ నేపథ్యంలో కేంద్రం ఆకస్మికంగా సుబ్రమణియన్‌ను ఐఎంఎఫ్ ఈడీ పదవి నుంచి తొలగించాలని నిర్ణయించడం విశేషం.

ప్రస్తుతానికైతే 'టీ+జీరో' ట్రేడింగ్ ఐచ్ఛికమే

ఏఐ రెండు వైపులా పదునున్న కత్తి
సెబీ చీఫ్ పాండే



న్యూఢిల్లీ: స్టాక్ మార్కెట్లో ప్రస్తుతానికైతే టీ+జీరో ట్రేడింగ్ ఐచ్ఛికమని క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీ స్పష్టం చేసింది. అయితే ఈ వెసులుబాటు మార్కెట్ వర్గాలు క్రమంగా ఈ విధానానికి మారేందుకు దోహదం చేస్తుందని సెబీ చైర్మన్ తుహిన్ కాంత పాండే చెప్పారు. షేర్ల అమ్మకాలు, కొనుగోళ్లు, నగదు చెల్లింపుల ప్రక్రియ ఒకేరోజు ముగిసే విధానాన్ని టీ+జీరో సెటిల్‌మెంట్ అంటారు. సెబీ ప్రస్తుతం ఈ విధానాన్ని తప్పనిసరి పద్ధతిలో కాకుండా ఐచ్ఛిక పద్ధతిలోనే అమలు చేస్తోంది. కాగా కృత్రిమ మేధ (ఏఐ) వినియోగంపైనా సెబీ చీఫ్ మాట్లాడుతూ.. ఈ సరికొత్త టెక్నాలజీ రెండు వైపులా పదునున్న కత్తిలాంటిదన్నారు. నియంత్రణ వ్యవస్థను మరింత పటిష్ఠం చేసేందుకు సెబీ ఇప్పటికే ఏఐని వినియోగిస్తోందన్నారు. ప్రస్తుతం ఐపీఓ పత్రాల ప్రాసెసింగ్, ఇతర కార్యకలాపాల పర్యవేక్షణ కోసం దీన్ని ఉపయోగిస్తున్నట్టు వెల్లడించారు. ఏఐ టూల్స్ సాయంతో సోషల్ మీడియాలో వచ్చే అనధికారిక ఆర్థిక సలహా సేవలకు చెక్ పెడుతున్నట్టు పాండే చెప్పారు.

కేంద్రీకృత కేవైసీ వ్యవస్థ: కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ, ఇతర ఆర్థిక రెగ్యులేటరీ సంస్థలతో కలిసి కేంద్రీకృత నో యువర్ కస్టమర్ (కేవైసీ) వ్యవస్థ ఏర్పాటు కోసం పని చేస్తున్నట్టు పాండే వెల్లడించారు. కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ కార్యదర్శి అధ్యక్షతన ఒక కమిటీ ఇందు కోసం ఇప్పటికే కసరత్తు ప్రారంభించిందన్నారు. ఈ వ్యవస్థ అందుబాటులోకి వస్తే కేవైసీ విధానం అత్యంత సులభమవుతుందన్నారు.

● దేశీయంగా ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ)కు డిమాండ్ పెరుగుతోందని టాటా ఈవీ వెల్లడించింది. డీజిల్, పెట్రోల్ వాహనాలతో పోల్చితే ఈవీలతో నిర్వహణ ఖర్చులు తక్కువగా ఉండటం, దీర్ఘకాలిక లాభాలు ఇందుకు కారణమని పేర్కొంది. విక్రయాల్లో ఎలక్ట్రిక్ ప్యాసింజర్ కార్ల విభాగం కీలకంగా ఉందని తెలిపింది. 2024లో దేశీయంగా 89,000 ఈవీ కార్లు అమ్ముడుపోయినట్లు వాహన్ డేటా వెల్లడించిందని టాటా ఈవీ పేర్కొంది. 2023తో పోల్చితే అమ్మకాల్లో ఇది 22 శాతం అధికం. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో గత ఏడాది దేశంలో మొత్తం 19 లక్షల యూనిట్ల ఈవీ బైక్స్, కార్లు అమ్ముడుపోయాయని టాటా ఈవీ తెలిపింది.

● పర్సనల్ కేర్, హెల్త్‌కేర్ సంస్థ ఇమామీ గ్రూప్.. స్కిన్ కేర్ విభాగంలోకి అడుగుపెట్టింది. ప్యూర్ గ్లో పేరుతో స్కిన్ కేర్ ఉత్పత్తిని విడుదల చేసింది. ఈ ఉత్పత్తుల ప్రచారానికి టాలీవుడ్ నటి రాశీఖన్నాను ప్రచారకర్తగా నియమించుకుంది.

మిశ్రమంగా కదలాడే అవకాశం

దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం మిశ్రమంగా కదలాడే అవకాశాలున్నాయి. ప్రస్తుతం నిఫ్టీ 24,346 స్థాయిలో కన్సాలిడేట్ అవుతోంది. 24,550 స్థాయిలో బలమైన నిరోధాన్ని ఎదుర్కొంటోంది. దీన్ని అధిగమిస్తే మీడియం టర్మ్‌లో మరింత బలపడే అవకాశం ఉంది. మిడ్, స్మాల్ కంపెనీల్లో ఇప్పటికీ కరెక్షన్ కొనసాగుతుండటం మొత్తంగా మార్కెట్ బలహీనతను సూచిస్తోంది. ప్రస్తుతం రిఫైనరీ, షిప్‌బిల్డింగ్, టెక్స్‌టైల్స్ రక్షణ రంగ షేర్లకు డిమాండ్ కనిపిస్తోంది.

స్టాక్ రికమండేషన్స్

తేజస్ నెట్‌వర్క్: రెండేళ్లుగా డౌన్‌ట్రెండ్‌లో పయనిస్తున్న ఈ షేరు ప్రస్తుతం అక్యుములేషన్ జోన్‌లో ఉంది. మార్చి నుంచి బేస్ ఏర్పడుతోంది. కీలకమైన రూ.650 స్థాయిలో రెండోసారి మద్దతు తీసుకున్నాయి. గత శుక్రవారం రూ.704 స్థాయిలో ముగిసిన ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.700 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.810 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.670 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

రైల్‌టెల్: గత ఆరు నెలల్లో 25 శాతం మేర దిద్దుబాటుకు లోనైన ఈ షేరులో రూ.290 స్థాయిలో మంచి బేస్ ఏర్పడుతోంది. ఇక్కడ మంచి డిమాండ్ కనిపిస్తోంది. 20,50 రోజుల మూవింగ్ యావరేజ్‌ను అధిగమించింది. గత శుక్రవారం 6.7 శాతం లాభంతో రూ.316 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.300 శ్రేణిలో ప్రవేశించి రూ.370 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.275 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఎస్‌బీఐ కార్డ్స్: స్వల్పకాలికంగా చూస్తే ఈ కౌంటర్‌లో మూమెంటమ్ కాస్త తగ్గింది. అయితే మీడియం టర్మ్‌లో బలాన్ని ప్రదర్శిస్తోంది. తాజాగా కీలకమైన రూ.860 స్థాయికి చేరుకుంది. గత శుక్రవారం రూ.878 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.850 పై స్థాయిలో పొజిషన్ తీసుకుని రూ.980 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.835 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

హిందాల్కో: ఏడాది కాలంగా అంతగా పనితీరు కనబరచని ఈ షేరు ప్రస్తుతం కీలకమైన డిమాండ్ జోన్‌లోకి వచ్చింది. రూ.600 పై స్థాయిలో టైట్ ప్రైస్ యాక్షన్‌తో చలిస్తోంది. మీడియం టర్మ్ మూమెంటమ్ బాగుంది. గత శుక్రవారం రూ.632 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.600 శ్రేణిలో ప్రవేశించి రూ.740 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.675 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఎస్‌బీఐ: ప్రస్తుతం ఈ షేరు మంచి మూమెంటమ్, బలాన్ని ప్రదర్శిస్తోంది. తాజాగా మూడు నెలల గరిష్ఠాన్ని అధిగమించిన ఈ షేరు 20 రోజుల మూవింగ్ యావరేజెస్ పైన నిలదొక్కుకుంది. గత శుక్రవారం రూ.800 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.780 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.860 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.755 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.



- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

24,500 పైన నిలకడ తప్పనిసరి

టెక్ వ్యూ



వి. సుందర్ రాజా

నిఫ్టీ ఎట్టకేలకు గత వారం కీలక స్థాయి 24,500 దాటి మరింత పురోగమించినా శుక్రవారం నాడు గరిష్ఠ స్థాయిల్లో ఇంట్రాడే కరెక్షన్‌తో అప్రమత్త సంకేతం ఇచ్చింది. వారం మొత్తానికి 310 పాయింట్ల లాభంతో 24,350 వద్ద ముగిసింది. 24,500 వద్ద కన్సాలిడేషన్, సైడ్‌వేస్ ధోరణిని ప్రదర్శిస్తోంది. ప్రస్తుతం గత డిసెంబరు నాటి గరిష్ఠ స్థాయిలకు చేరువలో ఉంది. నిఫ్టీ వరుసగా గత 15 రోజులుగా నిరంతర ర్యాలీలో ఉన్నందు వల్ల కరెక్షన్ ఏర్పడవలసిన అవసరం ఉంది. అమెరికన్ మార్కెట్లలో గత శుక్రవారం నాటి ర్యాలీ కారణంగా ఈ వారం పాజిటివ్‌గానే ప్రారంభం కావచ్చు. ఈ క్రమంలో మరోసారి 24,500 వద్ద పరీక్ష ఎదుర్కొనే ఆస్కారం ఉంది.

బుల్లిష్ స్థాయిలు: పాజిటివ్ ట్రెండ్‌లో ట్రేడయితే అప్‌ట్రెండ్ కోసం కీలక స్థాయి 24,500 కన్నా పైన నిలదొక్కుకోవడం తప్పనిసరి. మరో నిరోధం 24,800. ప్రధాన నిరోధం 25,000. ఇక్కడ కన్సాలిడేషన్‌కు ఆస్కారం ఉంది.

బేరిష్ స్థాయిలు: 24,500 వద్ద విఫలమైతే బలహీనత ముప్పును ఎదుర్కొంటుంది. దిగువన మద్దతు స్థాయి 24,300. భద్రత కోసం ఇక్కడ నిలదొక్కుకోవాలి. విఫలమైతే మరింత బలహీనపడుతుంది. దిగువ మద్దతు స్థాయిలు 23,150, 23,000.

బ్యాంక్ నిఫ్టీ: ఈ సూచీ గత వారంలో సైడ్‌వేస్‌లో కదలాడుతూ 450 పాయింట్ల లాభంతో వారం మధ్య స్థాయి 55,100 వద్ద ముగిసింది. ఎగువన నిరోధ స్థాయిలు 55,600, 56,000. మరింత సానుకూలత కోసం 56,000 కన్నా పైన నిలదొక్కుకోవాలి. మద్దతు స్థాయి 55,000. ఇక్కడ నిలదొక్కుకోవడంలో విఫలమైతే అప్రమత్త సంకేతం ఇస్తుంది.

పాటర్న్: మార్కెట్ గత వారం 200 డీఎంఏ కన్నా పైన ముగిసింది. పుల్‌బ్యాక్ రియాక్షన్ ఏర్పడి ఈ స్థాయిలో నిలదొక్కుకోలేకపోతే అప్రమత్త సంకేతం ఇస్తుంది. ట్రెండ్‌లో మరింత సానుకూలత కోసం 24,500 వద్ద "అడ్డంగా ఏర్పడిన సపోర్ట్ ట్రెండ్‌లైన్" కన్నా పైన నిలదొక్కుకోవాలి.

టైమ్: ఈ సూచీ ప్రకారం మంగళవారం తదుపరి రివర్సల్ ఉంది.

సోమవారం స్థాయిలు	
నిరోధం	24,500, 24,560
మద్దతు	24,360, 24,300

24,000 దిగువన బేరిష్

(మే 5-9 తేదీల మధ్య వారానికి)



డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

ఆస్ట్రో ట్రెండ్

నిఫ్టీ గత వారం 24,062-24,589 పాయింట్ల మధ్యన కదలాడి 308 పాయింట్ల లాభంతో 24,347 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 24,000 కన్నా దిగువన ముగిస్తే స్వల్పకాలానికి బేరిష్ అవుతుంది.

● 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 24,351, 24,270, 23,812, 23,500 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి.

బ్రేకౌట్ స్థాయి: 24,650 **బ్రేక్‌డౌన్ స్థాయి:** 23,950

నిరోధ స్థాయిలు: 24,550, 24,650, 24,750 (24,450 పైన బుల్లిష్)

మద్దతు స్థాయిలు: 24,150, 24,050, 23,950 (24,250 దిగువన బేరిష్)

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	140	విజయవాడ	142
వరంగల్	140	గుంటూరు	140
కరీంనగర్	140	ఒంగోలు	140
మహబూబ్‌నగర్	140	చిత్తూరు	110
కర్నూలు	140	నెల్లూరు	115
విశాఖపట్నం	141	అనంతపురం	115
గోదావరి	142		

పోలవరంలో నేటి నుంచే నిపుణుల పర్యటన

- దయాఫ్రం వాల్ పనుల్లో నాణ్యత పరిశీలన
- ఈసీఆర్‌ఎఫ్ డ్యాంపై సమీక్ష
- 8 దాకా ప్రాజెక్టు వద్దే అమెరికా, కెనడా నిపుణులు
- వెంట జలసంఘం, పీపీఏ, వాప్కోస్, జలవనరుల శాఖ అధికారులు కూడా

అమరావతి, మే 4 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు ప్రధాన డ్యాం పనుల్లో అత్యంత కీలకమైన డయాఫ్రం వాల్ నిర్మాణం.. ఎర్త్ కమ్ రాక్‌ఫిల్ (ఈసీఆర్‌ఎఫ్) డ్యాం పనులు త్వరితగతిన ముందుకు సాగడంపై అంతర్జాతీయ నిపుణులు దిశానిర్దేశం చేయనున్నారు. వీరు ప్రాజెక్టు ప్రాంతంలో సోమవారం నుంచి 8వ తేదీ దాకా మకాం వేసి వాల్ పనుల్లో నాణ్యత, ఈసీఆర్‌ఎఫ్ డ్యాం డిజైన్లు పరిశీలిస్తారు. సలహాలు, సూచనలు ఇస్తారు. అమెరికాకు చెందిన డేవిడ్ బి.పాల్, జియాన్ ఫ్రాంకో డి సిక్కో.. కెనడాకు చెందిన సీన్ హెంచ్‌బెర్గర్, రిచర్డ్ డొనెల్లీ ఆదివారం రాజమహేంద్రవరం చేరుకున్నారు. గురువారం వరకూ ప్రాజెక్టు వద్దే ఉంటారు. వారి వెంట కేంద్ర జల సంఘం, పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ), సెంట్రల్ సాయిల్ అండ్ మెటీరియల్ రీసెర్చ్ స్టేషన్ (సీఎస్ఎంఆర్ఎస్), వాప్కోస్, రాష్ట్ర జలవనరుల శాఖ, అధికారులు, కాంట్రాక్టు సంస్థల ప్రతినిధులు పాల్గొంటారు. సమీక్షల్లో పాలుపంచుకుంటారు. నిపుణులు సోమవారం ఉదయం వాల్ పనులు పరిశీలిస్తారు. ఎగువ కాఫర్ డ్యాంను పటిష్ఠపరిచే చర్యలు, గ్రౌండ్ ఇంప్రూవ్‌మెంట్ పనులను పరిశీలిస్తారు. మంగళవారం ఈసీఆర్‌ఎఫ్ డ్యాం నిర్మాణంలో అత్యంత కీలకమైన గ్యాప్-1లో చేపట్టాల్సిన నిర్మాణ విధివిధానాలు, ఆ ప్రాంతంలో నేల గట్టిదనాన్ని పరిశీలిస్తారు. తర్వాత ఈసీఆర్‌ఎఫ్ డిజైన్లపై జల సంఘం, సీఎస్ఎంఆర్ఎస్, వాప్కోస్‌లతో సమీక్షించి.. తమ అభిప్రాయాలు, ఆలోచనలు పంచుకుంటారు. మధ్యాహ్నం గ్యాప్-1లో చేపడుతున్న పనులపై చేపట్టిన నమూనా పరీక్షల ఫలితాలపై అభిప్రాయం చెబుతారు. ఈసీఆర్‌ఎఫ్ డ్యాం నిర్మాణం కోసం సమీకరించిన మెటీరియల్‌ను పరిశీలిస్తారు. బుధవారంనాడు గ్యాప్-2లో చేపట్టాల్సిన పనులను సమీక్షించి, తగు సూచనలూ ఇస్తారు. పర్యటనలో చివరి రోజైన గురువారం కేంద్ర జల సంఘం రూపొందించిన 'ప్రిమావేరా' యాప్‌కు అనుగుణంగా పోలవరం ప్రాజెక్టు ఇంజనీరింగ్ అధికారులు క్రమపద్ధతిలో పనులు చేపడుతున్నారో లేదో నిపుణులు పరిశీలిస్తారు. కుంగిపోయిన గైడ్‌బండ్ లోపాల సవరణకు శాశ్వత పరిష్కార మార్గాలను సూచిస్తారు. అప్రోచ్ చానల్‌పైనా తమ అభిప్రాయం చెబుతారు. డయాఫ్రం వాల్, ఈసీఆర్‌ఎఫ్ డ్యాం పనుల కోసం చేపట్టిన కార్యాచరణ గురించి వారికి ఈఎన్‌సీ ఎం.వెంకటేశ్వరరావు, పోలవరం ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్ నరసింహమూర్తి వివరిస్తారు. అమెరికా, కెనడా నిపుణులు ఇచ్చే సూచనలు 2027 డిసెంబరు నాటికి ప్రాజెక్టు నిర్మాణం పూర్తయ్యేందుకు దోహదపడతాయన్న విశ్వాసాన్ని జలవనరుల శాఖ అధికారులు వ్యక్తం చేస్తున్నారు.





వైసీపీ నేతలను కోర్టుకు తరలిస్తున్న పోలీసులు

కుంటిమద్ది హెలిప్యాడ్ ఘటనలో..

10 మంది వైసీపీ నేతల అరెస్టు

బెయిల్ మంజూరుచేసిన కోర్టు

- మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి కోసం పోలీసుల గాలింపు

చెన్నేకొత్తపల్లి, మే 4 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డి పర్యటన సందర్భంగా శ్రీసత్యసాయి జిల్లా రామగిరి మండలం కుంటిమద్దిలో హెలిప్యాడ్ వద్ద జరిగిన ఘటనలో పది మంది వైసీపీ నాయకులను పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. వీరిలో శ్రీసత్యసాయి జిల్లా చెన్నేకొత్తపల్లి మండలానికి చెందిన ఏడుగురు, రామగిరి మండలవాసులు ముగ్గురు ఉన్నారు. వీరిని ధర్మవరం ప్రభుత్వాస్పత్రిలో వైద్యపరీక్షల అనంతరం సాయంత్రం న్యాయాధికారి వెంకటేశ్వర్లు ఎదుట హాజరుపరిచారు. ఒక్కొక్కరికీ రూ.10వేల సొంత పూచీకత్తులో ఆయన బెయిల్ మంజూరు చేశారు. ఈ కేసులో మరికొంతమంది నిందితులను త్వరలో అరెస్టు చేస్తామని రామగిరి సీఐ శ్రీధర్ తెలిపారు. కాగా.. ఈ కేసులో ఏ-1 నిందితుడిగా ఉన్న వైసీపీ మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి కోసం రెండు ప్రత్యేక పోలీసు బృందాలు రంగంలోకి దిగాయి. హైదరాబాద్, విజయవాడ, బెంగళూరు నగరాల్లో ముమ్మరంగా గాలిస్తున్నట్లు తెలిసింది. అజ్ఞాతంలోకి వెళ్లిపోయిన తోపుదుర్తి ముందస్తు బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించగా.. విచారణ జరుగుతోంది. హెలికాప్టర్ పైలట్ అనిల్‌కుమార్ రెండుసార్లు పోలీసుల విచారణకు గైర్హాజరు కావడం విమర్శలకు దారితీశాయి. ఈ నేపథ్యంలోనే దర్యాప్తులో పోలీసుల అలసత్వంపై డీజీపీ కార్యాలయం ఆగ్రహంతో ఉన్నట్లు సమాచారం. బాధ్యులైన అధికారులెవరో విచారించి నివేదిక ఇవ్వాలని జిల్లా ఎస్పీ రత్నను ఆదేశించినట్లు తెలిసింది. కాగా.. 10 మంది వైసీపీ నేతలను అరెస్టుచేయడంతో ఆ పార్టీ మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ ఉదయాన్నే రామగిరి సర్కిల్ స్టేషన్ వద్దకు చేరుకున్నారు. స్టేషన్ ఆవరణలోనే తిష్టవేశారు. కార్యకర్తలు గుమికూడుతుండడంతో పోలీసులు.. అక్కడి నుంచి వెళ్లిపోవాలని మాధవ్‌కు సూచించారు. దీంతో ఆయన వెళ్లిపోయారు. మాజీ మంత్రి, జిల్లా వైసీపీ అధ్యక్షురాలు ఉషశ్రీ అరగంటపాటు స్టేషన్‌లోనే ఉన్నారు.

● చౌకబారు విమర్శలను..

తిప్పికొట్టండి

టీడీపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, నాయకులతో సీఎం చంద్రబాబు



భగీరథ మహర్షి జయంతిని పురస్కరించుకుని ఆదివారం ఉండవల్లిలోని ముఖ్యమంత్రి నివాసంలో భగీరథుడి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీఎం చంద్రబాబు

(మొదటి పేజీ తరువాయి)

వేగంగా అభివృద్ధి చెందుతోందని, అదే మోడల్ ఆంధ్రలోనూ అమలవ్వాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఆదివారం ఆయన టీడీపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, నాయకులు, కార్యకర్తలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెలలోనే అన్నదాతా సుఖీభవ పథకాన్ని ప్రారంభిస్తున్నామని.. పాఠశాలలు తెరవడానికి ముందే జూన్ మొదటి వారంలో తల్లికి వందనం కింద.. చదువుకునే పిల్లలకు రూ.15 వేలు అందిస్తామని స్పష్టం చేశారు. సూపర్-6 హామీలు అమలు చేయడంతోపాటు ఆర్థిక, ఆర్థికేతర అంశాలను పరిష్కరిస్తున్నామన్నారు. 'కార్పొరేషన్ ఛైర్మన్లు, డైరెక్టర్లు, కో-ఆపరేటివ్, ఏఎంసీ ఛైర్మన్ల నామినేటెడ్ పదవుల్లో అధిక శాతం భర్తీ చేశాం. మిగిలినవి కూడా త్వరలోనే పూర్తి చేస్తాం. సామాజిక న్యాయం పాటించి పదవులకు ఎంపిక చేస్తున్నాం. పార్టీ సంస్థాగత ఎన్నికలు కూడా నిర్వహించుకుంటున్నాం. రాష్ట్ర కమిటీలు మినహా అన్నిటి నియామకాలు ఈ నెల 18 నాటికి పూర్తవ్వాలి. ఈసారి మహానాడు కడపలో 27, 28, 29 తేదీల్లో నిర్వహించుకుంటున్నాం. ఆ తర్వాత రాష్ట్ర కమిటీని పూర్తి చేస్తాం. దేశంలో ఎక్కడా లేని విధంగా పార్టీ సభ్యత్వాలు నమోదయ్యాయి. సభ్యత్వం తీసుకున్న వారికి కార్డులు కూడా వీలైనంత త్వరగా పంపిణీ చేయాలి. ప్రభుత్వానికి ఇచ్చినంత ప్రాధాన్యం పార్టీకి కూడా ఇస్తున్నా' అని తెలిపారు.

అమరావతి సభ భేష్..

అమరావతి పనుల పునఃప్రారంభ కార్యక్రమం చాలా బాగా జరిగిందన్న చంద్రబాబు.. సభ విజయవంతానికి కృషి చేసిన కార్యకర్తలు, నాయకులందరినీ అభినందించారు. 'ప్రధాని మోదీ రాష్ట్రానికి గతంలో చాలాసార్లు వచ్చినప్పటికీ ఈసారి వాటన్నింటినీ మరిపించేలా ఈ సభ జరిగింది. రాజధాని పనుల పునఃప్రారంభ కార్యక్రమంతో దేశం, ప్రపంచం దృష్టి అమరావతిపైకి మళ్లింది. అమరావతి ఆవశ్యకతను తెలియజేసేందుకు, పూర్వవైభవం తీసుకొచ్చేందుకు ప్రధాని చేతుల మీదుగా పునఃప్రారంభించాం. వికసిత్ భారత్-2047కు అమరావతి బలమైన పునాదిగా మారుతుందని ప్రధాని చేసిన వ్యాఖ్యలు.. ప్రజారాజధాని నిర్మాణం ఇబ్బందుల్లేకుండా ముందుకెళ్తుందనడానికి సంకేతం. రాష్ట్రాన్ని పునర్నిర్మిస్తామని ప్రధాని మోదీ, నేను, పవన్ కల్యాణ్ ఎన్నికల సమయంలో చెప్పాం. చెప్పినట్టుగానే గతితప్పిన రాష్ట్రాన్ని గాడినపెట్టాం. పోలవరానికి నిధులు రాబట్టి 2027 నాటికి పూర్తిచేసే లక్ష్యంతో పనిచేస్తున్నాం. మూతబడే స్థితిలో ఉన్న విశాఖ స్టీల్ ప్లాంట్‌కు ఊపిరిపోసి.. కేంద్రం రూ.11,400 కోట్లు కేటాయించేలా చేశాం. ఉత్తరాంధ్రవాసుల కల రైల్వేజోన్ సాధించాం. రాష్ట్రానికి పెద్దఎత్తున పెట్టుబడులు తీసుకొస్తున్నాం. బీపీసీఎల్, ఆర్సెలార్ మిట్టల్, సీమలో గ్రీన్ ఎనర్జీ ప్లాంట్స్, ఓర్వకల్లు, కొప్పర్తి ఇండస్ట్రియల్ పార్కులను ఏర్పాటు చేసుకుంటున్నాం. లేపాక్షి-కొప్పర్తి కారిడార్ తీసుకొస్తాం. ఇటీవల 11 నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కులు ప్రారంభించాం. త్వరలో అన్ని నియోజకవర్గాల్లోనూ ఏర్పాటు చేస్తాం. ప్రతి నెలా 1వ తేదీనే పేదలకు పింఛన్లు ఇస్తున్నాం. 16,347 ఉపాధ్యాయ పోస్టులకు డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేశాం. దీపం-2 కింద కోటి మందికి ఏటా 3 గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నాం. మత్స్యకారుల సేవలో పథకంలో భాగంగా కుటుంబానికి రూ.20 వేలు ఇచ్చాం' అని వివరించారు.

క్రియేటర్ ల్యాండ్‌పై సీఎం హర్షం

క్రియేటివ్ ల్యాండ్ ఏసియాతో రాష్ట్రప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకోవడంపై ముఖ్యమంత్రి హర్షం వ్యక్తంచేశారు. చరిత్రాత్మక ఎంవోయూ ద్వారా దేశంలోని మొట్టమొదటి ట్రాన్స్‌మీడియా ఎంటర్‌టైన్‌మెంట్ సిటీ అయిన క్రియేటర్ ల్యాండ్‌ను అమరావతిలో నెలకొల్పనున్నట్లు 'ఎక్స్'లో తెలిపారు. దీని ద్వారా 25 వేల ఉద్యోగాలను సృష్టించడంతోపాటు విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను గణనీయంగా ఆకర్షించడమే లక్ష్యమన్నారు. అమరావతిలో భారతదేశ సృజనాత్మక పరిశ్రమకు ఇది ఉత్తేజకరమైన పరిణామమని.. సినిమా, గేమింగ్, సంగీతం, వర్చువల్ ప్రొడక్షన్, ఇమ్మర్సివ్ స్టోరీ టెల్లింగ్, ఏఐ ఆధారిత కంటెంట్‌పై దృష్టి సారించి, స్థానిక ప్రతిభను వెలికితీసేందుకు క్రియేటర్ ల్యాండ్ దోహదపడుతుందన్నారు.



అభిమానులు బహూకరించిన గదతో ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ

ఎన్టీఆర్‌కు 'భారతరత్న' ఇవ్వాల్సిందే

ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ

హిందూపురం, మే 4(ఆంధ్రజ్యోతి): దివంగత ముఖ్యమంత్రి, తన తండ్రి నందమూరి తారకరామారావుకు భారతరత్న పురస్కారం ఇవ్వాల్సిందేనని ఎమ్మెల్యే బాలకృష్ణ అన్నారు. పద్మభూషణ్ అవార్డు అందుకున్న సందర్భంగా శ్రీసత్యసాయి జిల్లా హిందూపురంలోని ఎంజీఎం క్రీడా మైదానంలో ఆదివారం ఆయనకు పౌరసన్మాన సభ ఏర్పాటు చేశారు. టీడీపీ నాయకులు, అభిమానులు ప్రత్యేకంగా తయారు చేయించిన వెండి సింహాసనం, గద, కత్తి, పిల్లనగ్రోవిని బహూకరించారు. బాలకృష్ణ మాట్లాడుతూ.. తాను ఎమ్మెల్యేగా హ్యాట్రిక్ విజయం సాధించానని, అది హిందూపురం ప్రజల విజయమని అన్నారు. తనకు పద్మభూషణ్ ప్రదానం చేసినందుకు కేంద్రానికి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఎన్టీఆర్‌కు భారతరత్న అవార్డు ఇచ్చి వారిని వారే గౌరవించుకోవాలని కేంద్ర ప్రభుత్వ పెద్దలను కోరారు. అనంతరం మంత్రి సవిత, ఎమ్మెల్యేలు పరిటాల సునీత, కందికుంట వెంకట ప్రసాద్, పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి తదితరులు బాలకృష్ణను ఘనంగా సత్కరించారు.

డబ్బులిస్తేనే ప్రమోషన్లా..!

- అధికారులకు ఇచ్చి.. సిబ్బందికి ఇవ్వని వైనం
- లంచాలు ఇచ్చుకోలేం అంటూ సిబ్బంది ఆవేదన
- ఆర్టీసీ చరిత్రలో ఎన్నడూ వసూళ్లు లేవని ఆగ్రహం

అమరావతి, మే 4 (ఆంధ్రజ్యోతి): "ప్రయాణికుల్ని భద్రంగా గమ్యం చేరుస్తాం.. రేయింబవళ్లు డ్యూటీ చేస్తాం.. మేం పదోన్నతులకు అర్హులం కాదా..? ప్రమోషన్ల కోసం ఆరేళ్లుగా ఎదురు చూస్తున్నాం.. చివరకు ఆ ఆశ తీరకుండానే రిటైర్ అవుతున్నాం. మా గోడు పట్టించుకోరా.." అంటూ ప్రజా రవాణా సంస్థ (పీటీడీ) సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు పదోన్నతులు కల్పించి... సిబ్బంది ఫైలును మాత్రం పక్కన పడేసిన ఉన్నతాధికారుల తీరుపై మూడు వేల మంది మండిపడుతున్నారు. తాము లంచాలు ఇచ్చుకోలేమంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏపీఎస్ఆర్టీసీలో ఎప్పటికప్పుడు పదోన్నతులు పొందే సిబ్బందికి.. ప్రభుత్వంలో విలీనంతో గత ఆరేళ్లుగా బ్రేకులు పడ్డాయి. వైసీపీ ప్రభుత్వంలో నాలుగేళ్లుగా ప్రమోషన్ల కోసం అసోసియేషన్లు ఎన్ని వినతులిచ్చినా సర్కారు నుంచి స్పందన రాలేదు. కార్పొరేషన్‌గా ఉన్నప్పుడు మెరిట్ రేటింగ్ రిపోర్ట్ (ఎంఆర్ఆర్) ఆధారంగా ఎప్పటికప్పుడు వచ్చే ప్రమోషన్లకు.. ప్రభుత్వంలో ఉన్న వార్షిక రహస్య నివేదిక (ఏసీఆర్) మార్గదర్శకాలు అడ్డుపడ్డాయి. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చిన తర్వాత ఆర్టీసీ ఉన్నతాధికారులు తమ ప్రమోషన్ల కోసం రవాణాశాఖ ద్వారా పదోన్నతుల కమిటీ (డీపీసీ)కి ఫైలు పంపించారు. ఏడాది నిరీక్షణ తర్వాత ఈ ఫైలు కదలికలో భారీగా డబ్బులు చేతులు మారినట్లు ఆర్టీసీ హౌస్‌లో చర్చ జరుగుతోంది. కనీసం 30 వేల నుంచి లక్ష రూపాయల వరకూ ఇచ్చిన తర్వాతే ప్రమోషన్లకు ఆమోదం లభించిందని, అలా ఇవ్వనంత వరకూ ఏదో ఒక అభ్యంతరం చెబుతూ జాప్యం చేశారని బహిరంగంగా చెబుతున్నారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం పదోన్నతుల్లో ఏసీఆర్ ప్రధానమంటూ ఆపేసి.. డబ్బులు చేతులు మారిన తర్వాత ప్రభుత్వ అనుమతి తీసుకుని ఈ ఒక్కసారికి ఎంఆర్ఆర్‌ను పరిగణలోకి తీసుకున్నట్లు చెబుతున్నారు. అయితే డిపో మేనేజర్ నుంచి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వరకూ ఆరు కేటగిరీల్లోని 110 మంది అధికారులకు ఈ నెల 2న ప్రభుత్వం పదోన్నతులు ఇచ్చింది. సిబ్బందికి సంబంధించిన ప్రమోషన్ల ఫైలులో మాత్రం కదలిక లేదు. రాష్ట్రవ్యాప్తంగా 129 బస్ డిపోల పరిధిలో ఏడీ, పీడీ, ఎంఈడీ, ఓపీడీ విభాగాల్లో మూడు వేల మంది సిబ్బంది ప్రమోషన్ల కోసం ఆరేళ్లుగా ఎదురు చూస్తున్నారు. కండక్టర్ నుంచి ఎస్టీఐ దాకా.. జూనియర్ అసిస్టెంట్ నుంచి సూపరింటెండెంట్ వరకూ ప్రమోషన్లు వస్తాయని ఎదురు చూసిన 3వేల మంది తమపై ఎందుకింత వివక్ష అంటూ ఆవేదనతో ప్రశ్నిస్తున్నారు. ఏపీఎస్ఆర్టీసీ చరిత్రలో ప్రమోషన్లకు లంచాలు ఇవ్వడం ఎప్పుడూ లేదని అంటున్నారు. ఏ ఫైలు అయినా 48 గంటల్లో కదలాలని చెబుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు తమపై దయ చూపించి ప్రమోషన్లు వచ్చేలా చూడాలని వారు కోరుతున్నారు.

టీడీపీ మహానాడుకు శ్రీకారం

- ఈ నెల 27-29 వరకు పసుపు పండుగ
- కడపలోని కమలాపురం నియోజకవర్గం చింతకొమ్మదిన్నెలో ఏర్పాట్లు ప్రారంభం
- టెంకాయ కొట్టి భూమి చదును పనులు ప్రారంభించిన తెలుగుదేశం పార్టీ నేతలు

సీకేదిన్నె, మే 4(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే 'మహానాడు'కు ఆ పార్టీ నాయకులు శ్రీకారం చుట్టారు. ఈ ఏడాది మహానాడును కడప జిల్లా, కమలాపురం నియోజకవర్గంలోని చింతకొమ్మదిన్నె పరిధిలో నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో మహానాడు ప్రాంగణంలో కమలాపురం ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్. శ్రీనివాసరెడ్డిల ఆధ్వర్యంలో ఆదివారం పనులను ప్రారంభించారు. మహానాడుకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి లక్షలాదిగా కార్యకర్తలు తరలివచ్చే అవకాశం ఉంది. దానిని దృష్టిలో ఉంచుకుని సభా ప్రాంగణం, ఇతర ఏర్పాట్లను దాదాపు 20 రోజుల ముందుగానే ప్రారంభించారు. చింతకొమ్మదిన్నె మండలంలోని చెర్లోపల్లె పొలంలో రింగ్ రోడ్డుకు ఆనుకుని ఉన్న 120 ఎకరాల్లో స్థలాన్ని చదును చేసే పనులు మొదలుపెట్టారు. ఈ నెల 27, 28, 29 తేదీల్లో మహానాడు నిర్వహించేందుకు సీఎం చంద్రబాబు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో ఇంతవరకు స్థల పరిశీలన కోసం ఎదురుచూస్తున్నారు. అయితే, స్థలం ఎంపిక పూర్తి కావడంతో సభావేదిక, భోజనశాలలు తదితర అవసరాల నిమిత్తం 120 ఎకరాల్లో ఏర్పాట్లు చేస్తున్నారు. స్థానిక నాయకుల సహకారంతో పనులు వేగవంతంగా పూర్తి చేసేందుకు ఎమ్మెల్యే చైతన్యరెడ్డి రంగంలోకి దిగారు. కడప జిల్లాలో తొలిసారి నిర్వహిస్తున్న మహానాడును దిగ్విజయం చేసేందుకు నాయకులు కలసికట్టుగా ముందుకు సాగుతున్నారు.



మహానాడు వేదిక స్థలాన్ని పరిశీలిస్తున్న పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే చైతన్యరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి హరిప్రసాద్, తదితరులు

అందరికీ అనుకూల ప్రదేశం

మహానాడుకు ఎంపిక చేసిన స్థలం అందరికీ అనుకూలమైన ప్రదేశంగా భావిస్తున్నారు. కడప నగరానికి 10 కిలోమీటర్ల లోపు ఉంది. రింగ్ రోడ్డులో వాహనాల పార్కింగ్‌కు, దాదాపు 25-30 వేల వరకు వచ్చే ప్రతినిధులకు బస ఏర్పాటు చేసేందుకు కూడా సమీపంలో కల్యాణ మండపాలు, విద్యాసంస్థలు ఉండడంతో అనుకూలంగా ఉంటుందని నాయకులు భావిస్తున్నారు. రవాణా శాఖ కార్యాలయం సమీపంలో.. పులివెందుల రోడ్డు సాక్షి సర్కిల్ వద్ద, ఇతర ప్రదేశాల్లో పార్కింగ్ కోసం స్థలాలను పరిశీలించి ఎటువైపు నుంచి వచ్చే వాహనాలను అటువైపే పార్కింగ్ చేసి ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూసేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు ఏర్పాట్లు చేస్తున్నారు.



అమరావతి పునర్నిర్మాణంపై సౌదీలో సంబరాలు

ప్రధాని మోదీ చేతుల మీదుగా జరిగిన అమరావతి పునర్నిర్మాణ పనుల ప్రారంభంపై సౌదీ అరేబియాలోని ప్రవాసాంధ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమానికి వెళ్లలేకపోయిన అనేక మంది తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి అభిమానులు రియాధ్ నగరంలో శనివారం సాయంత్రం సంబరాలు చేసుకున్నారు. టీడీపీ నేత జానీ బాషా ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

- (ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

యుద్ధం వద్దే వద్దు: సీపీఐ నారాయణ



తిరుపతి, మే 4 (ఆంధ్రజ్యోతి): 'పహల్గాం ఉగ్రదాడి అనంతరం పరిణామాలను పరిశీలిస్తే రెండు దేశాలు యుద్ధానికి కాలు దువ్వుతున్నట్లు తెలుస్తోంది. యుద్ధమే వస్తే ఆస్తి, ప్రాణ నష్టం జరుగుతుంది. పాకిస్థాన్‌పై యుద్ధం కాకుండా ఉగ్రవాదాన్ని అణచివేయడం వల్ల ప్రయోజనం ఉంటుంది' అని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ అభిప్రాయపడ్డారు. 'లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక' ఆధ్వర్యంలో తిరుపతిలో ఆదివారం జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో నారాయణ మాట్లాడారు. ఉగ్రవాదాన్ని అణచివేయడానికి కేంద్ర ప్రభుత్వం మన దేశ శక్తి సామర్థ్యాలను కూడగట్టుకొని ముందుకు సాగాలన్నారు. మనది లౌకిక దేశమన్న విషయాన్ని పాలకులు దృష్టిలో ఉంచుకుని నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. తమ అధికారాన్ని కాపాడుకోవడానికి, మైనారిటీలను బూచిగా చూపి, ఉగ్రవాదం అన్న సాకుతో యుద్ధం ప్రకటించి ప్రజల మన్ననలు పొందాలని కేంద్రంలోని పాలకులు చూస్తున్నారని ఆరోపించారు. పాకిస్థాన్‌లోను, భారత్‌లోనూ ప్రజలు యుద్ధం కోరుకోవడం లేదన్న విషయాన్ని ప్రధాని మోదీ గ్రహించాలన్నారు.

విషం చిమ్ముదాం

(మొదటి పేజీ తరువాయి)

చేరినట్లు తెలిసింది. ప్రస్తుత ప్రభుత్వంలో తీవ్ర అసంతృప్తిగా ఉన్న వారు, ఇప్పటికే రిటైర్ అయి జగన్‌కోసం తెరవెనక పనిచేస్తున్న వారిని ఆ మాజీ ఐపీఎస్ పోగేశారు. ప్రతి వారాంతంలో హైటెక్ సిటీ సమీపంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో సమావేశాలు నిర్వహిస్తున్నారు. గతంలో హైదరాబాద్ రాయదుర్గంలోని ఓ ప్రముఖ అపార్ట్‌మెంట్‌ల సముదాయంలో వీరు భేటీ అయ్యేవారు. లిక్కర్, ఇసుక, సోషల్ మీడియా కేసుల్లో పలువురిని ఆ అపార్ట్‌మెంట్‌లోనే ఏపీ పోలీసులు అరెస్ట్ చేశారు. ఆ ప్రాంతంలో పోలీసుల నిఘా పెరగడంతో వేదిక మార్చేశారు. హైటెక్‌సిటీ ప్రాంతంలో ఓ ఫ్లాటు తీసుకొని అందులో భేటీ అవుతున్నారు.

అంతా పకడ్బందీగా...

'విష కూటమి' సభలు అత్యంత పకడ్బందీగా జరుగుతున్నాయి. అందుకు హాజరయ్యేవారెవరూ సెల్‌ఫోన్‌లు, ఇతర కమ్యూనికేషన్ పరికరాలు తీసుకెళ్లకూడదని షరతు విధించారు. అలాగే.. సొంత కార్లలో రావొద్దు. రిటైరైన వారిని, సర్వీసులో ఉన్న వారిని జగన్ ప్రేరేపిత సైన్యం తమ వాహనాల్లోనే 'పికప్ అండ్ డ్రాప్' ఉంటుంది. ఫోన్లు తెచ్చుకుంటే ట్రాక్ చేస్తారని... సొంత వాహనాల్లో వస్తే ఎవరైనా గుర్తిస్తారనే ఈ జాగ్రత్తలు. ఈ భేటీ అజెండా ఒక్కటే! కూటమి సర్కారు విశ్వసనీయతను దెబ్బతీయడం ఎలా? అనే అంశంపైనే చర్చ! ముఖ్యమంత్రి చంద్రబాబును అంత సులువుగా వేలెత్తి చూపలేరు! ఆ అవకాశమూ ఆయన ఇవ్వరు. దీంతో... చంద్రబాబు తనయుడు, మంత్రి లోకేశ్‌ను మరో ప్రధాన టార్గెట్‌గా చేసుకున్నారు. లోకేశ్ చూసే శాఖలు, అందులోని అంశాలను ప్రధానంగా ఎత్తిచూపాలన్నది వారి లక్ష్యం. లోపాలుంటే బయటపెట్టవచ్చు. వాటిని సరిదిద్దేందుకు ప్రభుత్వం కూడా సిద్ధమే. కానీ.. ఈ ముఠా ఉద్దేశం అదికాదు. అసత్యాలు, తప్పుడు గణాంకాలతో వండివార్చిన డేటా ఆధారంగా ఆరోపణలు, విమర్శలు చేయించడం, లేని అక్రమాలు జరుగుతున్నట్లుగా జగన్ సొంత మీడియా, వారి కూలి మీడియాలో ప్రచారం చేయించడం, ఆ తర్వాత వాటిని వైసీపీ సోషల్ మీడియాలో మరింత పబ్లిసిటీ కల్పించడం ఈ బృందం కార్యాచరణ!

అప్పుడూ ఇదే వ్యూహం...

2019 ఎన్నికల్లో టీడీపీ ఓడిపోవడానికి ప్రధాన కారణం... అప్పట్లో వైసీపీ చేసిన విష ప్రచారమే! ఎన్నికలకు ఏడాదిన్నర ముందు నుంచే... అంటే, 2017జూన్ నుంచే అఖిల భారత సర్వీసు అధికారులు, దిగువ, మధ్యశ్రేణి అధికారుల్లో 'జగన్ టీమ్'లు ఏర్పడి పనిచేశాయి. వైసీపీ నేతలు ఒక తప్పుడు రాజకీయ ఆరోపణ చేయడం... అది నిజమని నమ్మించేందుకు తటస్థ ముసుగులోని వ్యక్తులు పదేపదే అదే అబద్ధం చెప్పడం... ఉద్యోగులు, సామాన్య ప్రజలను తప్పుదారి పట్టించడం! ఇలా ఒక పద్ధతి ప్రకారం విష ప్రచారం సాగించి... 2019 ఎన్నికల్లో గెలిచారు. ఇప్పుడు... ప్రభుత్వం ఏర్పడి ఏడాదైనా తిరగకముందే అదే కసరత్తు మొదలుపెట్టారు. పాత వ్యూహాలనే ఆధునీకరించి అమలు చేయాలని భావిస్తున్నారు. కేవలం ఐఏఎస్‌లనే నమ్ముకుంటే పనికాదని భావించి... మధ్య, దిగువ శ్రేణిలో కొందరు అధికారులను తమవైపు తిప్పుకోవడంపై దృష్టిపెట్టినట్లు తెలిసింది.

ఒక్కొక్కరిపై ఇలా వల...

ప్రభుత్వంలో ఉన్న జగన్ అనుకూల అధికారుల ద్వారా కీలక సమాచారాన్ని తెప్పించుకుని... దాన్ని వక్రీకరించి ప్రజలను తప్పుదారి పట్టించడం ఈ ముఠా వ్యూహం. దీనికోసం ప్రభుత్వంలో ఓ మధ్యశ్రేణి అధికారిని తమ బుట్టలో వేసుకున్నారు. వచ్చే ఎన్నికల్లో జగన్ పార్టీ తరఫున అసెంబ్లీ సీటు ఇప్పిస్తామని హామీ ఇవ్వడంతో ఆ అధికారి రెచ్చిపోయి, మరికొందరిని తనలాగే మార్చే పనిలో పడ్డారు. ప్రభుత్వ పరిధిలో, ప్రత్యేకించి అమరావతి రాజధాని పరిధిలోని ప్రాజెక్టులు, ఇతర పనుల సమాచారాన్ని ఎప్పటికప్పుడు జగన్ ముఠాకు చేరవేస్తున్నాడు. దాని ఆధారంగానే వైసీపీ, జగన్ అనుకూల సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలతో కూడిన కంటెంట్‌ను వండుతున్నారు. జగన్ రోత పత్రికలోనూ అవే తప్పుడు కథనాలను అచ్చేస్తున్నారు. తాజాగా అమరావతిలో ప్రధాని నరేంద్ర మోదీ సభ విజయవంతంపై కూడా అబద్ధాలు, అసత్యాలతో కూడిన దాడిని కొనసాగించారు. జూన్ 12కు కూటమి ప్రభుత్వం పగ్గాలు చేపట్టి ఏడాది అవుతుంది. ఈ సందర్భంగా తమ దాడిని మరింత ముమ్మరం చేసేందుకు 'ముఠా' రంగం సిద్ధమవుతున్నట్లు తెలిసింది.



'బకింగ్ హాం'లో గుర్రపుడెక్కను తొలగించండి

సిబ్బందికి మంత్రి నారా లోకేశ్ ఆదేశం

అమరావతి, మే 4 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి నియోజకవర్గం కాజ-చినవడ్లపూడి మధ్యలో గల బకింగ్ హాం కాలువను మంత్రి నారా లోకేశ్ ఆదివారం పరిశీలించారు. కాలువలో పెద్దఎత్తున గుర్రపు డెక్క పేరుకుపోవడాన్ని గమనించారు. వర్షాకాలంలో రైతులకు ఇబ్బందులు కలగకుండా గుర్రపు డెక్కను తొలగించడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆయన ఆదేశించారు.





మంగళగిరి నియోజకవర్గం దుగ్గిరాలలో ఉన్న శ్రీమహంకాళి అమ్మవారి ఆలయ పునఃప్రతిష్ఠా కార్యక్రమంలో అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న మంత్రి నారా లోకేశ్ (ఇన్‌సెట్‌లో) లోకేశ్‌కు అమ్మవారి చిత్రపటాన్ని అందిస్తున్న అర్చకులు

కేంద్రమే మౌలిక సదుపాయాలు కల్పించాలి

» పీసీసీ చీఫ్ షర్మిల డిమాండ్



అమరావతి, మే 4(ఆంధ్రజ్యోతి): అమరావతిపై ప్రధాని మోదీ మాటలు కాలని చిచ్చుబుడ్డిలా తుస్సుమనిపించాయని పీసీసీ అధ్యక్షురాలు షర్మిల వ్యాఖ్యానించారు. మోదీ ఈసారైనా అమరావతిని కట్టేనా లేదా మళ్లీ మట్టేనా? అంటూ ఆదివారం 'ఎక్స్‌'లో పోస్టు చేశారు. రాజధాని అమరావతి పునఃనిర్మాణానికి వచ్చిన ప్రధానికి తన కర్తవ్యాన్ని గుర్తుచేసేందుకు మట్టిని పంపిస్తున్నామని తెలిపారు. రాజధానిలో మౌలిక సదుపాయాలను కేంద్రం కల్పించాల్సిందేనని డిమాండ్ చేశారు. అమరావతి నిర్మాణానికి ఖర్చయ్యే లక్ష కోట్లలో ఒక్క రూపాయి కూడా ప్రధాని ప్రకటించలేదని ఆక్షేపించారు. ప్రపంచబ్యాంకు, ఏడీబీ, కేఎఫ్ ఎడబ్ల్యూ, హడ్కోల దగ్గర రాష్ట్రాన్ని ఎందుకు తాకట్టు పెడుతున్నారని ప్రశ్నించారు.తున్నారని ఆమె ప్రశ్నించారు.

4 వేల ఎకరాలు 80 వేల కోట్లు

(మొదటి పేజీ తరువాయి)

భావిస్తోంది. అలాగే రాజధానిలో చేపట్టాల్సిన వివిధ ప్రాజెక్టులకు నిధుల కొరతను కూడా వీటితో సమర్థంగా అధిగమించవచ్చని అంచనా వేస్తోంది.

బ్యాంకుల కన్సార్షియంతో చర్చలు

అమరావతి పునర్నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టిన నేపథ్యంలో అందుకు అదనంగా అవసరమైన నిధుల సమీకరణను చేపట్టే బాధ్యతలను సీఆర్‌డీఏకు రాష్ట్ర ప్రభుత్వం అప్పగించింది. ఈ క్రమంలో పలు బ్యాంకుల కన్సార్షియంతో సీఆర్‌డీఏ కమిషనర్ చర్చలు జరుపుతున్నారు. అమరావతి రాజధాని రూపురేఖలు మార్చడానికి మొత్తంగా రూ.77,250 కోట్లతో పనులు చేపట్టేందుకు సీఆర్‌డీఏ, ఏడీసీ సంయుక్తంగా ప్రణాళికలు సిద్ధం చేశాయి. రాజధానిలో రూ.49వేల కోట్ల విలువైన ప్రాజెక్టులకు ప్రధాని మోదీ చేతుల మీదుగా శుక్రవారం శంకుస్థాపన జరిగిన విషయం తెలిసిందే. ఇందులో రూ.15వేల కోట్లు కేంద్ర ప్రభుత్వ గ్యారంటీ కింద ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు(ఏడీబీ) నుంచి తీసుకున్నారు. ఈ రెండు సంస్థలూ ఆరేళ్ల పాటు దశలవారీగా నిధులు మంజూరు చేస్తుంటాయి. అలాగే, హడ్కో నుంచి రూ.11వేల కోట్ల రుణంగా తీసుకున్నారు. ఇది కూడా ఐదేళ్ల పాటు దశల వారీగా నిధులు విడుదల చేయనుంది. ఇవికాకుండా కేఎఫ్‌డబ్ల్యూ నుంచి రానున్న మరో రూ.5వేల కోట్ల రుణం కూడా కలిపితే అమరావతి ప్రాజెక్టు పనులకు మొత్తంగా రూ.31వేల కోట్ల మేర రుణాల రూపంలో నిధులు సర్దుబాటు కానున్నాయి.

లక్ష్యాలకు అనుగుణంగా నిధుల సమీకరణ



రాజధానిలో తలపెట్టిన బ్యాలెన్స్ పెండింగ్ ప్రాజెక్టుల పనులన్నింటినీ రెండేళ్లలోగా, ఐకానిక్ భవనాలను మూడేళ్లలోగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యాలను నిర్దేశించుకుంది. కేంద్ర ప్రభుత్వ గ్యారంటీపై రుణ సంస్థలు విడతల వారీగా ఇచ్చే నిధులతోనే పనులు చేయాలంటే కాలాతీతమయ్యే ప్రమాదం ఉంది. దీనిని దృష్టిలో ఉంచుకుని నిర్దేశించుకున్న ప్రాజెక్టులు, వాటిని పూర్తి చేయాల్సిన లక్ష్యాలకు అనుగుణంగా అదనంగా నిధులు సమీకరించుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. దీని కోసం మరో రూ.40వేల కోట్ల వరకు బ్యాంకుల కన్సార్షియం ద్వారా రుణాలు తీసుకునేందుకు సీఆర్‌డీఏ ప్రయత్నాలు చేస్తోంది. ఈ లెక్కన అమరావతి పనుల కోసం తీసుకొనే అప్పులు రూ.70వేల కోట్లకు చేరుకుంటాయి. భవిష్యత్తులో ఈ రుణాలు భారం కాకముందే వాటిని తీర్చడానికి ల్యాండ్ మానిటైజేషన్ కార్యక్రమాన్ని తెరపైకి తెచ్చింది.

భూముల ధరలకు రెక్కలు

"గతంలో ల్యాండ్ పూలింగ్ ద్వారా సేకరించిన భూమిలో రైతులకు రిటర్నబుల్ ప్లాట్లు ఇచ్చేశాం. అవి పోను సీఆర్‌డీఏకి 4వేల ఎకరాలు మిగులుతుంది. ఆ భూమిని వేలం వేసి, రాజధాని నిర్మాణానికి ప్రపంచ బ్యాంకు, ఏడీబీ, హడ్కో వంటి సంస్థల నుంచి తీసుకున్న రుణాలను తిరిగి చెల్లించేలా ప్రణాళికలు సిద్ధం చేశాం" అని పురపాలక శాఖ మంత్రి పి. నారాయణ అనేక సందర్భాల్లో స్పష్టం చేశారు. అమరావతిలో భూముల ధరలు ఇప్పటికే గణనీయంగా పెరిగాయి. ప్రస్తుత అభివృద్ధి పనులతో రానున్న రోజుల్లో మరింతగా పెరుగుతాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని అందుబాటులో ఉన్న భూముల్లో 4వేల ఎకరాలను ల్యాండ్ మానిటైజేషన్ జాబితాలో చేర్చాలని నిర్ణయించింది. ఏయే ప్రాంతాల్లోని భూములను ఈ జాబితాలో చేరుస్తారన్న దానిపై స్పష్టత రావాల్సి ఉంది. ఈ విధంగా జాబితాలో చేర్చిన భూములను ఎకరం రూ.20కోట్ల చొప్పున విక్రయించనుంది. తద్వారా రూ.80 వేల కోట్ల ఆదాయం సమకూరుతుంది. దీంతో రానున్న రోజుల్లో అప్పుల భారం, ఆర్థిక ఇబ్బందులు వంటివి రాజధాని పనులపై ఎలాంటి ప్రభావం చూపించే అవకాశం ఉండదని చెబుతున్నారు. అమరావతికి ప్రస్తుతం ఉన్న 34వేల ఎకరాలతో పాటు మరో 44 వేల ఎకరాలు సమీకరించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఇప్పటికిప్పుడు గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం, స్మార్ట్ ఇండస్ట్రియల్ సిటీ, స్పోర్ట్స్ సిటీలకు 10వేల ఎకరాలు సమీకరించి మిగిలిన భూములను ప్రాజెక్టుల పనులన్నీ ఓ కొలిక్కి వచ్చాక సమీకరించాలన్న ఆలోచనలో ప్రభుత్వం ఉంది. ఈ భూముల్లో కొన్నింటిని ఆ తర్వాత రెండో దశ ల్యాండ్ మానిటైజేషన్ జాబితాలో 60:40 విధానంలో రియల్ ఎస్టేట్ సంస్థలకు అప్పగించాలని భావిస్తోంది. ఇప్పటికే బెంగళూరులోని టాప్-5 రియల్ ఎస్టేట్-డెవలప్‌మెంట్ సంస్థలతో సీఆర్‌డీఏ అధికారులు, మంత్రి నారాయణ చర్చలు జరిపారు. ఈ 60:40 విధానం వల్ల అభివృద్ధి చేసిన ఇళ్లు, విల్లాలు, కమర్షియల్ స్పేస్, అపార్ట్‌మెంట్లలో ప్లాట్లు ఇలాంటివన్నీ సీఆర్‌డీఏకు ఆస్తులుగా సమకూరుతాయి. భవిష్యత్తులో ఆర్థిక అవసరాలను తీర్చటానికి కూడా ఇవి ఉపయోగపడతాయని అంచనా వేస్తున్నారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న పౌరసరఫరాల మంత్రి మనోహర్

మీరా రైతుల గురించి మాట్లాడేది?

» వైసీపీ ప్రభుత్వంలో ఏనాడైనా రైతులను ఆదుకున్నారా?

» వాస్తవాలు తెలుసుకోకుండా మాట్లాడొద్దు జగన్

» మంత్రి మనోహర్ ధ్వజం

కాకినాడ, మే 4(ఆంధ్రజ్యోతి): 'వైసీపీ హయాంలో నరకం చూసిన రైతులు.. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆనందంగా జీవిస్తున్నారు. ఓర్వలేని మాజీ సీఎం జగన్ సడన్‌గా నిద్రలోంచి లేచి.. అన్నం పెట్టిన రైతుకు ప్రభుత్వం సున్నం కొట్టిందంటూ అవమానకరంగా మాట్లాడడం బాధాకరం' అని పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. ఆదివారం కాకినాడలో ఆయన మీడియాతో మాట్లాడారు. ధాన్యం కొనుగోలు విషయంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. వాస్తవ పరిస్థితులకు దూరంగా ఉంటూ.. వర్క్ ఫ్రం బెంగళూరు ఎమ్మెల్యేగా పనిచేస్తున్న జగన్ మాట్లాడడం విచిత్రంగా ఉందన్నారు. గత వైసీపీ ప్రభుత్వం రైతులకు రూ.1,674 కోట్ల ధాన్యం కొనుగోలు బకాయిలు పెట్టిందని, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నెలలోనే ఆ బకాయిలు చెల్లించిందని పేర్కొన్నారు. మిల్లర్లకు రూ.400 కోట్ల బకాయిలు చెల్లించలేదని, పౌరసరఫరాల శాఖలో రూ.41 వేల కోట్ల అప్పులు చేసి వెళ్లిపోయారని మండిపడ్డారు. వీళ్లా రైతుల సంక్షేమం గురించి మాట్లాడేది? అని మంత్రి మనోహర్ దుయ్యబట్టారు.

ముందు వాస్తవాలు తెలుసుకోండి

తమ ప్రభుత్వం ఖరీఫ్, రబీల్లో 48.34 లక్షల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసిందని, రూ.11 వేల కోట్ల సొమ్మును రైతుల ఖాతాల్లో జమ చేశామన్న విషయాన్ని జగన్ తెలుసుకోవాలని మంత్రి హితవు పలికారు. ఇంకా 10 లక్షల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. దీనిపై సోమవారం కాకినాడ జిల్లా కలెక్టరేట్లో తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల అధికారులతో సమావేశం కానున్నట్టు వెల్లడించారు. రోమ్ చక్రవర్తి ఇంట్లో కూర్చుని ఫిడేల్ వాయించినట్లుగా జగన్ తన ప్యాలెస్‌లో కూర్చుని అకాల వర్షాలు, తుపాన్ల సమయంలో రైతులను అవమానించేలా మాట్లాడారే తప్ప, ఎక్కడ రైతులను ఆదుకున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. మిల్లులకు ధాన్యం అమ్ముకునేందుకు వచ్చిన రైతును రేండమైజేషన్ పద్ధతి పెట్టి.. సాఫ్ట్‌వేర్‌లో మోసం చేసి వారికి నచ్చిన మిల్లుకే దారిమళ్లించిన విషయం వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. రేటు, మిల్లులు వారే నిర్ణయించుకుని డబ్బులు మాత్రం రైతుల ఖాతాల్లో వేసేవారు కాదని, వారి కుంభకోణాలకు మాత్రమే రైతులను వినియోగించుకున్నారని విమర్శించారు.

మిల్లర్లు రైతులకు అండగా నిలవాలి

మొదటిసారి రైసుమిల్లర్లకు బ్యాంకు గ్యారంటీల విషయంలో డబ్బులు సరిపోవడం లేదంటే 1:2 నిష్పత్తిలో వెసులుబాటు కల్పించామని మంత్రి మనోహర్ పేర్కొన్నారు. రైసుమిల్లర్లు ప్రభుత్వానికి, రైతులకు మధ్య వారధిగా నిలవాలని, ఆ బాధ్యత ఉందని గుర్తుచేశారు. ప్రభుత్వం ఇచ్చే గోతాలను రైతులకు ఇవ్వకుండా మిల్లర్లు ఇబ్బంది పెట్టడం సరికాదన్నారు. మిల్లర్లకు ప్రభుత్వం బకాయిలు చెల్లించి అండగా నిలిచిందన్నారు. ధాన్యం కొనుగోలు చేయగానే సీఎంఆర్ ద్వారా డబ్బులు చెల్లిస్తామన్న మాటను నిలుపుకున్నామన్నారు. ధాన్యం కొనుగోలుకు నిర్ణయించిన టార్గెట్లను పెంచుతామని తెలిపారు. మీడియా సమావేశంలో కాకినాడ ఎంపీ ఉదయ్ శ్రీనివాస్, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ ఛైర్మన్ తోట సుధీర్, కౌడా ఛైర్మన్ తుమ్మల రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

పంటకుంటలతో సాగుకు మహర్దశ!

ఉపాధి పథకంలో 1.55 లక్షల కుంటలు లక్ష్యం .. ఇప్పటికి 25 వేల కుంటల తవ్వకం పూర్తి

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో ఉపాధి హామీ పథకంలో వినూత్న పనులు చేపట్టడం ద్వారా పేదవర్గాలతో పాటు సన్న, చిన్నకారు రైతులకు పలు ప్రయోజనాలు దక్కుతున్నాయి. అడుగంటిపోతున్న భూగర్భజలాలను భూమి పైపొరలకు తీసుకురావడం ద్వారా పొలాల్లో సిరులు పండించేందుకు ఉపాధి హామీ పథకం ఎంతో ఉపయోగపడుతోంది. అందుకోసం ఎన్నో కార్యక్రమాలు చేపట్టిన గ్రామీణాభివృద్ధిశాఖ తాజాగా పొలాల్లో పంటకుంటల వల్ల విస్తృత ప్రయోజనాలు కలుగుతాయని భావించింది. ప్రతి రైతు పొలంలో కొంత స్థలంలో కుంటలు తవ్వడం ద్వారా వర్షాకాలంలో నీటిని నిల్వ చేసుకోవడంతో భూగర్భజలాలు పెరిగేందుకు కృషిచేస్తున్నారు. ఒకసారి వర్షం వచ్చినప్పుడు ఒక్కో పంటకుంట ద్వారా 1.80 లక్షల లీటర్ల నీటిని నిల్వ చేసుకునే అవకాశం కల్పించారు. రైతులు ఒక్క పైసా చెల్లించకుండానే ఉపాధి పథకం ఈ అవకాశం కల్పించింది. రాష్ట్రవ్యాప్తంగా ఈ ఏడాది 1.55 లక్షల పంటకుంటల తవ్వడం ద్వారా దాదాపు ఒక టీఎంసీ వర్షపు నీటిని నిల్వ చేసుకోవచ్చని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ కృష్ణతేజ తెలిపారు. బోరుబావులు లేని రైతులకు పంటకుంటలే పంటసంజీవనిలు. పంటకుంటచుట్టూ వేసిన మట్టికట్టమీద ఆకుకూరలు, కూరగాయలు పండించుకుని అదనపు ఆదాయం పొందే అవకాశముంది. దీర్ఘకాలంలో ఆదాయాన్నిచ్చే బొప్పాయి, అరటి, జామ, కరివేపాకు వంటి మొక్కలను నాటుకోవడం, మందుల పిచికారి ద్వారా అదనపు ప్రయోజనం పొందొచ్చు. ఈ కుంటలలో చేపలు కూడా పెంచుకోవచ్చు. బోరుబావి ఉన్న పొలంలో పంటకుంటలు తవ్వడం వల్ల ఊట పెరిగి రైతు ఎక్కువ విస్తీర్ణంలో వ్యవసాయం చేసుకోవడానికి అవకాశముంటుంది. ఉపాధి పథకం ద్వారా ఈ పంటకుంటల తవ్వడం ద్వారా రైతుకు రూ.50 వేల ఖర్చు ఆదా అవుతుంది. వాటి నిర్మాణం వల్ల పొలం నష్టం పోతామనే భావన నుంచి బయటకు వచ్చి.. బహువిధాలుగా ఆదాయాన్నిచ్చే పంటకుంటలను తవ్వించుకుని ప్రతి రైతు లబ్ధిపొందాలని కమిషనర్ కృష్ణతేజ ఒక ప్రకటనలో కోరారు.



పంటపొలంలో తవ్విన నీటికుంట

అల్లూరి జిల్లాలో 4,030 కుంటలు పూర్తి..

రాష్ట్రంలో ఈ ఏడాది 1.55 లక్షల పంటకుంటలు తవ్వాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పటి దాకా 25 వేల పంటకుంటల తవ్వకాలను పూర్తి చేశారు. ఇందులో అత్యధికంగా అల్లూరి సీతారామ రాజు జిల్లాలో 4,030, అన్నమయ్య జిల్లాలో 3,067, పార్వతీపురం మన్యం జిల్లాలో 2,521 పంటకుంటల తవ్వకాలు పూర్తి చేశారు. తద్వారా ఈ మూడు జిల్లాలు మొదటి మూడు స్థానాల్లో నిలిచాయి.





కోనసీమ జిల్లా ముమ్మిడివరం పంచాయతీ సూరాయిచెరువు లేఅవుట్‌లో వేసిన ధాన్యం రాశుల చుట్టూ చేరిన నీరు

తాడిగడపలో ఆదివారం ఉదయం 7 గంటల సమయంలో కారు మబ్బులు కమ్ముకున్న దృశ్యం



ఏలూరు మినీబైపాస్ రోడ్డులో విరిగిపడిన చెట్టు

మంత్రుల సమీక్ష

అకాల వర్షాలపై హోం మంత్రి అనిత విపత్తు నిర్వహణ సంస్థ అధికారులతో మాట్లాడి, ఎప్పటికప్పుడు హెచ్చరికలు జారీ చేయించారు. పంట నష్టం జరగకుండా రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మంత్రి అచ్చెన్నాయుడు వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక, మత్స్యశాఖ అధికారులను అప్రమత్తం చేశారు.

అకాల వర్షం.. తీరని నష్టం

(మొదటి పేజీ తరువాయి)

కూడిన భారీ వర్షం పడింది. కాకినాడ, ఏలూరు, కోనసీమ జిల్లాల్లో వాన దంచి కొట్టింది. కాకినాడ జిల్లా కాజులూరులో అత్యధికంగా 105 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. 130 చోట్ల 20 మిల్లీమీటర్ల కన్నా అధికంగా వాన పడింది. గోదావరి జిల్లాల్లో వేలాది ఎకరాల్లో వరి, అరటి, కొబ్బరి, బొప్పాయి తోటలు దెబ్బతిన్నాయి. కృష్ణా, గోదావరి డెల్టా ప్రాంతాల్లో రోడ్లపై ఆరబోసిన ధాన్యం తడిసింది. ఎన్టీఆర్, ఏలూరు జిల్లాల్లో మామిడి పంటకు అపార నష్టం వాటిల్లింది. ఏలూరు, కాకినాడ, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల్లో చాలా చోట్ల చెట్లు విరిగిపడ్డాయి. హోర్డింగ్‌లు పడిపోయాయి. విజయవాడ సహా పలు నగరాల్లో పల్లపు ప్రాంతాలు జలమయయ్యాయి.

మరో 2 రోజులు ఇదే పరిస్థితి

రాష్ట్రంలో మరో రెండు రోజులు భిన్న వాతావరణం ఉంటుందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. కొన్ని చోట్ల 41-42 డిగ్రీల ఉష్ణోగ్రతలు, మరికొన్ని చోట్ల ఈదురు గాలులతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. సోమ, మంగళవారాల్లో శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, అల్లూరి, విశాఖపట్నం, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో అక్కడక్కడా పిడుగులు, బలమైన గాలులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. అనకాపల్లి, ఉభయగోదావరి, కృష్ణా, నెల్లూరు, కర్నూలు, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడతాయని పేర్కొంది. ఆదివారం నంద్యాల జిల్లా గోనవరంలో 42.7 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది.

తిరుపతి జిల్లాలో ఇద్దరు మృతి

తిరుపతి జిల్లాలో ఈదురుగాలులతో పాటు మెరుపులు, ఉరుములతో భారీ వర్షం కురిసింది. నాయుడుపేట మండలం వద్దిగుంట కండ్రిగ గ్రామానికి చెందిన భాస్కర్ (50), ఓజిలి మండలం గ్రద్దగుంట పంచాయతీ గొల్లపాలెం వద్ద కార్తీక్ అనే బాలుడు పిడుగుపాటుకు మృత్యువాత పడ్డారు. తిరుపతిలో ఈదురుగాలుల ప్రభావం భయాందోళనకు గురిచేసింది. పలుచోట్ల వందేళ్ల నాటి వృక్షాలు నేలకొరిగాయి. తిరుపతి రూరల్ మండలం చిగురువాడ పంచాయతీలో ట్రాన్స్‌ఫార్మర్‌పై చెట్టుకూలిందన్న సమాచారంతో వెళ్లిన సచివాలయ జేఎల్ఎం మురళి మరమ్మతులు చేస్తుండగా ప్రమాదవశాత్తు తీవ్రంగా గాయపడ్డారు. చిత్తూరు జిల్లా అంతటా భారీ వర్షం కురిసింది. శని, ఆదివారాల్లో గాలి వానతో మామిడి కాయలు నేల రాలాయి. సుమారు వెయ్యి ఎకరాల్లో ఉద్యాన పంటలకు నష్టం కలిగిందని అంచనా వేస్తున్నారు. అరటి, బొప్పాయి పంటలు దెబ్బతిన్నాయి. విద్యుత్తు స్తంభాలు నేలకొరగడంతో ఆ శాఖకు రూ.20లక్షలకుపైగా నష్టం కలిగింది.

జోరువాన

నెల్లూరు జిల్లాలో గాలివాన బీభత్సం సృష్టించింది. మెట్ట ప్రాంతాల్లో ఉద్యాన పంటలకు కొంతమేర నష్టం వాటిల్లినట్టు సమాచారం. రాపూరు మండలం రావిగుంటపల్లి గ్రామానికి చెందిన తాటిబోయిన చిన్నయ్య(50) గొర్రెలు మేపడానికి అడవికి వెళ్లగా, పిడుగుపాటుకు గురై మృతి చెందాడు. పలు చోట్ల విద్యుత్ స్తంభాలు, చెట్లు నేలకొరిగాయి. నెల్లూరులో నీట్ పరీక్ష రాసేందుకు వచ్చిన విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు వర్షంలో తడిసి ముద్దయ్యారు. అకాలవర్షాలు బాపట్ల జిల్లాను ముంచెత్తాయి. కొల్లూరు మండలం పరిధిలోని గాజుల్లంక గాలు మార్గం లో పిడుగుపడి మాతంగి సుప్రదీప్(23) మృతిచెందాడు. కృష్ణాజిల్లా మొవ్వ మండలం కోసూరుకు చెందిన అతడు స్నేహితుడితో కలిసి బైక్‌పై వెళ్తుండగా పిడుగుపడింది. సుప్రదీప్ తలకు గాయమై అక్కడికక్కడే మృతి చెందగా, స్నేహితుడు స్వల్పగాయాలతో బయటపడ్డాడు. పర్చూరు నియోజకవర్గం చిన్నగంజాంలోని కొమ్మమూరు కాలువ వద్ద గొర్రెల కాపరి గడ్డం బ్రహ్మయ్య (47)పై పిడుగు పడటంతో అక్కడికక్కడే మృతిచెందాడు. అకాల వర్షం చిన్నగంజాం ప్రాంతంలో ఉప్పుసాగు చేసిన రైతులను తీవ్రంగా దెబ్బతీసింది. చీరాలలో గాలివాన జనజీవనాన్ని అతలాకుతలం చేసింది. చీరాల, బాపట్ల రూరల్ ప్రాంతాలలో వడగళ్ల వానతో మామిడితోటలకు భారీగా నష్టం వాటిల్లింది. అరటి, మొక్కజొన్నతోపాటు పొగాకు రైతులకు నష్టం జరిగింది. కొల్లూరు, చీరాలలో వృక్షాలు, విద్యుత్ స్తంభాలు పడిపోయాయి.



విజయవాడలో కురిసిన భారీ వర్షంలో ద్విచక్రవాహనంపై ఓ కుటుంబం తిప్పలు పడుతున్న దృశ్యం

గోదావరిలో భారీ నష్టం

ఏలూరు జిల్లాలో పెనుగాలులు బీభత్సం సృష్టించాయి. భారీ వర్షాలకు వరి పంట తడిసి ముద్దయింది. మామిడి కాయలు రాలిపోయాయి. అరటి తోటలకు తీవ్రనష్టం వాటిల్లింది. పలుచోట్ల భారీ వృక్షాలు నేలకూలాయి. విద్యుత్ స్తంభాలు నేలకొరగడంతో జిల్లా వ్యాప్తంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ముసునూరు మండలం చెక్కపల్లిలో ఇంటిపై వెలగచెట్టు విరిగిపడడంతో మామిడి బాలగోవింద్ (12) మృతి చెందగా, అతని తండ్రి మారేశు తీవ్రంగా గాయపడ్డాడు. దెందులూరులో ఇంటిముందు విద్యుత్ సర్వీస్ వైరు తెగి పడటంతో విద్యుద్ఘాతానికి గురై తానికొండ జార్జి (53) మృతిచెందాడు. మండవల్లి మండలం దెయ్యంపాడులో సైదు గిరిబాబు (33) రొయ్యల చెరువు వద్ద మేత మేస్తుండగా పిడుగు పడి మృతి చెందాడు. పశ్చిమ గోదావరి జిల్లాలో ఈదురు గాలులు, భారీ వర్షాలు బీభత్సం సృష్టించాయి. జిల్లా వ్యాప్తంగా లక్ష టన్నుల ధాన్యం రాశుల్లోనే తడిచిపోయింది. దాదాపు 5వేల ఎకరాలలో వరి పంట నేలవారింది. మామిడి పంటకు తీవ్రనష్టం వాటిల్లింది. మొగల్తూరు మండలంలో 950 ఎకరాల్లో మామిడిపంట దెబ్బతింది. ఈదురుగాలులతో 200 విద్యుత్ స్తంభాలు నేలకొరగడంతో జిల్లా అంతటా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వరుణుడు ముంచెత్తాడు. రాజమహేంద్రవరంలో రహదారులన్నీ కాల్వలను తలపించాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో భారీ వర్షం కురిసింది. ధాన్యం తడిసి ముద్దయింది. అమలాపురం పట్టణంతో పాటు కోనసీమ వ్యాప్తంగా పలు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. సుమారు 3గంటల పాటు ఏకధాటిగా కురిసిన వర్షంతో కాకినాడ జిల్లా అతలాకుతలమైంది. ఈదురుగాలులతో మామిడి పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. వరి పంటకూ భారీ నష్టం కలిగింది. విద్యుత్ స్తంభాలు నేలకొరగగా, వైర్లు తెగిపడ్డాయి. కాకినాడ నగరం జలమయమైంది.

విజయవాడలో భారీ వర్షం

ఎన్టీఆర్ జిల్లాలో గాలివాన దుమారం రేపింది. ఆదివారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు హోరున వాన కురిసింది. జిల్లాలోని పెనుగంచిప్రోలు, జగ్గయ్యపేట మండలాల్లో తప్ప మిగిలిన అన్ని మండలాల్లో వర్షం కురిసింది. విజయవాడ నగరంలో చెట్లు నేలకూలాయి. కొన్ని వాహనాలు స్వల్పంగా దెబ్బతిన్నాయి. రహదారులు వర్షం నీటితో నిండిపోయాయి. భక్తుల భద్రత దృష్ట్యా ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వర దేవస్థానం ఘాట్‌రోడ్డును మూసివేశారు. జిల్లాలో మొత్తం 297.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. మామిడి రైతులను వర్షాలు కోలుకోలేని దెబ్బతీశాయి. ఉన్న ధాన్యం తడిసిపోయింది. కృష్ణాజిల్లా వ్యాప్తంగా ఈదురుగాలులతో భారీవర్షం కురిసింది. ధాన్యం, ఆరబెట్టిన మొక్కజొన్న తడిచింది. అరటి తోటలు దెబ్బతిన్నాయి. మామిడి కాయలు రాలిపోయాయి.

వెలగపూడిలో కూలిన విద్యుత్ హైఓల్టేజీ టవర్

» ప్రధాని సభావేదికకు కూతవేటు దూరంలో ఘటన

» వైసీపీ హయాంలో బోల్టులు కాజేసిన దుండగులు



గుంటూరు, మే 4(ఆంధ్రజ్యోతి): రాజధానిలోని వెలగపూడి గ్రామంలో విద్యుత్ హై ఓల్టేజీ ట్రాన్స్‌మిషన్ టవర్ కూలిపోయింది. ఆదివారం ఉదయం సంభవించిన గాలివాన బీభత్సానికి టవర్ పక్కకు పడిపోయింది. ఈనెల 2న ప్రధాని మోదీ సభ జరిగిన ప్రదేశానికి అతి సమీపంలోనే ఎన్-9 రోడ్డుకు దగ్గరలో ఈ-7, ఈ-8 రోడ్ల మధ్య ఈ టవర్ కూలిపోవడం గమనార్హం. ఆ సమయానికి అక్కడ ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ప్రధాని సభ రోజున టవర్ కూలి ఉంటే పరిస్థితి చాలా దారుణంగా ఉండేదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా, టవర్ కూలిపోవడంతో ఆదివారం ఉదయం నుంచి వెలగపూడి ప్రజలు విద్యుత్ సరఫరా లేక ఇబ్బంది పడ్డారు. దీంతో అధికారులు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. కాగా, గత వైసీపీ ప్రభుత్వం రాజధాని నిర్లక్ష్యం చేసింది. దీంతో దుండగులు ఇనుము, కంకర, ఇసుకను ఇష్టారాజ్యంగా దోచుకుపోయారు. ఈ క్రమంలో కొందరు ఈ హైటెన్షన్ విద్యుత్ టవర్ల బోల్టులు, నట్లు, ఇనుప బద్దీలను కూడా పీక్కుపోయారని రైతులు చెబుతున్నారు. ఇలా బోల్టులు పీక్కుపోయిన టవర్లు ఇంకా పదికి పైగా ఉన్నాయని అంటున్నారు.

కరెంటు సరఫరాకు అంతరాయం..

» యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ

» అప్రమత్తంగా ఉండాలని సీఎం, మంత్రి ఆదేశాలు

అమరావతి, మే 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆదివారం నాటి గాలివాన బీభత్సం కరెంటు సరఫరాకు అంతరాయం కలిగించడంతో పాటు చాలా చోట్ల విద్యుత్తు స్తంభాలు, ఫీడర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయి. అయితే తక్షణమే స్పందించిన విద్యుత్తు సిబ్బంది కొన్ని గంటల్లోనే దెబ్బతిన్న ఫీడర్లను, విద్యుత్తు సరఫరాను పునరుద్ధరించారు. రాష్ట్రంలో భారీ గాలులతో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో విద్యుత్తు సరఫరా అంతరాయాలు, ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని సీఎం చంద్రబాబు, ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్‌ను ఆదేశించారు. దీంతో ఏపీ విద్యుత్తు పంపిణీ, సరఫరా, ఉత్పత్తి సంస్థలు అప్రమత్తమయ్యాయి. గాలివానలకు చెట్లు విరిగి తీగలపై పడటం వల్ల విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలిగినా.. 11 కేవీ, 132 కేవీ సబ్‌స్టేషన్లు దెబ్బతిన్నా, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయినా యుద్ధప్రాతిపదికన స్పందించి పునరుద్ధరణ చర్యలు తీసుకోవాలని సీఎస్ ఇంధన సంస్థలను ఆదేశించారు.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, **Editor : N.Rahul Kumar,** RNI No:3470/1960, **Managing Director : Vemuri Radha Krishna, Founder :** K.L.N. Prasad.